
'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 210

శుక్రవారం 20-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నాలుగోసారి ఛేదించేశారు

వన్డే ప్రపంచకప్‌లో భారత్‌కు నాలుగో గెలుపు. కోహ్లి అజేయ సెంచరీ -17లో



రెండోరోజూ అమ్మకాల ఒత్తిడి

కొనసాగిన అంతర్జాతీయ ప్రతికూలతలు. సెన్సెక్స్ నష్టం 248 పాయింట్లు -18లో



ఇజ్రాయెల్ ప్రతీకారేచ్ఛ

హమాస్‌పై యుద్ధం పేరిట ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న భీకర దాడుల్లో సాధారణ పాలస్తీనియన్లు బలవుతున్నారు.

- వివరాలు 6లో



నమో భారత్ వచ్చేసింది

దేశంలోనే తొలి సెమీ హైస్పీడ్ రీజనల్ రైలు 'నమో భారత్' శనివారం నుంచి ఢిల్లీవాసులకు అందుబాటులోకి రానుంది.

- వివరాలు 6లో



హమాస్ రాక్షసత్వం

ఆటిజం బాధితురాలైన 12 ఏళ్ల ఇజ్రాయెల్ బాలిక నోయా డాన్‌ను కిడ్నాప్ చేసిన హమాస్ ఆమెను హత్య చేసింది.

- వివరాలు 6లో



అమినికి సఖరోవ్ పురస్కారం

ఇరాన్‌లో పోలీసు కస్టడీలో మరణించిన మహ్సా అమినికి ఈయూ అత్యున్నత మానవ హక్కుల పురస్కారం ప్రకటించింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్


నా నియామకంపై కాంగ్రెస్‌కు ఎందుకంత భయం?



గవర్నర్ పదవిలో తనను నియమిస్తే కాంగ్రెస్ పార్టీ ఎందుకంత భయాందోళనలకు గురై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కు ఫిర్యాదు చేసిందో అర్థం కావడం లేదని త్రిపుర గవర్నర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి వ్యాఖ్యానించారు.

- వివరాలు 15లో

మధ్యంతర బెయిల్ కుదరదు



స్కిల్ స్కాంలో అరెస్టయి రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏపీ హైకోర్టు మరోసారి ఝలక్ ఇచ్చింది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పింది. అలాగే ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని.. ఈ వ్యాజ్యం తేలేలోగా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలంటూ వేసిన ప్రధాన పిటిషన్, అనుబంధ పిటిషన్ల తదుపరి విచారణను వాయిదా వేసింది.

- వివరాలు 19లో

బీజేపీ బీసీ సీఎం!

అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల మద్దతు కూడగట్టడంపై కమలదళం ఫోకస్

- ఆనవాయితీని కాదని అభ్యర్థిని కూడా ముందే ప్రకటించే దిశగా యోచన
- అధికారంలోకి వస్తే బీసీలకు తగిన సంఖ్యలో మంత్రి పదవులు కూడా..
- నెలాఖరులోగా బీసీ గర్జన సభ.. మోదీ లేదా అమిత్ షాతో ప్రకటించే చాన్స్
- బీసీలకే 40, అంతకన్నా ఎక్కువ సీట్లు కేటాయించేలా కసరత్తు
- దీనితో ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ సీట్లలో బీసీ ఓట్లూ పడేలా చేస్తుందనే ఆలోచన
- రెడ్డి సామాజిక వర్గాన్నీ ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు... ఆ దిశగానే ఇంద్రసేనకు గవర్నర్ పదవి అంటున్న నేతలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించే లక్ష్యంతో దూకుడు పెంచుతున్న బీజేపీ.. తాము గెలిస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామన్న నినాదంతో ఎన్నికల గోదాలో తలపడనుంది. తెలంగాణలో బీసీ ఎజెండాతో ముందుకు వెళ్లాలని.. అవసరమైతే బీజేపీ ఆనవాయితీని పక్కనపెట్టి, ముందుగానే సీఎం అభ్యర్థిని ప్రకటించాలని ఆ పార్టీ జాతీయ నాయకత్వం నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇతర పార్టీల కంటే ఎక్కువగా.. కనీసం 40 సీట్లకు తగ్గకుండా బీసీ, ఎంబీసీ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని యోచిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ జనాభాలో 54 శాతానికిపైగా బీసీలే ఉన్నారని.. వారికి భరోసా కల్పించడం ద్వారా మెజారిటీ ఓటర్లను ఆకర్షించి, ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని భావిస్తున్నట్టు వెల్లడించాయి. అంతేగాకుండా 19 ఎస్సీ, 12 ఎస్టీ నియోజకవర్గాల్లో కూడా పార్టీ అభ్యర్థుల గెలుపునకు బీసీల ఓట్లు తోడ్పడతాయని ఆశిస్తున్నట్టు వివరించాయి.

భారీ సభ వేదికగా ప్రకటన!

పార్టీ తీసుకున్న బీసీ ఎజెండాను మరింత బలంగా తీసుకెళ్లేందుకు బీసీని సీఎం చేస్తామని భారీ సభ వేదికగా ప్రధాని మోదీ లేదా కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రకటించే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. ఈ మేరకు నెలాఖరులోగా హైదరాబాద్‌లో భారీ స్థాయిలో నిర్వహించ తలపెట్టిన

మిగతా 7వ పేజీలో ▶


గురువారం భూపాలపల్లి జిల్లా కాటారంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

రాష్ట్రంలో కాంగ్రెస్ సునామీ రానుంది: రాహుల్

ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజల స్వప్నం నెరవేరుతుంది

విజయభేరి సభ, కార్నర్ మీటింగుల్లో ఏఐసీసీ అగ్రనేత

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి రోజే పథకాల అమలుపై సంతకాలు
- సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం
- దేశవ్యాప్తంగా కులగణన చేపడతాం
- కేసీఆర్ ఓ రాజులా పాలిస్తున్నారు
- లక్షల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారు
- బీఆర్ఎస్‌ను అడ్డుపెట్టుకొని మోదీ తెలంగాణను అధోగతిపాలు చేస్తున్నారు
- తెలంగాణతో నాది ఆప్యాయతతో కూడిన కుటుంబ బంధం
- జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల్లో రాహుల్ యాత్ర

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ కాటారం: తెలంగాణలో కాంగ్రెస్ సునామీ రాబోతోందని, ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజల స్వప్నాన్ని నెరవేరుస్తుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తొలిరోజే ఆరు గ్యారంటీల పథకాల అమలుపై సంతకాలు చేస్తామని చెప్పారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాలు కాపాడతామని, ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని చెప్పారు. తెలంగాణలో కేసీఆర్ సీఎంలా కాకుండా రాజులా పాలిస్తున్నారని, కీలక శాఖలన్నీ తన కుటుంబసభ్యుల గుప్పిట్లో పెట్టుకుని రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ,

మిగతా 8వ పేజీలో ▶


గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన దివ్యాంగుల కృతజ్ఞత సభలో కేటీఆర్‌కు దట్టీ కడుతున్న ఓ దివ్యాంగుడు

దేశానికి కాంగ్రెస్ చోర్ టీం

ఆకాశం నుంచి పాతాళం దాకా దోచుకున్న చరిత్ర ఆ పార్టీదే

- కుటుంబ పాలన గురించి రాహుల్ మాట్లాడటం గొంగడిలో వెంట్రుకలు ఏరడమే
- దావూద్, చార్లెస్ శోభరాజ్‌ను మించిన దొంగ రేవంత్
- 10–12 మంది ఎమ్మెల్యేలు గెలిచినా బీజేపీకి గంపగుత్తగా అమ్మేస్తాడు
- దివ్యాంగుల సంక్షేమానికి తొమ్మిదిన్నరేళ్లలో రూ. 10,300 కోట్లు ఖర్చు చేశాం
- ఊత కర్రలా నిలిచిన కేసీఆర్‌కు ఎన్నికల్లో అండగా నిలవండి
- దివ్యాంగుల కృతజ్ఞత సభలో మంత్రి కేటీఆర్

7లో


Greenchef®
మహా మహోత్సవం
700 వాట్స్
1.8 లీటర్లు
5
అదనంగా స్టెయిన్‌లెస్ స్టీల్ కుకింగ్ పాన్ ఉచితం
ప్రత్యేక ధర
₹2,699
(MRP: ₹5,399)
స్టార్క్ రైస్ కుక్కర్
ప్రత్యేక ధర ₹3,099 (MRP: ₹5,298)
ఇగ్నైట్ ఇండక్షన్ కాంబో
ఇగ్నైట్ ఇండక్షన్ + క్లాసిక్ జెర్క్ స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్కర్ 3L + రీగల్ తవా 280MM IB
ప్రత్యేక ధర ₹2,599 (MRP: ₹4,499)
1000 వాట్స్
కాపర్
600 వాట్స్
థండర్‌బోల్ట్ మిక్సర్ గ్రైండర్ కాంబో
థండర్‌బోల్ట్ మిక్సర్ గ్రైండర్ + ఐరన్ 407
ప్రత్యేక ధర ₹2,399
ఉచితం
1.8 లీటర్లు
24
700
కార్లో ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ కాంబో
ప్రత్యేక ధర ₹1,199
1.5 లీటర్లు
24
700
స్విఫ్ట్ స్టెయిన్‌లెస్ స్టీల్ కెటిల్ కాంబో
ప్రత్యేక ధర ₹2,699
IS: 4246
CM/L-6248258
ఆర్బిట్ డబుల్ బర్నర్ గ్లాస్‌టాప్
ప్రత్యేక ధర ₹2,199
ఉచితం రీగల్ తవా 280 MM IB
క్లాసిక్ స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్కర్ 2-ఇన్-1 కాంబో
3L కుక్కర్ + 2L పాన్
ప్రత్యేక ధర ₹2,799
ఉచితం రీగల్ తవా 280 MM IB
క్లాసిక్ స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్కర్ కాంబో
ప్రత్యేక ధర ₹9,999
1350 m³/hr
ఉచితం
బ్లాక్ పెర్ల్ ప్రో 60CM BK చిమ్నీ
ప్రత్యేక ధర ₹17,299
BLDC
1550 m³/hr
2
జెలో 60CM BK చిమ్నీ మరియు బ్లేజ్ డబుల్ బర్నర్ కాంబో
గ్రీన్‌చెఫ్
మిస్డ్ కాల్ సర్వీస్ +91 7848992244
greenchef.in
Follow us on
HYDERABAD DISTRIBUTOR: Rathi Trading Company, R Anil: 9513442689, Anil Thati: 9513442691, Manoj: 7416039747, Anjaneyulu: 8179624423, Nagarjuna: 9603676865, M. Satish: 9000532746, Vignesh: 9291414414, Chandra Shekar: 9849723361, Qamar: 9866103104, Lokesh: 7287024370, Pavan: 7981499804, Joseph: 9290517253

47 మంది హైకోర్టు మాజీ న్యాయమూర్తులకు సీనియర్ హోదా

తెలంగాణ, ఏపీ నుంచి ఏడుగురు

సాక్షి, న్యూఢిల్లీ: 47 మంది హైకోర్టు మాజీ న్యాయమూర్తులకు సీనియర్ హోదా ఇవ్వాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. వీరిలో తొమ్మిది మంది హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులున్నారు. ఈ నెల 16న జరిగిన ఫుల్ కోర్ట్ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ 47 మంది మాజీ న్యాయమూర్తుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల నుంచి ఏడుగురు ఉన్నారు. సీనియర్ హోదా పొందిన వారిలో తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ రెడ్డి కాంతారావు, జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్, జస్టిస్ అనుగు సంతోష్ రెడ్డి, జస్టిస్ డాక్టర్ అద్దుల వెంకటేశ్వర రెడ్డి సీనియర్ హోదా పొందారు. అలాగే, ఏపీ హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ వి.ఈశ్వరయ్య, జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ఉన్నారు.




తెలంగాణ హైకోర్టు 'డిజిటలైజేషన్ వింగ్'ను ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తులు

కానిస్టేబుల్ మెడికల్ టెస్ట్‌లు ఆపండి

జిల్లా ఎస్పీలు, కమిషనర్లకు టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు తీర్పు నేపథ్యంలో కానిస్టేబుల్ అభ్యర్థులకు మెడికల్ టెస్టులు ఆపాలని జిల్లా ఎస్పీలు, కమిషనర్లకు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది. 2022, ఆగస్టు 30న జరిగిన కానిస్టేబుల్ నియామక తుది రాత పరీక్షలో 23 ప్రశ్నలకు అభ్యంతరాలు తెలుపుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష నుంచి 4 ప్రశ్నలు తొలగించి..మార్కులను లెక్కించి, మళ్లీ ఫలితాలు వెల్లడించాలని రాష్ట్ర పోలీస్ నియామక బోర్డును ఆదేశించింది. 122, 130, 144వ ప్రశ్నలను తెలుగులోకి అనువదించలేదని, 57వ ప్రశ్న తప్పుగా ఉన్నందున వాటిని ప్రశ్నపత్రం నుంచి తొలగించాలని తేల్చిచెప్పింది.



21 నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ ఉత్సవాలు


డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్‌ను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే 21 నుంచి 31 వరకు పోలీసు ఫ్లాగ్‌డే పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు గురువారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలు, విధినిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు, పోలీసుల నుంచి ప్రజలు ఇంకా ఏ రకమైన సేవలు ఆశిస్తున్నారన్న అంశాలపై ఈ పది రోజులలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు వివరించారు. రాష్ట్రంలోని ప్రతీ పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి, పోలీసు శాఖ కృషిని, సేవలను పౌరులకు తెలియచెబుతామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 'పోలీసులకు–పని జీవిత సమతుల్యత', 'సమాజంలో లింగ సమానత్వాన్ని కాపాడటంలో పోలీసుల పాత్ర' అనే అంశాలపై ఎస్సై, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయి అధికారులకు కూడా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీనియర్ పోలీసు అధికారులు అమరుల ఇళ్లను సందర్శించి వారి కుటుంబాల బాగోగులు, వారి అవసరాలను తెలుసుకొని పరిష్కరించే ప్రయత్నం చేయాలని డీజీపీ ఆదేశించారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: దసరా సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు సికింద్రాబాద్–సంత్రాగచ్చి (07645/07646) స్పెషల్ ట్రైన్ ఈ నెల 20న ఉదయం 8.40కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.40కి సంత్రాగచ్చి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 21వ తేదీ మధ్యాహ్నం 12.20కి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–నర్సాపూర్ (07062) ఈ నెల 22వ తేదీ రాత్రి 10.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.10 కి నర్సాపూర్ చేరుకుంటుంది. నాందేడ్–కాకినాడ (07055/07056) స్పెషల్ ట్రైన్ 21వ తేదీ మధ్యాహ్నం గం .3.25కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30కు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 22వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు నాందేడ్ చేరుకుంటుంది. విశాఖపట్టణం –కర్నూల్ (08585/08586) స్పెషల్ ట్రైన్ ఈ నెల 24, 31, నవంబర్ 7, 14 తేదీల్లో సాయంత్రం 5.35కు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.35కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 25, నవంబర్ 1, 8, 15 తేదీల్లో మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.50 కి విశాఖ చేరుకుంటుంది.





వారితో ఇలా అను: "ప్రతి ఒక్కడు తనకు తోచినట్లే పనులు చేస్తాడు, కాని మీ ప్రభువుకు మాత్రం ఎవడు సన్మార్గం పొందేవాడో బాగా తెలుసు".
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 20 అక్టోబర్ 2023

చేతులు కాలకముందే...

ఆగ్రహం ఉండొచ్చు, ఆవేశం ఉండొచ్చు. కానీ సంయమనం మరిచి ఆగ్రహకారకుల్ని నిర్మూలించాలనుకోవటం ఉన్మాదమవుతుంది. చివరికది స్వీయ విధ్వంసానికి దారి తీస్తుంది. ఈ విషయంలో అమెరికాకు చాలా అనుభవం ఉంది. అందుకే కావొచ్చు ఇజ్రాయెల్‌కు సంఘీభావంగా పర్యటించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూకు ఇచ్చిన సలహా ఎంతో విలువైనది. ఆగ్రహాగ్నిని సకాలంలో చల్లార్చుకోనట్టయితే అది మిమ్మల్నే దహిస్తుందని చెప్పటమే కాదు... ఉగ్రదాడి తర్వాత అమెరికా తీసుకున్న చర్యలు ఎలా పరిణమించాయో గుర్తు చేశారు. ఈనెల 7న హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించి విచక్షణారహితంగా వందలమందిని హతమార్చటాన్ని ఎవరూ సమర్థించలేదు. అదే సమయంలో దాడి కారకులపై అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా చర్య తీసుకోవాలని ఇజ్రాయెల్‌ను కోరారు. మిలిటెంట్లు రెచ్చిపోయినప్పుడో, దేశంలో ఎన్నికలు సమీపిస్తున్నప్పుడో ఇజ్రాయెల్ అతిగా వ్యవహరించి పాలస్తీనా పౌరుల ప్రాణాలు తీస్తుండటం దశాబ్దాలుగా రివాజైంది. వెస్ట్‌బ్యాంక్, గాజా, లెబనాన్‌లపై అపాచే హెలికాప్టర్లు, ఎఫ్–16 యుద్ధ విమానాలతో క్షిపణుల వర్షం కురిపిస్తూ ఆసుపత్రులు, స్కూళ్లు, జనావాసాలు నేలమట్టం చేసిన ఉదంతాలు ఎన్నో వున్నాయి. ఇలాంటి సమయాల్లో క్షతగాత్రుల్ని ఆదుకోవటానికీ, ఇతరత్రా సాయం అందించటానికీ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పనిచేసే సంస్థలకు కూడా అనుమతులు లభించవు. ఇప్పుడు జరుగుతున్నదీ అదే. మందులు, ఆహారపదార్థాలు అందించటానికి ఈజిప్టువైపునున్న సరిహద్దుల్లో వందలాది ట్రక్కులు రెండురోజులుగా నిలిచిపోయాయి. మరోపక్క ఇజ్రాయెల్ భీకర దాడులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఒక ఆసుపత్రిపై జరిగిన రాకెట్ దాడిలో 500 మంది చనిపోయారు. ఇప్పటికే దాదాపు అయిదువేల మంది పాలస్తీనా పౌరులు చనిపోగా, పదివేలమంది గాయాలపాలయ్యారు. హమాస్ ప్రయోగించిన రాకెట్ గురి తప్పి ఆసుపత్రిపై పడిందని ఇజ్రాయెల్, అది ఇజ్రాయెల్ దళాల పనేనని హమాస్ అంటున్నాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో బైడెన్ హితవచనం కీలకమైనది. కానీ ఆసుపత్రిపై జరిగిన దాడి విషయంలో ఇజ్రాయెల్‌ను వెనకేసుకు రావటం సరైందేనా? యుద్ధమంటూ మొదలయ్యాక కారకులు ఎవరో వెంటనే గుర్తించలేకపోవటం సర్వసాధారణం. కనీసం ఆ సంగతి తేలేవరకూ కూడా ఆగకుండా ఇజ్రాయెల్ వాదనను సమర్థించటం న్యాయమేనా? వేలాదిమంది క్షతగాత్రులకు వైద్య సాయం నిలువరించి, పదిలక్షల మందిని ఆకలిదప్పుల్లో ఉంచటం సమస్యను చక్కదిద్దగలదని ఆయన విశ్వసిస్తున్నారా? ఈ విషయంలో ఇజ్రాయెల్ తీరును తప్పుబట్టాల్సిన అవసరం లేదా? హమాస్ చెరలో బందీలుగా వున్న 200 మందినీ విడుదల చేసేవరకూ గాజాకు ఏ రకమైన మానవతా సాయం అందనీయబోమని నెతన్యాహూ చేసిన ప్రతిన ఏ నాగరిక ప్రమాణాలతో చూసినా నిరసించదగ్గది. ఇజ్రాయెల్ రక్షణకు కావాల్సిన 'అసాధారణ ప్యాకేజీ' కోసం అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రతిపాదిస్తానని చెబుతున్న బైడెన్‌కు సాధారణ ప్రజానీకం గోడు పట్టిన దాఖలాలు లేవు. 2001లో అమెరికాపై ఉగ్రదాడి తర్వాత తీసుకున్న చర్యలతో తమకు న్యాయం దక్కిందని, ఆ క్రమంలో తప్పులు కూడా జరిగాయని ఆయన అంగీకరించటం మంచిదే. ఆనాడు ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధానికి సెనెటర్‌గా ఆయన కూడా మద్దతునిచ్చారు. అది ఇరాక్ వినాశనానికే కాక, అమెరికా ఆర్థిక పతనానికి సైతం కారణమైంది. ఈ చేదు అనుభవాలను బైడెన్ పరోక్షంగా ప్రస్తావించటంకాక కుండబద్దలు కొట్టినట్టు చెప్పివుంటే బాగుండేది. ఎందుకంటే ఇప్పుడు ఇజ్రాయెల్ అక్షరాలా ఉగ్రరూపం దాల్చింది. గతంలో కేవలం ఒకే ఒక సైనికుడి కోసం వేయిమంది పాలస్తీనా పౌరులను విడిచిపెట్టిన ఆ దేశం... హమాస్ చెరలో 200 మంది ఇజ్రాయెల్ పౌరులుండగా ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నది. అది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో బందీగా ఉన్న యువతి షెమ్ వీడియో తెలియజేస్తోంది. బాంబుల మోతలతో తాము చావుబతుకుల్లో బిక్కుబిక్కుమంటూ వున్నామని, తమను రక్షించటానికి పూనుకోవాలని ఆమె వేడుకుంటోంది. వాస్తవానికి ఇంకా సైన్యం భూతల దాడులకు దిగ లేదు. అది మొదలైతే ఇంకెన్ని వైపరీత్యాలు చూడాల్సి వస్తుందో అనూహ్యం. ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న 6 వేల మంది పాలస్తీనా పౌరుల విడుదల, భూతల దాడుల ప్రయత్నాలకు స్వస్తి హమాస్ డిమాండ్లు.

పాలస్తీనాలో శాంతి స్థాపన ఇజ్రాయెల్, హమాస్‌లకు లేదా పశ్చిమాసియాకు మాత్రమే కాదు... అమెరికాకు కూడా అత్యవసరం. ఇజ్రాయెల్ తన మితిమాలిన చర్యల ద్వారా ఇప్పటికే సంక్షోభాన్ని మరింత పెంచింది. ఇజ్రాయెల్‌కు అండగా ఉన్నట్టు కనబడకపోతే వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో ఇంటిదారి పట్టాల్సివస్తుందని బైడెన్ భయపడుతూ ఉండొచ్చు. కానీ ఆ పని చేస్తే అరబ్ దేశాలతో ఇజ్రాయెల్‌కు పీటముడి వేయాలన్న అమెరికా లక్ష్యం గల్లంతవుతుంది. గాజా ఆసుపత్రిపై మారణకాండ తర్వాత ఆ ఛాయలు కనబడుతూనే వున్నాయి. సౌదీ అరేబియా–ఇజ్రాయెల్ మైత్రికి సంబంధించిన యత్నాలు కొన్ని వారాల క్రితమే ఫలించగా, అవి కాస్తా నిలిచి పోయాయి. ఇరాన్‌తోనూ ఒప్పందం కుదర్చాలని అమెరికా తహతహలాడింది. దానికి కూడా గండి పడింది. బైడెన్‌తో జరగాల్సిన సమావేశాన్ని పాలస్తీనా నాయకుడు మహమ్మద్ అబ్బాస్ రద్దు చేసుకున్నారు. జోర్డాన్, ఈజిప్టు దేశాల్లో బైడెన్ రెండో దశ పర్యటన వాయిదా పడింది. భూతల దాడులు మొదలైతే అరబ్ దేశాల్లో ఊహకందని పరిణామాలు చోటు చేసుకుని, ప్రపంచానికే పెనుముప్పుగా మారుతుంది. దాన్ని నివారించటమే అమెరికాకైనా, మరొక దేశానికైనా అంతిమ లక్ష్యం కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
ఆశ్వయుజమాసం, **తిథి:** శు.షష్ఠి రా.9.06 వరకు, తదుపరి సప్తమి,
నక్షత్రం: మూల రా.7.31 వరకు, తదుపరి పూర్వాషాఢ,
వర్జ్యం: సా.5.56 నుండి 7.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.03 వరకు, తదుపరి ప.12.09 నుండి 12.56 వరకు,
అమృతఘడియలు: ప.1.21 నుండి 2.43 వరకు, సరస్వతీ పూజ.

సూర్యోదయం: 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

ద్రవ్యోల్బణం మార్కెట్‌కా, మందికా?

విశ్లేషణ


డి. పాపారావు

ఒకప్పుడు ఉపాధి కల్పనకు పునాదులుగా ఉండే వ్యవసాయ, పారిశ్రామిక సరుకు ఉత్పత్తి, సేవారంగాలు ఆర్థిక వ్యవస్థలో పైచేయిలో ఉండేవి. కానీ 1980ల అనంతరం, ఈ రంగాలకు కేవలం పెట్టుబడిని సరఫరా చేసే ఫైనాన్స్ రంగానిది పైచేయి అయింది. అంటే, కుక్కను తోక ఊపసాగింది. దీంతో ఎటువంటి ఉత్పత్తి లేకుండా డబ్బును మరింత డబ్బుగా మార్చే రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్ల హవా పెరిగింది. ఈ నేపథ్యంలో, షేర్ మార్కెట్లలోకి వచ్చిన పెట్టుబడుల విలువను కాపాడేందుకు ద్రవ్యోల్బణం అదుపు తప్పనిసరి అయింది. పూర్తి స్థాయి ఉపాధి కల్పన, ప్రజల కొనుగోలు శక్తి పెంపుదలలు కూడా ఈ ఫైనాన్స్ పెట్టుబడులకూ, మార్కెట్లకూ పొసగనిదిగా మారింది.

కొద్ది రోజుల క్రితం, అమెరికాలో నెలవారీ ఉపాధి కల్పన గణాంకాలు ఊహించిన దాని కంటే మెరుగైనవిగా వెలువడ్డాయి. కానీ ఈ వార్త అమెరికా షేర్ మార్కెట్ సూచీలలో పతనానికి కారణమైంది. నిజానికి, మార్కెట్ విశ్లేషకులు చెప్పే ఫండమెంటల్స్ బాగుంటే, అది షేర్ మార్కెట్ సూచీలలో పెరుగుదలకు కారణం కావాలి. పైన జరిగింది దీనికి పూర్తిగా విరుద్ధమైనది. ఇక్కడ ఉపాధి కల్పన గణాంకాలు మెరుగ్గా ఉన్నాయి. అంటే, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్, ప్రజల కొనుగోలు శక్తి బాగున్నాయన్నమాట. ఇదే, వాస్తవంలో ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మౌలిక అంశాలు లేదా ఫండమెంటల్స్ బాగుండటం అంటే. ఇది, స్థూల ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశం. ఈ స్థూల ఆర్థిక వ్యవస్థ బాగున్నదంటే దానిలో అంతర్భాగమైన వివిధ రంగాలకు చెందిన సంస్థలూ, పరిశ్రమలూ, ఇతరత్రా వ్యాపారాల ఫండమెంటల్స్ కూడా బాగున్నట్లే. మరి అటువంటప్పుడు అమెరికా షేర్‌మార్కెట్లు ఎందుకు పతనం అయినట్లు?

ఇక్కడ గమనించవలసింది 1980ల అనంతరం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో మౌలికంగా జరిగిన మార్పులను. ఈ మార్పులు, మనం పైన చెప్పుకున్న ఫండమెంటల్స్‌కు భిన్నమైన వాతావరణాన్ని తెచ్చిపెట్టాయి. ఉపాధి కల్పనకు పునాదులుగా ఉండే వ్యవసాయ, పారిశ్రామిక సరుకు ఉత్పత్తి, సేవారంగాల (నిజ ఆర్థిక వ్యవస్థగా పిలవబడేవి) కంటే... అటువంటి రంగాలకు కేవలం పెట్టుబడిని సరఫరా చేసే ఫైనాన్స్ రంగానిది పైచేయి అయింది. నిజ ఆర్థిక వ్యవస్థ, ఫైనాన్స్ ఆర్థిక వ్యవస్థల మధ్య ఈ విధంగా సమతూకం మారింది. అంటే, కుక్కను తోక ఊపసాగింది.

ఈ క్రమంలోనే, ఎటువంటి ఉత్పత్తి లేకుండానే కేవలం డబ్బును మరింత డబ్బుగా మార్చివేసే రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్ల వంటి సట్టా వ్యాపార రంగాలది పైచేయి అయ్యింది. ఇటువంటి పరిస్థితిలో, షేర్ మార్కెట్‌కు సంబంధించి కూడా ఫండమెంటల్స్ ఏవి అన్నది పూర్తిగా మారిపోయింది. ఈ కారణం చేతనే అమెరికాలో అంచనా కంటే మెరుగ్గా ఉన్న ఉపాధి గణాంకాలు మార్కెట్ల పతనానికి కారణం అయ్యాయి. అయితే, ఈ సరికొత్త ఫైనాన్స్ రంగ ఫండమెంటల్స్ తాలూకు ఏ పనితీరు ఈ మార్కెట్ల పతనానికి దారితీసింది అన్నది ఇక్కడి ప్రశ్న.

షేర్ మార్కెట్ల వంటి ఈ ఫైనాన్స్ రంగాలలో, మదుపుదారులు పెట్టిన పెట్టుబడి విలువను కాపాడుకోవడం అనేది ప్రధాన అంశంగా ఉంటుంది. ఒక వ్యక్తి లేదా సంస్థ షేర్ మార్కెట్లలో కొంత మొత్తాన్ని పెట్టుబడులుగా పెట్టినప్పుడు, అది దాని నుంచి లాభాలను ఆశిస్తుంది. లాభాల సంగతి కాసేపు పక్కన పెట్టినా, కనీసం తను పెట్టిన పెట్టుబడి తాలూకు విలువను కాపాడుకోవాలని కోరుకుంటుంది. దీనికోసం మార్కెట్లో పెట్టుబడిగా పెట్టిన కరెన్సీ విలువ స్థిరంగా



ఉండాలి. అది తీవ్ర ఒడుదుడుకులకు లోనవ్వడం లేదా క్షీణించడం జరగకూడదు. ఇది, షేర్‌మార్కెట్ల పెట్టుబడుల తాలూకు ప్రధాన అవసరం.

మరి ఇక్కడ కరెన్సీల విలువల పతనానికి కారణంగా లేదా దాని వ్యక్తీకరణగా ద్రవ్యోల్బణం అనేది ఉంటుంది. ఒక కరెన్సీ విలువ తగ్గినప్పుడే, దాని కొనుగోలు శక్తి తగ్గుతుంది. కరెన్సీ తాలూకు ఈ కొనుగోలు శక్తి తగ్గుదలనే ద్రవ్యోల్బణం అంటాం. ఈ నేపథ్యంలోనే, షేర్ మార్కెట్లలోకి వచ్చిన పెట్టుబడుల విలువను కాపాడేందుకు గానూ ద్రవ్యోల్బణం అదుపు తప్పనిసరి అవసరంగా మారింది. ఫలితంగానే, ఫైనాన్స్ పెట్టుబడుల ఆధిపత్యం పెరిగిన 1980ల అనంతరం, అంటే సుమారుగా 1990ల నుంచీ ప్రపంచంలోని దరిదాపు అన్ని దేశాల కేంద్ర బ్యాంకులూ ద్రవ్యోల్బణం అదుపును తమ ప్రధాన లక్ష్యంగా చేసుకున్నాయి. ఉదాహరణకు మన రిజర్వ్ బ్యాంకుకు ఈ ద్రవ్యోల్బణ కట్టడి లక్ష్యం, రెండు శాతం అటూ ఇటుగా నాలుగు శాతంగా నిర్ణయించబడింది. అంటే, మన దేశీయ రిజర్వ్ బ్యాంక్, దేశంలో ద్రవ్యోల్బణాన్ని 26 శాతం నడుమన నియంత్రించి ఉంచాలి. అలా అయితేనే భారత షేర్ మార్కెట్లలోకి వచ్చే పెట్టుబడుల విలువకు కాస్త భరోసా ఉంటుంది.

ఇక్కడ మరో ఉదాహరణగా అమెరికా నుంచి భారతదేశ షేర్ మార్కెట్లలోకి ఒక అంతర్జాతీయ ఫైనాన్స్ సంస్థ డాలర్లను పెట్టుబడిగా తెచ్చింది అనుకుందాం. ఆ సంస్థ డాలర్లను నేరుగా పెట్టుబడిగా పెట్టలేదు. దానికోసం కరెన్సీని రూపాయలలోకి మార్చుకుంటుంది. ఇక, ఆ సంస్థకు కీలక ప్రాధాన్యత గల అంశంగా రూపాయి విలువ కాపాడబడటం అనేది ఉంటుంది. ఆ విదేశీ మదుపు సంస్థ, తన షేర్ మార్కెట్ పెట్టుబడులను అమ్ముకుని దేశం నుంచి మరోచోటకి వెళ్ళిపోయే నాటికి రూపాయి విలువ గణనీయంగా తగ్గిపోయి ఉంటే అది పెట్టుబడి + లాభాల విలువ తగ్గుదలకు కారణం అవుతుంది. మార్కెట్‌లో తన పెట్టుబడులను అమ్మివేసినప్పుడు ఆ మదుపుదారుడికి రూపాయల్లో డబ్బు వస్తుంది. తిరిగివెళ్ళిపోయే క్రమంలో రూపాయలను వేరే దేశంలోకి తీసుకుని వెళ్ళలేడు గనుక తిరిగి ఆ మదుపుదారుడు తనకు లభించిన రూపాయలను డాలర్లుగా మార్చుకుంటాడు. ఇక్కడ అతను పెట్టుబడి పెట్టేనాటికీ, వాటిని అమ్ముకుని వెనక్కు వెళ్ళేనాటికీ మధ్యన రూపాయి విలువ తగ్గితే, అతనికి ఈ రూపాయలను తిరిగి డాలర్లుగా మార్చుకుంటే, లభించే డాలర్ల మొత్తం కూడా తక్కువగానే వుంటుంది. ఈ మొత్తం పరిస్థితిని మదింపు చేసుకోవడం కోసమే మన దేశంలోకి లేదా ఇతరేతర దేశాలలోకి కూడా పెట్టుబడులను తీసుకువెళ్ళే మదుపుదారులు వాటిపై లభించే లాభాలను అటు, ఆ దేశం తాలూకు కరెన్సీలతో పాటుగా, మరొక కొలబద్ద అయిన డాలెక్స్ (డాలర్లలో లభించిన లాభం) రూపంలో కూడా లెక్కించుకుంటారు. అదీ కథ!

కాబట్టి, నేటి ఫైనాన్స్ యుగంలో ఫండమెంటల్స్ అనేవాటి అర్థం మారిపోయింది. నేడు ఫండమెంటల్స్‌గా పరిగణించబడుతున్నవి ప్రధానంగా ఫైనాన్స్ పెట్టుబడుల కొలబద్ద అయిన ద్రవ్యోల్బణం సూచీలు. ఈ కారణం చేతనే, అమెరికాలో ఉపాధి కల్పన బాగా జరిగిన క్రమంలో షేర్ మార్కెట్లు దిగజారాయి. ఇక్కడ, మరో చిన్న విషయం... ఈ మార్కెట్లు ఆ రోజు మధ్యాహ్నానికి తిరిగి కాస్త కోలుకున్నాయి. దీనికి కారణం, ఈ మెరుగైన ఉపాధి గణాంకం అనేది, వేతనాల పెరుగుదల రూపంలో పెద్దగా ప్రభావం చూపలేదు. అంటే, ఉపాధి మెరుగ్గానే కనబడిందిగానీ... దాని వలన వేతనాల మొత్తం పెరిగిపోయి అది మార్కెట్లో పెరిగిన ప్రజల కొనుగోలు శక్తి లేదా డిమాండ్ రూపంలో ప్రభావం చూపగలిగిందిగా లేదన్నమాట. ఈ వాస్తవాన్ని మధ్యాహ్నానికి గ్రహించిన అమెరికా మార్కెట్ సూచీలు తిరిగి మళ్ళీ పుంజుకున్నాయి. ప్రజల కొనుగోలుశక్తీ, లేదా డిమాండ్ పెరగకుంటే మార్కెట్లో ద్రవ్యోల్బణం పెరగదనే సూక్ష్మమే దీనికి కారణం.

1980ల ముందరినాటి కాలం ఫండమెంటల్స్ వేరుగా ఉన్నాయి. అవి, ఒక కంపెనీ తాలూకు బ్యాలెన్స్ షీట్, అలాగే స్థూలంగా నిజ ఆర్థిక వ్యవస్థ తాలూకు బలంపై ఆధారపడి వున్నాయి. కానీ నేడు అది పూర్తిగా నిజంకాదు. ద్రవ్యోల్బణం, దాని కట్టడి అనేవి నేడు మార్కెట్లో ప్రధాన అంశంగా మారింది. కాబట్టి నేడు వివిధ దేశాలలో పూర్తి స్థాయి ఉపాధి కల్పన, ప్రజల కొనుగోలు శక్తి పెంపుదలలు కూడా ఈ ఫైనాన్స్ పెట్టుబడులకూ, మార్కెట్లకూ పొసగనిదిగా మారింది. వినాశకాలే విపరీత బుద్ధి... ఇంతకంటే చెప్పగలిగింది ఏమీ లేదు!

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఆటవికం



ట్యునీషియాలోని ఎల్ హమ్మ సినగాగ్ (యూదుల ప్రార్థనాలయం)కు వందలాది మంది అరబ్బులు నిప్పు పెట్టారు, నాశనం చేశారు. ఎంత కళంకం! ఎలాంటి దారుణ ఆటవిక చర్య!

– గీర్ట్ వైల్డర్స్, నెదర్లాండ్స్ నాయకుడు

మత విరుద్ధం



ట్యునీషియాలోని సినగాగ్‌కు నిప్పంటించడమనేది భయానకమైన నేరం; ఇది పూర్తిగా ఇస్లామిక్ బోధనలకు విరుద్ధమైన చర్య. ఇది తీవ్రమైన బాధనూ, ఆందోళననూ కలిగిస్తోంది.

– ఎర్మిన్ సినానోవిచ్, ఇస్లాం పండితుడు

శాంతి శాంతి



నేను ఆశావాదిని. ఇన్షాఅల్లాహ్ ఈ యుద్ధం ముగియగానే, ఇషామెల్ పిల్లలు, ఇసాక్ పిల్లలు తమ స్నేహసంబంధాలను పునరుద్ధరించుకొనేలా ఈ ప్రాంతంలో శాంతి నెలకొంటుంది. ముస్లింలు, యూదులు తమ సంబంధాలను పునరుద్ధరించుకునేలా శాంతి నెల కొంటుంది. ప్రపంచంలోనే మన ప్రాంతాన్ని అత్యుత్తమంగా నిలబెట్టేలా శాంతి నెలకొంటుంది.

– లోయే అల్‌షరీఫ్, పీస్ యాక్టివిస్ట్

ఇస్త్రీ తత్వం



బట్టలకు ఇస్త్రీ చేయడం అనేది నాకు ఇష్టమైన ఒక ధ్యానం లాంటిది. నీ చొక్కా పాడుకుంటూ ఉందేమో అన్న సంభావ్యత మన సందిగ్ధతలను పోగొడుతుంది. ముడతల వంకర తీస్తున్నప్పుడల్లా మన జీవితాన్నే సరిచేసుకుంటున్న ఫీలింగ్ వస్తుంది. ఇది నిజంగా జెన్ జోన్‌లోకి వెళ్లడానికి సులువైన మార్గం.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

పూల పండుగ



పోయినేడాది మొదటిసారి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నాను. ఈ ఏడాది కాన్సులేట్‌లో ఆతిథ్యం ఇవ్వడానికి సంతోషిస్తున్నాను. ఈ పూల పండగ నాకు నచ్చింది. ఈ అందమైన తెలంగాణ పండుగను జరుపుకోవడానికి కలిసి వచ్చిన అందరికీ ధన్యవాదాలు.

– జెన్నిఫర్ లార్సన్, యూఎస్ కాన్సుల్ జనరల్

పట్టించుకోకు!



ఈ రైట్, లెఫ్ట్ వర్గాల ఎడతెగని ట్రోలింగ్‌ను ఎలా తట్టుకుంటావని చాలామంది నన్ను అడుగుతుంటారు. ఈ ట్విట్టర్ (ఎక్స్)లో మనుగడ సాగించాలంటే– మొదటి రూల్: మేధో, సూక్ష్మ భేదాల చర్చలకు ఇది తగిన వేదిక కాదని గుర్తుంచుకోండి. అవి కావాలంటే ఐఐసీ, ఐహెచ్‌సీ లాంటివాటికి వెళ్లాలి. రెండో రూల్: నిన్ను గానీ, నీ ట్రోల్స్‌ను గానీ మరీ సీరియస్‌గా తీసుకోవద్దు.

– సంజయ్ ఘోష్, న్యాయవాది

ఏమీ మారలేదు!



జాతివివక్ష, వలసవాదం లాంటి అంశాల మీద మనం పనిచేస్తున్నప్పుడు ఒక దశలో... ఇంక చాల్లే, అందరికీ ఇది అర్థమైపోయింది, కచ్చితంగా ప్రపంచం ముందుకెళ్లిపోయింది అనిపిస్తుంది. కానీ మళ్లీ తెలిసొస్తుంది: అసలు ఏమీ జరగలేదని! మళ్లీ అదే రొటీన్, మళ్లీ అదే వివక్ష, మళ్లీ అదే నాగరికపు మాటలు, అవే ద్వంద్వ ప్రమాణాలు.

– ప్రియంవదా గోపాల్, ప్రొఫెసర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

దేశపు జెండాకుండే పొగరున్న కవి!

**"నదులూ కవులూ భూగోళపు రక్తనాళాలు
నదులు ప్రవహిస్తాయి కవితల్లా
పక్షుల కోసం పశువుల కోసం మనుష్యుల కోసం
నదులు కంటున్న కలలు పొలాల్లో ఫలిస్తాయి
కవులు కంటున్న కలలు మనుష్యుల్లో ఫలిస్తాయి"**

ప్రబంధ కవుల పద ప్రౌఢత్వం, భావకవుల లలితమైన ఇంద్రజాలం, అభ్యుదయ కవుల పదును, విప్లవ కవుల నెత్తురు నిండిన భావపరంపర ఇవన్నీ కలిపితే గుంటూరు శేషేంద్ర శర్మ (1927–2007) సాహిత్యం. విశ్వసాహిత్యంపైన గాఢమైన అవగాహన ఉన్న మహాపండితుడు. ఛందో బద్ధమైన పద్యాన్ని ఎంత సుందరంగా చెప్పగలడో వచన కవితనూ అంతే పదునుగా నడపగల మహాకవి శేషేంద్ర. 80 ఏళ్లు జీవించిన శేషేంద్ర 30కి పైగా రచనలు చేశారు. ఆధునిక కవిత్వంలో విలక్షణ ఊహాశాలిత శేషేంద్ర శర్మ ప్రత్యేకత. ఆయన రచన 'నా దేశం – నా ప్రజలు' 2004లో నోబెల్ సాహిత్య పురస్కారానికి నామినేట్ అయ్యింది. 1994లో 'కాలరేఖ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.


గుంటూరు శేషేంద్ర శర్మ

'ఒక్కొక్క కన్నీటి బిందువులో ఎంతెంత సాగరం దాగి ఉందో' తెలుసుకున్నవాడు కాబట్టే ప్రజల సుఖదుఃఖాలు, కష్టనష్టాలనే వస్తువులుగా, రైతులను, కార్మికులనే నాయకులుగా స్వీకరించి మానవజాతి జీవించి ఉన్నంత కాలం స్మరించుకునే కావ్యాలను లోకానికి బహూకరించి వెళ్లిపోయారు. 'నా దేశం–నా ప్రజలు', 'మండే సూర్యుడు', 'గొరిల్లా', 'అరుస్తున్న ఆద్మీ', 'సముద్రం నా పేరు', 'నీరై పారిపోయింది', 'ప్రేమలేఖలు', 'శేషజ్యోత్స్న' ఈ ఎనిమిది కావ్యాలను కలిపి 'ఆధునిక మహాభారతం' పేర సంకలనం చేశారు.

'సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చుని మొరగదు /తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు/పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు/నేనింత పిడికెడు మట్టి కావచ్చు/ కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది' అని శేషేంద్ర రాసిన వాక్యాలు అమ్ముడు పోయిన కవులే ఎక్కువున్న ఈనాటి సంక్షోభ కాలంలో ఒక దిక్సూచిలా పనిచేస్తాయి. 'నీవు కాలేజీ గోడల్లోకి పోతావు. అక్కడ్నుంచి గవర్నమెంటు గోడల్లోకి పోతావు. అక్కడ్నుంచి ఎప్పుడూ ఎవరూ తిరిగిరాని గోడల్లోకి పోతావు. ఇక నీవు బతికిందెప్పుడు' అని ఈ దేశ విద్యార్థుల జీవిత చిత్రాన్ని ఆవిష్కరించారు.

'వ్యవసాయ కూలీల ఆకాశం వర్షాలే కురుస్తుంది. వసంతాలు కురువదు. రైతులారా రాజకీయ వర్షం పడుతోంది. మోసపోయి మీ విత్తనాలు చల్లకండి' అని అవకాశవాద రాజకీయాలు ఆనాడు ఎలా ఉండేవో రైతులకు, కార్మికులకు విప్పిచెప్పారు.

సాహిత్యానికి మూలభూతమైన ఎన్నో ప్రశ్నలకు సమాధానంగా 'కవిసేన మేనిఫెస్టో' రచించి సంచలనం సృష్టించారాయన. 'కామోత్సవ్' (1987) నవల రాసి ఎంతో వివాదానికి కారకుడయ్యారు. "శేషేన్ నీది మంచి పద్యమా లేక ఫ్రెంచి మద్యమా.. శ్రీనాథుడి క్రీడల్లో, అల్లసాని వాడల్లో కూడా దొరకని పదచిత్రం" అని శేషేంద్రకు ఓ కవి ఇచ్చిన కితాబు అక్షరాల నిజం.

– వెల్దండి శ్రీధర్, తెలుగు అధ్యాపకులు | 98669 77741
(నేడు గుంటూరు శేషేంద్ర శర్మ జయంతి)

పేదరికం తగ్గుతోంది!

అభిప్రాయం


డా॥ పృథ్వీకర్ రెడ్డి

దేశంలో గత ఐదేళ్లలో రెండేళ్లు కరోనా మహమ్మారి ఇబ్బందిపెట్టినా పేదరికం తగ్గుముఖం పట్టడం శుభపరిణామం. మన రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే ధోరణి కనిపించడం ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ, విద్యా, వైద్య పథకాల ఫలితమేనని చెప్పవచ్చు.

నీతి ఆయోగ్ నివేదిక –2023 ను పరిశీలించినప్పుడు దేశంలో పేదరికం పరిస్థితి ఇటీవలి సంవత్సరాల్లో (2015–16, 2019–21) ఎలా ఉందో స్పష్టమవుతోంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ)... సామాజిక–ఆర్థిక, సామాజిక శ్రేయస్సు కొరకు 'ఎవరినీ వదిలి పెట్టకూడదు' అనే దృష్టితో నిర్దేశించబడ్డాయి. అంటే ఆదాయంతో ముడిపడిన పేదరికమే కాకుండా, మిగతా అన్ని వసతులనూ పరిగణనలోకి తీసుకొని పేదరికాన్ని అంచనా వేసి దాని నిర్మూలించడం కూడా ఒక లక్ష్యమన్నమాట. అనేక కోణాలను పరిగణన లోకి తీసుకుని పేదరికాన్ని అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు, అవసరమైన వసతులు... అంటే నీరు, పారిశుద్ధ్యం, పోషకాహారం, శిశు, ప్రసూతి మరణాలు, పాఠశాల హాజరు, ఇతర ప్రాథమిక గృహ సౌకర్యాలు పొందడం వంటి వాటినన్నిటినీ పేదరికాన్ని నిర్వచించడంలో పరిగణించాలి. ఇటువంటి పేదరిక అంచనా కోసం నిర్దేశించిన 12 సూచికలలో పదింటిని, ప్రపంచ స్థాయిలో పేదరికాన్ని అంచనా వేయడానికి చేర్చినవి కాగా మిగిలిన రెండు సూచికలు: ప్రసూతి ఆరోగ్యం, బ్యాంక్ ఖాతాలు దేశంలో పేదరికాన్ని అంచనావేయడానికి అదనంగా చేర్చబడ్డాయి. ఇటువంటి అనేక కోణాల ఆధారంగా నిర్ధారించిన పేదరికం (ఎంపీఐ) జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయులలో ఎలా ఉందో నీతి ఆయోగ్ తాజా నివేదిక తెలియజేస్తోంది.

దేశ స్థాయిలో పేదరికం బాగా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది. 2015–16లో మన జనాభాలో 25 శాతం పేదలు ఉండగా, 2019–21 నాటికి 15 శాతానికి పేదరికం తగ్గింది. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని వేసిన అంచనా దేశంలో 13.5 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారని సూచిస్తోంది. సుస్థిర అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలు 2030 కంటే ముందుగానే,



భారతదేశం సాధించవచ్చని ఇది చెబుతోంది. మొత్తం 12 సూచికలు అభివృద్ధిని చూపించాయి. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం వేగంగా తగ్గుముఖం పట్టింది. పట్టణ ప్రాంతాలకు వచ్చేటప్పటికి 8.65 శాతం నుండి 5.27 శాతానికి పేదరికం తగ్గింది. 28 రాష్ట్రాలలో, పది రాష్ట్రాలు 2019–21లో దేశ సగటు 14.96 శాతం కంటే ఎక్కువ శాతం పేదరికాన్ని నమోదు చేశాయి. దేశంలో అత్యల్పంగా కేరళలో ఒక శాతం కంటే తక్కువ మంది పేదలుగా ఉన్నారు. మొత్తం ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలలో పేదల శాతం దేశ సగటు కంటే చాలా తక్కువగా ఉంది.

2019–21లో దేశ సగటు పేదరిక స్థాయి కంటే, తెలుగు రాష్ట్రాల్లో, పైన చెప్పిన విధంగా అంచనా వేసిన పేదల శాతం చాలా తక్కువగా ఉంది. ఇది 2015–16 లో తెలుగు రాష్ట్రాలలో దాదాపు 12 నుండి 13 శాతం ఉండగా, 2019–21 నాటికి రెండు తెలుగు రాష్ట్రాలలో 6 శాతానికి తగ్గింది. పేదరిక అంచనాలో ఉపయోగించిన సూచికలలో, పిల్లల–కౌమార మరణాలు, పాఠశాలలో గడిపిన సంవత్సరాలు, పాఠశాల హాజరు, విద్యుత్ సౌకర్యం, ఆస్తులు కలిగి ఉండటం వంటివి రెండు తెలుగు రాష్ట్రాలలో సమాన శాతంలో ఉన్నాయి.

2023 ఏడాదిలో విడుదల అయిన నీతి ఆయోగ్ నివేదిక, కరోనా వైరస్ కారణంగా ఆర్థికంగా, సామాజికంగా అతలాకుతలం అయిన కాలాన్ని అనగా 2019–21ను ప్రతిబింబిస్తోంది. పేదరిక నిర్మూలనను దృష్టిలో ఉంచుకొని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన అనేక కార్యక్రమాలు బహుసూచికలతో పొందు పరచిన పేదరిక శాతాన్ని తగ్గించడంలో బాగా సహాయపడ్డాయి.

ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో 'వైఎస్సార్ అమ్మ ఒడి', 'వైఎస్సార్ జగనన్న విద్యా దీవెన', 'వైఎస్సార్ ఆరోగ్య ఆసరా', 'జగనన్న ఆరోగ్య సురక్ష', గృహనిర్మాణ పథకం; తెలంగాణలో 'ఆరోగ్య లక్ష్మి', గృహనిర్మాణ పథకం, 'కేసీఆర్ కిట్' 'మిషన్ భగీరథ' పథకాలు పేదరిక శాతాన్ని గణనీయంగా తగ్గించడంలో సహాయపడ్డాయి. అదనంగా, రెండు రాష్ట్రాలలో, ఆరోగ్య మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేయడం కూడా పాఠశాల హాజరు, తల్లీ పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి దోహదపడుతున్నాయి. ఈ పథకాల పూర్తి ప్రభావం తదుపరి నీతి ఆయోగ్ నివేదికలో ఎక్కువగా ప్రస్ఫుటం గావచ్చు. ఈ పథకాల ప్రభావంతో, తెలుగు రాష్ట్రాలలో, పేదరిక నిర్మూలన గణనీయంగా తగ్గవచ్చు.

వ్యాసకర్త ఆర్థిక అంశాల నిపుణుడు
ఈ–మెయిల్: prudhvikar@cess.ac.in


తిరుమల నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహనంపై శ్రీవారు


బాసరలో స్కందమాత రూపంలో దర్శనమిస్తున్న సరస్వతి అమ్మవారు


వరంగల్ శ్రీభద్రకాళి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరి (లలిత)దేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు


భద్రాచలంలో ధాన్యలక్ష్మి అలంకారంలో శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు


అలంపూర్ జోగుళాంబ ఆలయంలో స్కందమాత అలంకారంలో జోగులాంబ అమ్మవారు


తిరుమల వెంకన్నను గురువారం దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ సుధ

క్లుప్తంగా...

బీఆర్ఎస్ మళ్లీ వస్తే బతుకమ్మపై లిక్కర్ బాటిల్

కవితపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సెటైర్



జగిత్యాలటౌన్: బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకొస్తే బతుకమ్మపై గౌరమ్మకు బదులు లిక్కర్ బాటిల్ పెడతారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. షుగర్ ఫ్యాక్టరీ మూసివేసిన ఘనత ఎమ్మెల్సీ కవితదేనని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఐదేళ్లు ఎంపీగా ఉండి ఏమీ చేయని కవిత తమకు హితబోధ చేయడమేంటని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీని విమర్శించే నైతికత కవితకు లేదన్నారు.

జీవన్‌రెడ్డీ... మనిషివైతే నాలుక కోసుకో..!

మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపాటు



గోదావరిఖని: 'జీవన్ రెడ్డీ.. మనిషివైతే నాలుకకోసుకో. నీలాంటి సీనియర్ నేత ఇలా మాట్లాడటంతో రాజకీయాలు అంటేనే రోతపుడుతోంది'అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యే చందర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్య మ సమయంలో బతుకమ్మ ఆటపాటలతో ఎమ్మెల్సీ కవిత అందరినీ కలిపిన విషయం తెలిసిందేనన్నారు. 'బతుకమ్మపై లిక్కర్ బాటిల్'అన్న జీవన్‌రెడ్డి వ్యాఖ్యలను మహిళలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

స్టార్ క్యాంపెయినర్‌గా బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ తొలి దశ ఎన్నికల ప్రచారానికి బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌కు అవకాశం కల్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో కలిపి మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను గురువారం విడుదల చేశారు.

కేటీఆర్ తప్పు ఒప్పుకున్నట్టే

'ఎక్స్'వేదికగా షర్మిల



సాక్షి, హైదరాబాద్: ఓట్ల కోసం మంత్రి కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. టీఎస్పీఎస్సీ పారదర్శకంగా పనిచేస్తోందని చెప్పిన నోటితోనే ప్రక్షాళన అంటున్నారంటే కేటీఆర్ తప్పు ఒప్పుకున్నట్టే కదా అని ప్రశ్నించారు. గురువారం ఆమె ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కేటీఆర్‌పై మండిపడ్డారు. ఇప్పటికైనా తప్పు ఒప్పుకొని తెలంగాణ బిడ్డలకు క్షమాపణలు చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. కాగా, వైఎస్సార్‌టీపీ తరఫున జుక్కల్ నుంచి టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే బేగరి పండరి ఆ పార్టీ అధికార ప్రతినిధి పిట్టా రామిరెడ్డికి దరఖాస్తు అందజేశారు.

దివ్యాంగులకు ఏం చేశారో కేటీఆర్ చెప్పాలి: ముత్తినేని

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులకు ఏం చేశారో మంత్రి కేటీరామారావు రాష్ట్ర ప్రజలకు వివరించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ...దివ్యాంగులకు సంబంధించిన 25 అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. ప్రగతిభవనా? అమరవీరుల స్తూపమా? ఎక్కడైనా సరే చర్చిద్దామన్నారు. మీరొచ్చాక ఒక్క దివ్యాంగుడికైనా అంత్యోదయ కార్డు ఇచ్చారా? పెళ్లిళ్లకు ప్రోత్సాహం కల్పించారా అని ప్రశ్నించారు.

ఇదండీ బాత్



దేశానికి కాంగ్రెస్ చోర్ టీం

ఆకాశం నుంచి పాతాళం దాకా దోచుకున్న చరిత్ర ఆ పార్టీదే

కుటుంబ పాలన గురించి రాహుల్ మాట్లాడటం గొంగడిలో వెంట్రుకలు ఏరడమే

- దావూద్, చార్లెస్ శోభరాజ్‌ను మించిన దొంగ రేవంత్
- 10–12 మంది ఎమ్మెల్యేలు గెలిచినా బీజేపీకి గంపగుత్తగా అమ్మేస్తాడు
- దివ్యాంగుల సంక్షేమానికి తొమ్మిదిన్నరేళ్లలో రూ.10,300 కోట్లు ఖర్చు చేశాం
- కేసీఆర్‌కు అండగా నిలవండి
- దివ్యాంగుల కృతజ్ఞత సభలో మంత్రి కేటీఆర్



తెలంగాణ భవన్ లో వికలాంగుల పెన్షన్ లబ్ధిదారుల కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశానికి కాంగ్రెస్ పార్టీ 'సీ టీం' (చోర్ టీమ్) అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె. తారక రామారావు ఆరోపించారు. తమ పార్టీ బీజేపీకి 'బీ–టీం' అన్న కాంగ్రెస్ విమర్శలపై ఆయన మండిపడ్డారు. కుంభకోణాలతో ఆకాశం నుంచి పాతాళం దాకా దోచుకున్న చరిత్ర కాంగ్రెస్‌దని దుయ్యబట్టారు. గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన 'దివ్యాంగుల కృతజ్ఞత సభ'లో కేటీఆర్ మాట్లాడారు. 'రాహుల్ గాంధీ రామప్ప గుడికి వచ్చి గొంగడిలో వెంట్రుకలు ఏరినట్లు కుటుంబ పాలన గురించి మాట్లాడారు. ఆయన లీడర్ కాదు.. ఇతరులు రాసింది చదివే రీడర్. రేవంత్ లాంటి ఒక 420ని, గజదొంగను పక్కన పెట్టుకొని రాహుల్ మాట్లాడటం సిగ్గుచేటు. దావూద్ ఇబ్రహీం, చార్లెస్ శోభరాజ్‌ను మించిన గజదొంగ రేవంత్. నాడు నోటుకు ఓటు.. నేడు సీటుకు రేటు. ఒకవేళ ఎన్నికల్లో 10, 12 మంది ఎమ్మెల్యేలు గెలిచినా రాష్ట్ర కాంగ్రెస్‌ను బీజేపీకి గంపగుత్తగా రేవంత్ అమ్మేయడం ఖాయం' అని కేటీఆర్ విమర్శించారు. రూ. 80 వేల కోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో విపక్షాలు ఆరోపిస్తున్నట్లు ఎక్కడైనా రూ. లక్ష కోట్ల అవినీతి జరుగు తుందా? అని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో సోనియా, రాహుల్ విచారణ ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు.

మోదీ, రాహుల్‌కు తెలంగాణ పౌరుషం చూపాలి..

'తెలంగాణ ఉద్యమంలో ప్రజల మీదకు తుపాకీతో వెళ్లిన రైఫిల్‌రెడ్డి ఒకరైతే... రాజీనామా చేయకుండా అమెరికా పారిపోయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మరొకరు. ఇలాంటి వారితో కేసీఆర్‌కు పోటీనా? ఈ ఎన్నికల్లో ప్రధాని మోదీ, రాహుల్ గాంధీకి బుద్ధిచెప్పేలా తెలంగాణ పౌరుషం చూపాలి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

కేసీఆర్ ఈ శతాబ్దంలో ఒకే ఒక్కడు..

'రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు. కేసీఆర్ లాంటి నాయకుడు శతాబ్దానికి ఒకరు వస్తారు. ఆయన ప్రభుత్వాన్ని వదులుకోవద్దు. దివ్యాంగుల సంక్షేమానికి తొమ్మిదిన్నరేళ్లలో రూ. 10,300 కోట్లు ఖర్చు చేశాం. కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో దివ్యాంగులకు రూ. 200 చొప్పున, మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు మాత్రమే పింఛన్ ఇస్తున్నారు. మేం మళ్లీ అధికారంలోకి రాగానే ప్రస్తుతమున్న రూ. 4,016 పింఛన్‌ను రూ. 6,016కు పెంచుతాం. దివ్యాంగులకు ఊత కర్రలా నిలిచిన కేసీఆర్‌కు ఎన్నికల్లో అండగా నిలవండి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథం, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బస్సుయాత్ర.. తుస్సుమనడం ఖాయం

- తెలంగాణకు నంబర్ వన్ విలన్ ఆ పార్టీయే
- సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో కేటీఆర్ విమర్శలు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ రంగంలో స్వర్ణ యుగానికి తెలంగాణ చిరునామాగా నిలుస్తుండగా చీకటి పాలనకు కర్ణాటక చిరునామాగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా విమర్శించారు. గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ సహా విభజన హామీలపై పదేళ్లుగా కేంద్రాన్ని ప్రశ్నించని రాహుల్ గాంధీకి తెలంగాణలో పర్యటించే అర్హత లేదన్నారు. కర్ణాటక ప్రజలకు ఇచ్చిన హామీలను 100 రోజుల్లోనే కాంగ్రెస్ బొంద పెట్టిందని, అక్కడి రైతులకు 5 గంటల కరెంటు కూడా ఇవ్వకుండా చేతులెత్తేసిందని ఆరోపించారు. నమ్మి ఓటేసిన కర్ణాటక ప్రజలను నట్టేట ముంచి ఇప్పుడు తెలంగాణలో నాటకాలకు తెరతీసిన కాంగ్రెస్‌ను నమ్మేదెవరని కేటీఆర్ ప్రశ్నించారు. శ్రీకాంతాచారిని బలితీసుకున్న కాంగ్రెస్‌కు అమరవీరుడి పేరెత్తే అర్హత లేదని, తెలంగాణ ఏర్పాటులో కాంగ్రెస్ చేసిన జాప్యం వల్లే వందల మంది బలిదానాలు చేశారని పేర్కొన్నారు. నిన్న, నేడు, రేపు ఎప్పుడైనా తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. గాంధీ భవన్‌ను గాడ్సేకు అప్పగించిన నాడే కాంగ్రెస్‌కు తెలంగాణలో కౌంట్‌డౌన్ మొదలైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బస్సు యాత్ర తుస్సుమనడం ఖాయమని జోస్యం చెప్పారు. మూడు రోజుల పర్యటన చేసినా, 300 రోజులు ముక్కు నేలకు రాసినా తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మరని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి టీచింగ్ పాయింట్ అని పేర్కొన్న కేటీఆర్... మంథనికి వెళ్లిన రాహుల్ ఆ పక్కనే ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టును చూసి తరించాలని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఆ మూడు పార్టీల డీఎన్ఏ ఒక్కటే

కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు నాటకాలాడుతున్నాయి

- కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్ ఖాతాలోకే
- రాహుల్‌గాంధీ కేవలం రాసిచ్చిన స్క్రిప్టులు చదవడానికే పనికొస్తాడు
- చాన్నాళ్ల నుంచి అధికారంలో లేక రాహుల్‌కి మైండ్ సరిగ్గా పనిచేయడం లేదు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే అది బీఆర్ఎస్ ఖాతాలోకే చేరుతుందని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ పార్టీనే 'బీ టీం' అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీకి ఓటేస్తే బీఆర్ఎస్‌కి వెళుతుందని, బీజేపీ బీఆర్ఎస్ పార్టీకి 'బీ టీం' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ ఈ మూడు పార్టీలు కలిసే పనిచేస్తూ నాటకాలు ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. ఈ మూడు పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని ఆరోపించారు. ఈ మూడు పార్టీలూ కలసి తెలంగాణ ప్రజలను మోసం చేయడం, ప్రధాని చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గురువారం ఢిల్లీలోని నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 2004 నుంచి ఇప్పటి వరకు బీఆర్ఎస్ (టీఆర్ఎస్)తో కలిసి ఉన్నది కాంగ్రెస్ పార్టీనే అని నిందించారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఫ్లోర్ లీడర్ సైతం బీఆర్ఎస్‌లో కలిసిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు.

పార్టీని విలీనం చేస్తానని సోనియా వద్ద కేసీఆర్ పడికాపులు కాయలేదా?

బీఆర్ఎస్(అప్పటి టీఆర్ఎస్)ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తామంటూ సీఎం కేసీఆర్ సోనియా గాంధీ వద్ద పడిగాపులు కాసిన సందర్భం గుర్తు లేదా అని రాహుల్‌ని ప్రశ్నించారు. 2014 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో లేకపోయేసరికి రాహుల్ గాంధీకి మైండ్ సరిగా పనిచేయడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బీఆర్ఎస్‌లు కలిసి పని చేస్తున్నాయనీ, అందుకే రెడ్‌హ్యాండెడ్‌గా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఓటుకు కోట్లు కేసులో పట్టుబడ్డా ఇంతవరకు అతనిపై సీఎం కేసీఆర్ ఏవిధమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కొందరు నాయకులు రాసిచ్చిన స్క్రిప్టును చదివేందుకు మాత్రమే రాహుల్ గాంధీ పనికొస్తారని నిందించారు.

ఆ మూడు పార్టీల తీరుపై చర్చకు సిద్ధమా

కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల తీరుపై చర్చించేందుకు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ లేదా ఢిల్లీలో చర్చకు రావాలని రాహుల్‌కు కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో 364 మంది విద్యార్థులను పొట్టనబెట్టుకున్నది, చివరిదశ ఉద్యమంలో 1,200మంది బలిదానాలకు కారణమైంది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద ముక్కును నేలకురాసి రాహుల్ గాంధీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తే మీడియాకే ముందు చెబుతాం

ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యవహారం పార్టీ అంతర్గత విషయమనీ, అతనిపై సస్పెన్షన్ ఎత్తివేస్తే ముందుగా మీడియాకే చెబుతామన్నారు. రాజాసింగ్ ఎన్నికల్లో పోటీ చేస్తారా అని మీడియా ప్రశ్నించగా..సస్పెన్షన్ ఎత్తివేస్తే పోటీ చేస్తారని చెప్పారు.

సర్దుకుపోదాం..!

- పొత్తులపై మెత్తబడుతున్న కామ్రేడ్లు
- మునుగోడు స్థానంలో చెన్నూరుకు సరే అంటున్న సీపీఐ
- భద్రాచలంలో సీపీఎంకు నో చాన్స్.. పాలేరు కూడా కుదరనట్టే..!
- తాజాగా తెరపైకి వైరా సీటు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో వామపక్షాలు సర్దుకుపోయే ధోరణిలో ఉన్నట్టు కన్పిస్తున్నాయి. రెండేసి చొప్పున అసెంబ్లీ స్థానాలకు ఒప్పుకున్న సీపీఐ, సీపీఎంల్లో తాము పోటీ చేసే స్థానాల విషయంలో మాత్రం కొంత గందరగోళం నెలకొని ఉంది. కొత్తగూడెం, మునుగోడు స్థానాలను సీపీఐ కోరగా, కాంగ్రెస్ కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. కానీ తమకు మునుగోడే కావాలని ఇప్పటివరకు పట్టుబడుతున్న సీపీఐ తాజాగా కాస్త మెత్తబడుతున్నట్టు తెలిసింది. అవకాశం ఉంటే మునుగోడు ఇవ్వాలని, లేనిపక్షంలో చెన్నూరు బరిలో దిగుతామంటూ సంకేతాలు ఇస్తున్నట్టు సమాచారం. ఇక సీపీఎం మిర్యాలగూడతో పాటు భద్రాచలం లేదా పాలేరు స్థానాలు ఇవ్వాలని కోరింది. అయితే భద్రాచలంలో ఇప్పటికే తమ అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్.. మిర్యాలగూడ స్థానానికి మాత్రం సరే అంది. కానీ పాలేరు విషయంలోనే ఎటూ తేలడం లేదని సీపీఎం వర్గాలు చెబుతున్నాయి. పాలేరు సీటు ఇచ్చేది లేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నట్టు సమాచారం. దీంతో ఇంకో సీటు విషయంలో సందిగ్ధత నెలకొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏదో ఒక సీటు ఇవ్వాల్సిందేనని సీపీఎం పట్టుబడుతుండటంతో అనూహ్యంగా ఇప్పుడు ఆ జిల్లాలోని వైరా రిజర్వుడు స్థానం తెరపైకి వచ్చింది. వైరా నియోజకవర్గంలో సీపీఎంకు మంచి పట్టుంది. కాబట్టి పాలేరు సాధ్యం కాకుంటే వైరాను అడగాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. కానీ వైరాలో కాంగ్రెస్ అభ్యర్థినే బరిలో దింపాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పట్టుదలతో ఉన్నట్టు తెలిసింది. దీంతో వైరా కూడా ఎంతవరకు ముడిపడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

వామపక్షాల అసహనం!

కాంగ్రెస్‌తో పొత్తు ఇప్పటికీ ఒక కొలిక్కి రాకపోవడంతో సీపీఐ, సీపీఎం నేతల్లో అసహనం వ్యక్తం అవుతోంది. సీపీఐకి కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపినా ఇంకా పని చేసుకోండంటూ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదని సీపీఐ వర్గాలు చెబుతున్నాయి. ఈ సీట్లపై కూడా అనుమానాలున్నాయా అనే సందేహాలు ఆ పార్టీ కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సీపీఎంకు మిర్యాలగూడ ఖరారు చేసినా.. ఆ సీటు విషయంలోనూ పూర్తిగా భరోసా ఇవ్వలేదని ఆ పార్టీ చెబుతోంది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా ఎక్కడ పోటీలో ఉంటామో స్పష్టత లేకపోవడంతో వామపక్షాల నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇంకా ఆలస్యం చేస్తే ప్రచారానికి తగిన సమయం ఉండదని అంటున్నాయి. అంతేకాదు పొత్తులపై తమ కేడర్‌కు ఎలాంటి స్పష్టత ఇవ్వలేకపోతున్నామని చెబుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ కూడా ప్రచారంలో దూసుకుపోతుండటాన్ని వారు ప్రస్తావిస్తున్నారు.

బీఎల్ఎఫ్ రెండో జాబితా

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఎమ్మెల్యే అభ్యర్థుల రెండో జాబితాను గురువారం ఆ పార్టీ విడుదల చేసింది. 16 మంది అభ్యర్థులను బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ ప్రకటించారు.

ఇల్లెందు బరిలో గుమ్మడి అనురాధ



గతంలో ఇల్లెందు నుంచి అనేకసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మడి నర్సయ్య కుమార్తె గుమ్మడి అనురాధ ఈసారి ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఆమె స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. అనురాధ ఉస్మానియా లా కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. తనకు న్యూడెమోక్రసీ, ప్రజాపంథా సహా పలు సీపీఐ (ఎంఎల్) పార్టీల మద్దతు ఉన్నట్లు ఆమె చెబుతున్నారు. అయితే బలమైన తండ్రి వారసత్వం ఆమెకు కొంత అనుకూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీజేపీ తొలి జాబితాకు నేడు గ్రీన్‌సిగ్నల్!

- ఢిల్లీలో వరుస సమావేశాలతో కొలిక్కి వచ్చిన కసరత్తు
- మొదట కోర్ గ్రూప్.. తర్వాత నడ్డా, అమిత్ షాలతో రాష్ట్ర నేతల భేటీలు
- కిషన్‌రెడ్డి, ఈటల, బండి, డీకే అరుణ, లక్ష్మణ్, జవదేకర్ తదితరులు హాజరు
- మోదీ, అమిత్ షా, నడ్డా ప్రచార సభలు, పర్యటనల ప్రణాళికపైనా చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున బరిలోకి దిగే అభ్యర్థుల తొలి జాబితాకు శుక్రవారం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. సీఈసీకి పంపే జాబితాకు సంబంధించి గురువారం ఢిల్లీలో వరుసగా భేటీలు, చర్చలు జరిగాయి. బీజేపీ రాష్ట్ర చీఫ్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, పార్టీ సీనియర్ నేతలు ఈటల రాజేందర్, ప్రకాశ్ జవదేకర్ తదితరులు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. పార్టీ బలంగా ఉన్న సీట్లు, అభ్యర్థుల బలాబలాలపై పార్టీ పెద్దలతో రాష్ట్ర నేతలు చర్చించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర కేంద్ర మంత్రులు, ముఖ్య నేతల పర్యటనలు, అనుసరించాల్సిన వ్యూహాలపై రాష్ట్ర నేతలకు పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేశారు. ఇక తెలంగాణలో ఒంటరిగానే పోటీచేయాలని బీజేపీ నిర్ణయించిన నేపథ్యంలో.. ఇటీవల జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో జరిగిన చర్చల అంశాన్ని పార్టీ పెద్దలకు కిషన్‌రెడ్డి వివరించారు.

వరుసగా భేటీలతో..

తొలుత గురువారం మధ్యాహ్నం పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ నివాసంలో రాష్ట్ర కోర్ గ్రూప్ సమావేశం జరిగింది. ఈ భేటీలో తెలంగాణ నేతలతోపాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్‌లు పాల్గొన్నారు. ఇందులో ఒకే అభ్యర్థి ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాపై చర్చించారు. ఇద్దరు, ముగ్గురు పోటీపడుతున్న సెగ్మెంట్లకు సంబంధించి ఆయా అభ్యర్థుల బలాబలాలను సమీక్షించారు. తర్వాత గురువారం సాయంత్రం పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో మరోసారి కోర్ గ్రూప్ భేటీ అయ్యింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఇందులో పాల్గొన్నారు. తొలి జాబితా విడుదలయ్యాక ఎలాంటి అసంతృప్త స్వరాలు వినిపించకుండా ఉండేలా.. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి క్షుణ్నంగా సమీక్షించారు. చర్చించే సమయంలో తెలంగాణ అభ్యర్థుల జాబితాలను మూడు కేటగిరీలుగా.. పార్టీ బలంగా ఉన్న స్థానాలు, గట్టి పోటీ ఇచ్చే స్థానాలు, బలం పుంజుకోవాల్సిన సీట్లుగా జాబితాలను సిద్ధం చేసినట్టు తెలిసింది.

ప్రచార ప్రణాళికపైనా చర్చ

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రచారాన్ని దూకుడుగా కొనసాగించే అంశంపై రాష్ట్ర నాయకులకు అమిత్ షా దిశానిర్దేశం చేశారు. ఎక్కడెక్కడ బహిరంగ సభలు నిర్వహించాలి, ఎక్కడ భారీ ర్యాలీలు చేపట్టాలన్న దానిపై ఇప్పటికే ఖరారైన ప్రణాళికను అమిత్ షా, నడ్డాలకు రాష్ట్ర నేతలు వివరించారు. వీటితోపాటు కేంద్ర పెద్దల పర్యటనలు, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు.

మరో ముగ్గురికి బీఆర్ఎస్ బీ ఫారాల అందజేత

సాక్షి, హైదరాబాద్: మరో ముగ్గురు బీఆర్ఎస్ అభ్యర్థులు గురువారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫారాలు అందుకున్నారు. రాష్ట్రమంత్రి, పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్ ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి, మిర్యాలగూడ అభ్యర్థి నల్లమోతు భాస్కర్ రావు బీఫారాలు అందుకున్న వారిలో ఉన్నారు. ఇప్పటివరకు మొత్తం 107 మంది అభ్యర్థులకు బీఆర్ఎస్ బీఫారాలు అందచేసింది.



ఎర్రబెల్లికి బీఫాం అందజేస్తున్న సీఎం కేసీఆర్

బీజేపీ బీసీ సీఎం!

▶ మొదటి పేజీ తరువాయి

బీసీగర్జన సభలోగానీ, మరోచోట నిర్వహించే బహిరంగ సభలోగానీ దీనిపై ప్రకటన వెలువడవచ్చని అంటున్నాయి. ముందుగానే సీఎం అభ్యర్థిని ప్రకటించడం బీజేపీ సాంప్రదాయం కాదని.. దానిని పక్కనపెట్టి అయినా ఓ కీలకనేత పేరును సీఎం అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ ముఖ్య నేతలు వెల్లడించారు. రాష్ట్రంలో బీసీ వర్గాలను అధికారంలో భాగస్వాములను చేస్తామని.. రాష్ట్ర అభివృద్ధికి తీసుకునే కీలక నిర్ణయాల్లో వారి ప్రమేయం ఉండేలా చూస్తామని అగ్రనేతలు హామీ ఇవ్వనున్నారని తెలిపారు. పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర మంత్రివర్గంలోనూ బీసీలకు తగిన స్థాయిలో పదవులు ఇస్తామన్న భరోసా కల్పించనున్నట్టు వెల్లడించారు. అంతేగాకుండా ఇప్పటికే పార్టీలో బీసీలకు ప్రాధాన్యమిచ్చిన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. బీసీలకు భరోసా కల్పించేలా పలు అంశాలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చాలని నిర్ణయించినట్టు నేతలు వివరించారు.

రెడ్డి వర్గం ఫోకస్‌గా ఇంద్రసేనారెడ్డికి పదవి!

బీసీ నినాదంతో ఇతర వర్గాల నుంచి వ్యతిరేకత రాకుండా రెడ్డి, ఇతర సామాజిక వర్గాలను దగ్గర చేసుకునేందుకూ బీజేపీ అధిష్టానం వ్యూహాలను అమలు చేస్తోంది. ఇప్పటికే కిషన్‌రెడ్డికి కేంద్ర మంత్రిగా అవకాశం ఇచ్చింది. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి మార్చాక ఆ బాధ్యతలను కిషన్‌రెడ్డికే అప్పగించింది. తాజాగా పార్టీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డికి గవర్నర్ పదవి కట్టబెట్టింది. ఇదే సమయంలో బీసీ నేతలకు పార్టీలో కీలక పదవులు ఇవ్వడం ద్వారా రెడ్డి, బీసీ కాంబినేషన్‌లో ఎన్నికలకు వెళుతున్న సంకేతాలను పార్టీ ఎప్పుడో ఇచ్చిందని బీజేపీ నేతలు చెప్తున్నారు. బీసీలకు పెద్దపీట, సీఎంగా బీసీ అభ్యర్థికి అవకాశం అంశాలపై పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జులు, ముఖ్య నేతలు పలుమార్లు కసరత్తు చేశారని.. రెడ్డి సామాజికవర్గం సహా అందరు ముఖ్య నేతలు బీసీ ఎజెండాకు మద్దతు ఇచ్చారని అంటున్నారు.

బీసీ కీలక నేతల్లో.. చాన్స్ ఎవరికి?

ఇప్పటికే పార్టీలో బీసీ నేతలకు కీలక పదవులు అందాయని బీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. కె.లక్ష్మణ్‌కు తొలుత ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా, యూపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చారని.. ఆ తర్వాత పార్టీలో కీలక పదవులైన పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీల్లో సభ్యులుగా నియమించారని గుర్తు చేస్తున్నారు. బండి సంజయ్‌కు తొలుత రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశమిచ్చారని.. తర్వాత జాతీ య ప్రధాన కార్యదర్శిగా నియమించారని చెప్తున్నారు. ఇక బీసీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మ పురి అర్వింద్‌కు ప్రాధాన్యతనివ్వడం, ఎన్నికల్లో ఆయన ఇచ్చిన హామీని నెరవేర్చేలా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటన వచ్చిందని వివ రిస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా కాసం వెంకటేశ్వర్లు యాదవ్ నియమితులయ్యారని పేర్కొంటున్నారు. మరోవైపు ఉద్యమకాలం నుంచీ బీఆర్ఎస్‌లో నంబర్ టూగా, తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలోనూ కీలకపాత్ర పోషించిన ఈటల రాజేందర్‌కు బీజేపీలో చేరాక ప్రాధా న్యం అందిందని, కీలక కమిటీల బాధ్యత అప్పగించారని పార్టీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. బీసీ నేత అయిన ఈటల రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ బీసీ సెక్షన్లు, కులసంఘాల నేతలు, ముఖ్యులను కలుస్తూ బీజేపీకి సానుకూలత తెచ్చే ప్రయత్నా లు చేస్తున్నారని వివరిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే.. ఈ నేతల్లో ఒకరు సీఎం అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని అంటున్నాయి.

నేడు బీఆర్ఎస్‌లోకి జిట్టా, రావుల

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితిలో ఇద్దరు కీలక నేతల చేరికకు రంగం సిద్ధమైంది. ఉద్యమ సమయంలో బీఆర్ఎస్‌లో పనిచేసి ఆ తర్వాత పార్టీకి దూరమైన జిట్టా బాలకృష్ణారెడ్డి 14 ఏళ్ల తర్వాత తిరిగి సొంత గూటికి చేరనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మంత్రి హరీశ్‌రావు సమక్షంలో జిట్టా గులాబీ కండువా కప్పుకుంటారు. బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత 'యువ తెలంగాణ' పార్టీని ఏర్పాటు చేసిన జిట్టా 2002 ఫిబ్రవరిలో తన పార్టీని బీజేపీలో విలీనం చేశారు. బీజేపీ విధానాలతో విభేదిస్తూ ఈ ఏడాది జూన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. భువనగిరి టికెట్‌ను ఆశించినా దక్కక పోవడంతో తాజాగా బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. జిట్టా గురువారం ప్రగతిభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మంత్రి హరీశ్ రావుతో భేటీ అయ్యారు. గతాన్ని మరిచి పార్టీలోకి రావాల్సిందిగా కేటీఆర్ ఆహ్వానించినట్లు సమాచారం. పార్టీలో చేరిక తర్వాత సీఎం కేసీఆర్‌తో జిట్టా భేటీ అవుతారు. కాగా బీఆర్ఎస్‌లో తన చేరికకు సంబంధించి జిట్టా బాలకృష్ణారెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ తాను తిరిగి తన సొంతింటికే చేరుకుంటున్నానని వ్యాఖ్యానించారు.

రావుల చంద్రశేఖర్‌రెడ్డి కూడా..

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, వనపర్తి మాజీ ఎమ్మెల్యే, రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి కూడా శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్‌లో చేరనున్నారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌తో ఉదయం ప్రగతిభవన్‌లో భేటీ తర్వాత రావుల తెలంగాణ భవన్‌కు చేరుకుంటారు. రావుల చేరిక కార్యక్రమానికి కేసీఆర్ హాజరయ్యే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

అసంతృప్తులకు బుజ్జగింపులు!

గజ్వేల్ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో నేడు సీఎం కేసీఆర్ భేటీ

గజ్వేల్/కొండపాక: గజ్వేల్‌లోని బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, నాయకులతో శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఉద్యమ కాలం నుంచి ఉన్న తమకు బీఆర్ఎస్‌లో సరైన గౌరవం ఇవ్వడం లేదని ఇటీవల కొందరు అసమ్మతిరాగం వినిపించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి శనివారం వరకు సానుకూల ప్రకటన రాకపోతే పార్టీ పదవులకు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని వారు అల్టిమేటం జారీ చేశారు. ఈ క్రమంలో అసమ్మతి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పార్టీ అధ్యక్షులను మండలానికి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుజ్జగించే ప్రయత్నం చేశారు. కేసీఆర్‌తో మాట్లాడే అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో కేసీఆర్ మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు సమావేశంలో ప్రారంభమవుతుంది.



పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల మైదానంలో విజయభేరి యాత్ర సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ. చిత్రంలో మధుయాష్కీ, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పెద్దపల్లిలో విజయభేరి యాత్ర సభకు హాజరైన జనం

రాష్ట్రంలో కాంగ్రెస్ సునామీ

▶ మొదటి పేజీ తరువాయి

ఎంఐఎం ఒక్కటేనన్నారు. బీజేపీ, ఎంఐఎంలకు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్లేనని చెప్పారు. తెలంగాణతో తనది రాజకీయ బంధం కాదని ఆప్యాయతతో కూడిన కుటుంబ బంధమని పేర్కొన్నారు. తనకంటే ముందు నెహ్రూ, ఇందిర, రాజీవ్‌లతో తెలంగాణకు బంధం ఉందని చెప్పారు. ఇవే మాటలు చెప్పి తన చెల్లి ప్రియాంకా గాంధీని రాష్ట్ర పర్యటనకు తీసుకొచ్చానని తెలిపారు. విజయభేరి యాత్రలో భాగంగా గురువారం ఉదయం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో, ఆ తర్వాత కరీంనగర్ జిల్లా మంథని రోడ్‌షోలో, పెద్దపల్లి బహిరంగ సభలో, కరీంనగర్ రాజీవ్‌చౌక్ కార్నర్ మీటింగ్‌లో రాహుల్ ప్రసంగించారు.

దేశంలోనే నంబర్ 1 అవినీతి సీఎం

'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇస్తామని 2004లో చెప్పిన కాంగ్రెస్ పార్టీ 2014లో మాట నిలబెట్టుకుంది. తెలంగాణ ఇస్తే రాజకీయంగా నష్టపోతామని తెలిసినా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు సోనియా తెలంగాణ ఇచ్చారు. కానీ రాష్ట్రానికి సీఎం అయిన కేసీఆర్ ఈ పదేళ్లలో ప్రజా ఆకాంక్షలను నెరవేర్చలేకపోయారు. కాళేశ్వరంలో రూ.లక్షల కోట్ల అవినీతి జరిగింది. అయినా ఎకరం కూడా తడపలేకపోయారు. ఈ ప్రాజెక్టు వల్ల కేవలం కేసీఆర్ మిత్రులైన బడా కాంట్రాక్టర్లు లాభపడ్డారు. భూ రికార్డుల ప్రక్షాళన పేరిట తెచ్చిన ధరణితో పేదల లక్షల ఎకరాలు మాయమయ్యాయి. దేశంలోనే నంబర్ వన్ అవినీతి ముఖ్యమంత్రి కేసీఆర్. రాష్ట్రంలో దొరల పాలనకు స్వస్తి పలకాలి. ఓ రాజు, తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్న పోరాటమే ఈ ఎన్నికలు..' అని రాహుల్ అన్నారు.

కాంగ్రెస్ చేసి చూపిస్తుంది

'డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల పంపిణీ అటకెక్కాయి. రైతు రుణమాఫీ, రైతుబంధు వల్ల ఎందరికి ప్రయోజనం కలిగింది? దేశంలో బొగ్గు ధరల విషయంలో అదానీ కంపెనీలకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉంటున్నాయి. మోదీ రూ.15 లక్షలు ఇవ్వలేదు. కానీ కాంగ్రెస్ చెప్పినవన్నీ చేసి చూపిస్తుంది. ఇప్పటికే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో పథకాలు అమలు చేస్తున్నాం. కాంగ్రెస్‌ను ఓడించడానికి బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం మిలాఖత్ అయ్యాయి. బీఆర్‌ఎస్‌ను అడ్డుపెట్టుకొని మోదీ తెలంగాణను అధోగతి పాలు చేస్తున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల ప్రభుత్వం రాబోతోంది. ఢిల్లీలో బీజేపీని, ఇక్కడ బీఆర్‌ఎస్‌ను ఓడించాలి..' అని రాహుల్ పిలుపునిచ్చారు.

కులగణన దేశానికి ఎక్స్‌రే లాంటిది

'దేశంలో, రాష్ట్రంలో సామాజిక న్యాయం కరువైంది. నిత్యం ఓబీసీ ప్రయోజనాలపై మాట్లాడే ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌లు ఏనాడూ కులగణన ప్రస్తావన తీసుకురారు. దేశాన్ని ఎంపీలు కాకుండా 90 మంది కార్యదర్శులు నడిపిస్తుంటారు. బడ్జెట్ కేటాయింపులు రూపొందించేది వారే. ఈ కేటాయింపులు జరిపే కార్యదర్శుల్లో కేవలం ముగ్గురు మాత్రమే ఓబీసీకి చెందిన వారున్నారు. దేశంలో మెజారిటీ వాటా ఉన్న ఓబీసీలకు రూ.44 లక్షల కోట్ల బడ్జెట్‌లో దక్కుతున్నది కేవలం 5% మాత్రమే. అందుకే ఓబీసీ కులగణన జరగాలి. అది దేశానికి ఎక్స్‌రే లాంటిది. అది చేపడితే ప్రజలు అప్రమత్తమవుతారన్న భయంతోనే వారు కులగణనపై వెనకడుగు వేస్తున్నారు. ప్రజల పక్షాన బీజేపీపై నేనొక్కడిని ఒంటరి పోరాటం చేస్తున్నా. నా పోరాటాన్ని అడ్డుకోవడానికి బీజేపీ నాపై అక్రమంగా 24 కేసులు పెట్టింది. లోక్‌సభ సభ్యత్వం రద్దు చేసి ఇల్లు కూడా లాగేసుకుంది. ఎన్ని అవరోధాలు కల్పించినా భయపడేది లేదు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తా..' అని రాహుల్ స్పష్టం చేశారు.

తెలంగాణ ఇవ్వకపోతే అడుక్కుతినేవారు: రేవంత్

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ కుటుంబం నాంపల్లి దర్గా లేదా బిర్లా గుడి దగ్గర అడుక్కుతినే వారని విమర్శించారు. కేటీఆర్ అమెరికాలో బాత్రూములు కడుక్కునే వారన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కొండా సురేఖకు గాయాలు

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ కాన్వాయ్‌లోనే ఉండి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ బైక్ ర్యాలీలో మాజీ మంత్రి కొండా సురేఖ కూడా పాల్గొన్నారు. ఆమె స్కూటీపై వెళ్తుండగా స్కిడ్ కావడంతో కిందపడిపోయారు. దీంతో ముఖంపై స్వల్ప గాయాలయ్యాయి. స్పృహ తప్పిన సురేఖను వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి బాగానే ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

మీ బతుకుల్లో వెలుగులు నింపుతాం

ఆదాయ పన్ను రద్దు చేస్తాం • సింగరేణి కార్మికుడి ఇంట్లో రాహుల్ ఆకస్మిక భేటీ

సాక్షి, పెద్దపల్లి: కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రకృతికి విరుద్ధంగా, కృత్రిమ పరిస్థితుల మధ్య ప్రాణాలకు తెగించి పని చేస్తూ దేశానికి వెలుగులు నింపే సింగరేణి కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపుతామని వారికి భరోసా కల్పించారు. కార్మికులకు ఆదాయ పన్ను రద్దు చేస్తామన్నారు. ప్రైవేటీకరణ కాకుండా సింగరేణిని కాపాడతామని చెప్పారు. విజయభేరి యాత్రలో భాగంగా పెద్దపల్లి జిల్లా సెంటినరీ కాలనీలో సింగరేణి కార్మికులతో రాహుల్ సమావేశమవుతారంటూ కాంగ్రెస్ ప్రచార షెడ్యూల్ విడుదల చేసింది. దానికి తగినట్లుగా కాంగ్రెస్ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. అయితే రాహుల్ రామగిరి మండలం లద్నాపూర్‌లో ఆకస్మికంగా ఆగారు. అక్కడ సింగరేణి కార్మికుడు పోచయ్య ఇంటికి వెళ్లారు. సాదాసీదాగా ఇంట్లోకి వచ్చిన రాహుల్‌గాంధీని చూసి పోచయ్య కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అక్కడే సుమారు 50 మంది సింగరేణి కార్మికులతో వారి వస్త్రధారణ, నెత్తిపై టోపీతో రాహుల్ భేటీ అయ్యారు. వారి సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. ఆదాయ పన్ను రద్దు చేయాలి లేదా స్లాబ్ పెంచాలని, ప్రైవేటీకరణను ఆపివేయాలని, కొత్తగా ఏర్పాటు చేయబోయే మైన్స్ ప్రైవేట్‌కి కాకుండా సింగరేణికి కేటాయించాలని వారు కోరారు. రాహుల్ వారికి స్పష్టమైన హామీలు ఇచ్చి భరోసా కల్పించారు. కార్మికులతో కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కాగా ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవంత్‌రెడ్డి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1వ గనిలో ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. సింగరేణి కార్మికుల పోరాటం, త్యాగాలు మరువలేనివని అన్నారు.



సింగరేణి కార్మికులతో రాహుల్ గాంధీ

భరోసా కల్పించేలా హామీలిచ్చారు

ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరణ చేస్తున్న వైనాన్ని వివరించాం. గతంలో 1.10 లక్షల మంది పర్మినెంట్ కార్మికులు ఉంటే నేడు 45 వేల మందే ఉన్నారని చెప్పాం. మా సమస్యలన్నీ విని, మాకు భరోసా కల్పించేలా రాహుల్ హామీలిచ్చారు.

– ఎ.శ్రీనివాస్, జనరల్ మజ్దూర్

రాహుల్‌గాంధీ వచ్చారంటే నమ్మలేకపోతున్నా..

మా ఇంటికి రాహుల్‌గాంధీ వస్తారని ఊహించలేదు. ఆయన రావడం, మాఇంట్లో సమావేశం నిర్వహించడం నమ్మలేకపోతున్నా. సుమారు 40 నిమిషాల పాటు మా ఇంట్లో ఉన్నారు. మా మనవరాలికి చాక్లెట్ ఇచ్చారు.

– ఓదెమ్మ, సింగరేణి కార్మికుడి భార్య

కుటుంబపాలన గురించి రాహుల్ మాట్లాడటమా?: నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కుటుంబపాలన, అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర వ్యవసాయమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం ఇక్కడి తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోఫోర్స్ కుంభకోణంలో అప్పటి కాంగ్రెస్ ప్రధాని రాజీవ్‌గాంధీ అధికారం కోల్పోయిన విషయం మరిచారా అని ప్రశ్నించారు. రాహుల్ కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందనడం, కనీస సమాచారం లేకుండా రుణమాఫీ జరగలేదనడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ముక్కలయ్యాయని, వ్యవసాయానికి ఐదు గంటలకు మించి కరెంటు ఇవ్వలేమని అక్కడి మంత్రి అనడం చూస్తుంటే, అక్కడ అమలు కానీ హామీలు ఇక్కడ అమలవుతాయా అని నిలదీశారు. తెలంగాణ వడ్లు కొనబోమని కేంద్రప్రభుత్వం అన్నప్పుడు రాహుల్ నోరెందుకు మెదపలేదని నిలదీశారు.

రేపు లేదా ఎల్లుండి కాంగ్రెస్ మలి జాబితా

• 21న కాంగ్రెస్ సీఈసీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి మలి విడత అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఈ నెల 21న భేటీ కానుంది. నిజానికి 19 లేదా 20వ తేదీనే ఈ సమావేశం ఉంటుందని భావించినప్పటికీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్రాల పర్యటనలో ఉండటం, అగ్రనేత రాహుల్ గాంధీ సైతం తెలంగాణలో పర్యటిస్తుండటంతో ఈ భేటీ 21కి వాయిదా పడింది. అదే రోజున ఇప్పటికే ప్రకటించిన 55 స్థానాలను పక్కనబెట్టి మిగతా స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. అనంతరం 21న రాత్రికి కానీ 22న ఉదయం కాని జాబితా విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనికి సంబంధించి స్క్రీనింగ్‌కమిటీ చైర్మన్ మురళీధరన్ సహా రాష్ట్ర నేతలకు సమాచారం వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంకోసం శుక్రవారం సాయంత్రానికి కీలక నేతలు ఢిల్లీ చేరుకోనున్నారు.

రాహుల్ లీడర్ కాదు.. రీడర్ మాత్రమే

• ఆయన ఏ హోదాతో మాట్లాడుతున్నాడో ప్రజలకు చెప్పాలి: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి చెందిన ఢిల్లీ నేతలు ప్రజలకు బంధువులు కాదని, రాబందులని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఎన్నికలనగానే వచ్చివాలుతారని, ఆ తర్వాత వారి జాడ ఉండదన్నారు. రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చి అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి బ్యాచ్ రాసిచ్చే అబద్ధాలనే చదివిపోతున్నారన్నారు. అందుకే రాహుల్ లీడర్ కాదని.. జస్ట్ రీడర్ అని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో గెలిస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని రాహుల్ అంటున్నారని, అసలు ఆయన ఏ హోదాతో ఆ మాట చెబుతున్నారని ప్రశ్నించారు. ములుగు, మంథని కాదు, తెలంగాణ లో ఏ నియోజకవర్గానికి వెళ్లినా అభివృద్ధి కళ్లకు కడుతుందని, ఏ గడపకు వెళ్లి నా గులాబీ జెండా కనిపిస్తుందని, ఏ గుండె చప్పుడు విన్నా జై కేసీఆర్, జై తెలంగాణ అంటుందన్నారు. కర్ణాటకలో రైతులకు ఏడు గంటల కరెంటు ఇస్తామని అధికారంలోకి వచ్చి, ఇప్పుడు 5 గంటల కరెంటు కూడా ఇస్తలేరన్నా రు. ఇక్కడ కూడా రైతులకు 3 గంటల కరెంటు చాలని రేవంత్‌రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. దీనిని బట్టి రైతులకు కరెంటు ఇవ్వడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని స్పష్టం అవుతుందన్నారు. సీఎం కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టే.. రైతుల కష్టాలు బాగా తెలుసు కాబట్టే.. 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నారని, కానీ ప్రధాని మోదీ అది తప్పు అంటున్నారని, మోటార్లకు మీటర్లు పెట్టమంటున్నారని హరీశ్ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో వరి ధాన్యాన్ని ఎంఎస్‌పీకి కొంటున్నాం అని రాహుల్ డబ్బా కొట్టుకుంటున్నారని, మరి ఎకరానికి కేవలం 15 క్వింటాళ్లు మాత్రమే కొంటున్నారన్నారు. మన రాష్ట్రంలో రైతులు ఎకరానికి 23–25 క్వింటాళ్లు పండిస్తున్నారని, మన సీఎం కాంగ్రెస్వోళ్ల మాదిరి ఆంక్షలు పెట్టలేదన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ ఉత్సవంగా ప్రకటిస్తామని రాహుల్‌గాంధీ చెబుతున్నారని, సమ్మక్క సారలమ్మ జాతర ఇయ్యాల్నే జరుగుతున్నదా? అని ప్రశ్నించారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

• సీఎంతో మాట్లాడతామని హౌసింగ్ సొసైటీ ప్రతినిధులకు మంత్రి హరీశ్‌రావు హామీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో మాట్లాడతామని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గురువారం ప్రగతిభవన్‌లో 'ది తెలంగాణ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ' ప్రతినిధులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటైన సొసైటీ సభ్యత్వ వివరాలను మంత్రి తెలుసుకున్నారు. మూడోసారి కూడా తామే కచ్చితంగా అధికారంలోకి వస్తామని, జర్నలిస్టుల ఇళ్ల సమస్యను కూడా తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాను, మంత్రి కేటీఆర్ కలిసి ఈ అంశంపై సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతామని చెప్పారు. కోర్టు కేసుల కారణంగా హైదరాబాద్‌లో జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరించడం ఆలస్యమైందని ఆయన పేర్కొన్నారు. కోర్టు కేసు పరిష్కారం కోసం ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిని పెట్టి, ప్రభుత్వం తరఫున అఫిడవిట్ వేసి, జర్నలిస్టులకు తీర్పు అనుకూలంగా వచ్చేందుకు సహకరించామని తెలిపారు. మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు కాగానే.. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రాధాన్యత అంశంగా తీసుకుంటామని హరీశ్‌రావు వెల్లడించారు. కొత్త, పాత సొసైటీల్లోని సభ్యులందరికీ కలిపి ఒకేసారి ఇళ్ల స్థలాలను కేటాయించే దిశలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడతామని ఆయన చెప్పారు.

గీత వృత్తిదారుల సంక్షేమంపై పార్టీలు హామీ ఇవ్వాలి

• గీత పనివారల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్

నాగోలు: గీత వృత్తిదారులకు వృత్తి రక్షణ, ఆధునీకరణ, నిధుల కేటాయింపుపై రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో స్పష్టమైన హామీ ఇవ్వాలని తెలంగాణ గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. చెట్టుపై నుంచి పడి మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని, ఆసరా పెన్షన్ల పేరుతో కాకుండా వృత్తి పెన్షన్‌గా నెలకు రూ.5,000 ఇవ్వాలని అన్నారు. గురువారం ఎల్‌బీనగర్‌లో గీత పనివారల సంఘం 66వ వార్షికోత్సవం సందర్భంగా సంఘం జెండాను ప్రభాకర్ ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ కల్లు గీతవృత్తి బాగుండాలంటే వనాల పెంపకంకోసం ప్రభుత్వం ప్రతి సొసైటీకి పది ఎకరాల భూమిని కేటాయించాలని, ప్రతి గ్రామంలో కల్లుగీత సహకార సంఘాలకు 1,000 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. గీత వృత్తిదారుల కుటుంబాలకు విద్య, వైద్య పథకాలని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, వారి పిల్లలకు విదేశీ విద్య కోసం రూ.50 లక్షల ఆర్థిక సహకారం అందించాలని కోరారు. అలాగే గీత వృత్తిదారులకు ద్విచక్ర వాహనాలు, వృత్తి పరికరాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు బొమ్మగాని నాగభూషణం, కేవీఎల్, మారగాని ప్రవీణ్ కుమార్‌గౌడ్, పోలగాని రవికిషోర్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బొమ్మగాని ప్రభాకర్

ముగిసిన ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ముగిసినట్లు సాంకేతిక విద్య కమిషనరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో 32,299 ఎంబీఏ, ఎంసీఏ సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటి వరకు 27,075 కేటాయించినట్లు వెల్లడించింది. ఎంబీఏలో 22,679, ఎంసీఏలో 4,396 సీట్లు భర్తీ అయిన వాటిలో ఉన్నాయని తెలిపింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 31లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం : 20 : అక్టోబర్ : 2023

రాఘవేంద్ర నగర్‌లో రజితా రెడ్డి..



పతుల కోసం సతుల్!

అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన పతుల విజయం కోసం సతులు ప్రచార పర్వంలో పాల్గొంటున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. తమ భర్తకే ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. గురువారం ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డి భార్య, కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్ రెడ్డి కార్యకర్తలతో కలిసి రాఘవేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. అలాగే.. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకి మద్దతుగా ఆయన భార్య శ్యామలాదేవి దీప్తిశ్రీ నగర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

– ఉప్పల్/మియాపూర్



దీప్తిశ్రీ నగర్‌లో శ్యామలాదేవి..



కత్తి పట్టెదన్.. మటన్ కొట్టెదన్!

ఈయనను చూశారుగా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్. ప్రస్తుతం సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. గురువారం ఆయన అడ్డగుట్ట ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేస్తూ ఓ షాపులో మటన్ కొడుతున్నట్లుగా ఫొటోకు ఇలా పోజిచ్చారు. – అడ్డగుట్ట

ఆ జోన్ అంతే!

అక్రమాలకు అంతూ పొంతూ లేదు



- అనుమతుల నుంచి ఓసీల దాకా అదే తంతు
- చేయి తడిపితేనే అనుమతులు.. అంతస్తుకో రేటు
- కాగితాలకే పరిమితమైన టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వల్లెవేసే నీతిసూత్రాలు వింటే ఎవరైనా విస్తుపోవాల్సిందే. అందులోనూ ఎల్‌బీనగర్ జోన్ మరింత ప్రత్యేకమనే చెప్పుకోవాలి. సామాన్యులు చిన్నపాటి డీవియేషన్లకు పాల్పడినా తాము చాలా స్ట్రిక్టు అంటూ నిర్మాణాలకు అనుమతులివ్వరు. నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తారు. అంతే కాదు. అన్నీ సవ్యంగా ఉన్నా అనుమతులివ్వరు. అదే టౌన్‌ప్లానింగ్ విభాగంలో సంప్రదించి చేతులు తడిపితే అనుమతులొస్తాయి. నిర్మాణాలు పూర్తయ్యాక ఓసీల జారీ లోనూ అదే తంతు. అందుకు కారణం కిందిస్థాయి నుంచి జోనల్‌స్థాయిలోని అత్యున్నతాధికారుల వరకు వాటాలుండటమే కారణమనే ఆరోపణలున్నాయి.

- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలతో పోటీ పడుతూ ఎల్‌బీనగర్ జోన్‌లో నిర్మాణాలు పెరిగిపోతుండటంతో అదేస్థాయిలో అవినీతి పెచ్చరిల్లుతోంది. అవినీతిని అడ్డుకోవాల్సిన ఉన్నతాధికారులు దాని బదులు ప్రోత్సహిస్తుండటంతో మరింత పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. ఓసీ ఇవ్వాలంటే ఎంత మేర డీవియేషన్ జరిగిందో గుర్తించి, దాన్ని చదరపు అడుగులుగా లెక్కించి అంత స్థలం ద్వారా నిర్మాణదారులకు ఎంత లాభం వస్తుందో లెక్కలు వేసి ఆమేరకు లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కో భవనం నుంచి రూ. 25 లక్షల దాకా చేతులు మారుతున్నాయనే ఆరోపణలున్నాయి. నిర్మాణ అనుమతులకైతే నివాస భవనాలకు ఫ్లోర్‌కు లక్ష, వాణిజ్య భవనాలకు రూ.2 లక్షల చొప్పున వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

టీఎస్ బీపాస్ వచ్చినా

టీఎస్ బీపాస్ ద్వారా అవినీతి లేకుండా సులభతరంగా అనుమతులు జారీ అవుతున్నాయని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవంగా అమలు కావడం లేదు. ఎల్‌బీనగర్ జోన్ హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏసీబీ దాడుల్లో రూ.1.5 లక్షలు పట్టుకోవడం ఇందుకు మచ్చుతునక. బాధితులు ఫిర్యాదు చేసిన సందర్భాల్లో మాత్రమే ఇలాంటివి వెలుగు చూస్తుండటం తెలిసిందే.

కాగితాల్లోనే టాస్క్‌ఫోర్స్

అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్స్ టీమ్స్ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్నాయనేది ప్రకటనలకే పరిమితమైంది తప్ప అమలు జరగడం లేదు. టీఎస్ బీపాస్ అమల్లోకి వచ్చాక ఎన్ని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారో వివరాలు వెల్లడించని అధికారుల తీరే అందుకు నిదర్శనం.కొందరు అధికారులైతే అక్రమాలకు పాల్పడ్డ వారి గురించి ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవాల్సింది పోయి.. ఫిర్యాదుదారుల వివరాలను అక్రమార్కులకు చేరవేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంటే అక్రమ నిర్మాణదారులకు అధికారులకు మధ్య ఎంత అవినాభావ సంబంధాలున్నాయో అంచనా వేసుకోవచ్చు. లంచాలివ్వలేని వారిపై ప్రతాపాలు చూపించడం తప్ప అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

ఏసీబీకి దొరికిపోయారు

- ఇంటి నిర్మాణ అనుమతికి రూ.1.5 లక్షలు లంచం
- టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం
- హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో పట్టివేత



ఉమ



లక్ష్మణ్

ఎల్‌బీనగర్: ఇంటి నిర్మాణ అనుమతికి లంచం తీసుకుంటున్న హయత్‌నగర్ టౌన్ ప్లానింగ్ అధికారితో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం పట్టుకున్నారు. గుర్రంగూడకు చెందిన జక్కిడి సుధాకర్‌రెడ్డి బీఎన్‌రెడ్డి నగర్‌లో ఇంటి నిర్మాణ అనుమతి కోసం హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకోసం టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఉమను సంప్రదించారు. ఇంటి నిర్మాణ అనుమతికి రూ.2 లక్షలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రూ.1.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ విషయాన్ని సుధాకర్‌రెడ్డి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సరూర్‌నగర్‌లోని హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి నుంచి రూ.1.5 లక్షలు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఉమ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి లక్ష్మణ్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీ తదితర అధికారులు పట్టుకున్నారు. అనంతరం వీరిని కోర్టులో హాజరుపర్చారు.

కూలీ జిందాబాద్!

ఇచ్చట డబ్బులిస్తే జైకొడతాం!!

- అడ్డా కూలీలే రాజకీయ పార్టీల కార్యకర్తలు
- ఎన్నికల ప్రచారానికి తీసుకువస్తున్న నేతలు
- నగరంలో వీరికి భారీగా పెరిగిన డిమాండ్
- రోజుకు రూ.500 భత్యం, భోజనం, మద్యం



సాక్షి, సిటీబ్యూరో: వాళ్లు రోజువారీ కూలీలే కానీ రకరకాల రాజకీయ జెండాలు, రంగురంగుల ప్లకార్డులు పట్టుకొని తిరుగుతారు. ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తారు. ఎన్నికల కదనరంగంలో మోహరించిన అభ్యర్థులకు వందిమాగధులు, మందీమార్బలం, కార్యకర్తల బలం లేకపోయినా అన్ని విధాలుగా అండగా నిలుస్తారు. అభ్యర్థుల 'బలాన్ని' చాటుతారు. వాళ్లే రాజకీయ పార్టీల ప్రచారానికి ర్యాలీలు నిర్వహించే అడ్డా కూలీలు. ఇటీవల వరకు భవన నిర్మాణాలు, రోడ్డు పనులు చేసేందుకు అడ్డాలపై పడిగాపులు కాసిన వలస కూలీలకు అకస్మాత్తుగా డిమాండ్ వచ్చేసింది. దీంతో ఇప్పుడు గ్రేటర్‌లో ఏ అడ్డాకు వెళ్లినా కూలీలు కనిపించడం లేదు. అంతా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. కొంతమంది నెలరోజుల పాటు ఏదో ఒక పార్టీ దగ్గర కూలీ మాట్లాడుకొని జై కొడుతుండగా, మరికొందరు మాత్రం ఏ రోజు ఏ పార్టీ ప్రచారానికి పిలిచినా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. అంతేకాదు.. రాజకీయ పార్టీలకు ఈ ప్రచార కూలీలను చేరవేసేందుకు మేస్త్రీలు, చిన్నపాటి కాంట్రాక్టర్‌లు కూడా రంగంలోకి దిగారు. పార్టీలతో బేరసారాలు మాట్లాడుకొని కూలీలను సరఫరా చేస్తున్నారు. కేవలం ప్రచారాలు, ర్యాలీలు, ప్రదర్శనలే కాదు. బహిరంగ సభలకు సైతం కూలీలను సరఫరా చేసే టీమ్‌లు ఇప్పుడు గట్టిగానే పని చేస్తున్నాయి. ఇటు ఉప్పల్ నుంచి అటు టోలీచౌకీ, లంగర్‌హౌస్ వరకు, కర్మన్‌ఘాట్ నుంచి మేడ్చల్ వరకు వందలాది అడ్డాల్లో పని కోసం ఎదురు చూసే వేలాది మంది రాజకీయ పార్టీలకు కూలీ కార్యకర్తలుగా పని చేస్తున్నారు.

అందుబాటులో అన్ని సదుపాయాలు..

ప్రచారంలో పరుగులు పెట్టే కూలీలకు రోజువారీ వేతనంతో పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని సదుపాయాలు లభిస్తుండటంతో ఏ పార్టీ వెనుక చూసినా గుంపులకొద్దీ కనిపిస్తున్నారు. ప్రతి రోజు రూ.500 చొప్పున వేతనంతో పాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి మందు బాటిల్ కూడా ఇవ్వడంతో కూలీలు పోటీ పడుతున్నారు. 'రోజంతా రెక్కలు కొట్టుకున్నా కూలీ దొరకడం లేదు. జెండా పట్టుకొని తిరిగితే చాలు డబ్బులతో పాటు, భోజనం కూడా లభిస్తుంది, ఇంకేం కావాలి' అని సికింద్రాబాద్‌లో ఉండే సుదర్శన్ చెప్పారు.

- సికింద్రాబాద్, సీతాఫల్‌మండి, వారాసిగూడ, గాంధీ హాస్పిటల్ తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది అడ్డా కూలీలు ఇప్పుడు పార్టీల ప్రచారంలోనే ఉన్నట్లు చెప్పారు. మహిళలు కూడా ఈ ఎన్నికల ఉపాధి కోసం పోటీ పడుతున్నారు. ఆయా పార్టీల నాయకులు కొందరు ముందు నడిస్తే జెండాలు పట్టుకొని, కండువాలు ధరించి వాళ్ల వెనుక నినాదాలు ఇస్తూ నడవటమే అడ్డా కూలీల పని. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, తిరిగి సాయంత్రం నుంచి రాత్రి ఎనిమిదింటి వరకు ప్రచారం కొనసాగిస్తున్నారు.
- కొద్ది రోజుల క్రితం వరకు కూడళ్లలో మోహరించి ఉండే కూలీలు ఇప్పుడు రాజకీయ పార్టీల ఎన్నికల శిబిరాల వద్దకు వచ్చి చేరుతున్నారు. దీంతో ఏ పార్టీ ఎన్నికల కార్యాలయం చూసినా సందడిగానే కనిపిస్తోంది. 'ఏ పార్టీకైనా కనీసం వంద మంది కూలీలను సప్లయ్ చేయడం కూడా కష్టంగా మారింది. రాజకీయ పార్టీల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. కానీ వాళ్లు ఆశించిన స్థాయిలో అందజేయలేకపోతున్నాం' అని రామంతాపూర్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ తెలిపారు. ఏ రోజుకు ఆ రోజు కూలీలను పోగు చేసి పంపించాల్సి వస్తుందని చెప్పారు.

ఎక్కువగా ఉత్తరాది వారే..

బతుకమ్మ, దసరా ఉత్సవాల నేపథ్యంలో తెలంగాణకు చెందిన వలస కూలీలంతా సొంత ఊళ్లకు తరలివెళ్తున్నారు. పైగా ఎన్నికల సీజన్ కావడంతో సొంత ఊళ్లల్లో కూడా డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో నగరంలో తెలంగాణకు చెందిన కూలీల కొరత ఏర్పడింది.శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తదితర ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కూలీలు, కొందరు ఉత్తర భారతానికి చెందినవారిని కూడా ప్రచారానికి తీసుకోవాల్సివస్తోందని ఒక రాజకీయ పార్టీ ప్రతినిధి చెప్పారు. 'వాళ్ల భాషతో మనకు ఇబ్బంది లేదు. మేం ఇచ్చే నినాదాలను వల్లె వేస్తే చాలు.'జిందాబాద్' అన్నా సరే. కావాల్సిందల్లా పెద్ద ఎత్తున గుంపు కనిపించడమే కదా' అన్నారు. ఏమైతేనేం పార్టీల ప్రచారం అడ్డా కూలీలకు 'పండగే' కదా.



అనుమానిత అకౌంట్లపై నిఘా ఉంచాలి

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా బ్యాంకుల్లో జరిగే డిజిటల్ లావాదేవీల్లో అనుమానిత, లెక్కకు మించిన నగదు అకౌంట్లపై నిఘా ఉంచి వాటి సమాచారాన్ని ప్రతి రోజు ఉదయం 10 గంటలలోపు పంపించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ సూచించారు. గురువారం ఆయా బ్యాంకుల మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీఐ (గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే) ద్వారా ఒక అకౌంట్ నుంచి ఎక్కువ అకౌంట్లకు నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యే సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఏటీఎంలలో నగదు డిపాజిట్ చేయడానికి వినియోగించే వాహనాలకు ఆయా బ్యాంకులు తప్పనిసరిగా జీపీఎస్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు, బ్యాంకు అధికారులు తరలిస్తున్న నగదుకు తప్పనిసరిగా డాక్యుమెంట్లు, క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగదుకు సంబంధించి రసీదులను తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. డిప్యూటీ ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు లక్ష రూపాయలకు మించిన నగదు లావాదేవీలపై సమాచారం అందించాలన్నారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ శరత్ చంద్ర, అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్స్) శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌సీలు రెడీ చేయండి

సాక్షి, సిటీబ్యూరో: ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను (డీఆర్‌సీలను) అన్ని వసతులతో సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ఉప ఎన్నికల అధికారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య, అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్‌లతో కలిసి నగరంలోని పలు నియోజకవర్గాలకు సంబంధించిన డీఆర్‌సీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీని కోరారు.



ఎన్నికల కోసం ట్రాఫిక్ కాప్స్ సన్నద్ధం

తమ పరిధిలోకి వచ్చే ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి



ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్ బాబు

- జాబితా తయారు చేసిన ట్రాఫిక్ చీఫ్ సుధీర్ బాబు
- సిబ్బందికి అవగాహన కల్పించేందుకు చర్యలు
- నోటిఫికేషన్ వచ్చే లోపు అంతా సిద్ధం చేయాలని లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విధుల పేరు చెప్పగానే శాంతి భద్రతలు పరిరక్షించే లా అండ్ ఆర్డర్ పోలీసులు.. తనిఖీలు, సోదాలు నిర్వహించే టాస్క్‌ఫోర్స్ బృందాలు... బందోబస్తులో పాల్గొనే సాయుధ బలగాలు మాత్రమే గుర్తుకువస్తాయి. అయితే.. ఈసారి నగర ట్రాఫిక్ విభాగం అధికారులు సైతం ఎలక్షన్ డ్యూటీ'ల కోసం సన్నద్ధమవుతున్నారు. న్యాయ సలహాదారులను సంప్రదించడం ద్వారా జాబితాలను సిద్ధం చేసుకున్నారు. తమ పరిధిలోని వచ్చే ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సిటీ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్ బాబు 'సాక్షి'కి తెలిపారు. సాధారణ సమయంలో అమలులో ఉండే వాహనం రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు తప్పనిసరి నిబంధనలు ఇప్పుడూ వర్తిస్తాయని తెలిపారు.

అనుమతి లేని అలంకరణలపై చర్యలు...

ప్రస్తుతం ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ ఇంకా నోటిఫికేషన్ జారీ కాలేదు. అది జారీ అయిన తర్వాతే నామినేషన్లు వేయడం, ముమ్మర ప్రచారం తదితర హడావుడి ఊపందుకుంటుంది. ఎన్నికల సమయంలో ఆయా పార్టీలు, అభ్యర్థులు ప్రచారంలో భాగంగా అనేక వాహనాలను విని యోగిస్తుంటారు. వీటిలో కొన్ని ఆయా పరిధుల్లో సంచరిస్తూ మైకుల ద్వారా ప్రచారం చేస్తుంటాయి. మరికొన్నింటిని అభ్యర్థులు రోడ్ షోలు నిర్వహించడానికి, కేడర్ సంచరించడానికి ఉపయోగిస్తారు. దీనికోసం ఆయా వాహనాలకు అనేక మార్పుచేర్పులు చేస్తుంటారు. అభ్యర్థి, నేతల ఫొటోలు, పార్టీ సింబల్స్ తదితరాలను వీటిపై ఏర్పాటు చేస్తారు. ఇలా వాహనంలో ఏ మార్పు చేయాలన్నా ఆర్టీఏ అధికారుల అనుమతి తప్పనిసరి. ఆ అనుమతి పత్రాన్ని సైతం వాహనం ముందు భాగంలో విండ్ షీల్డ్‌కు ఎడమ వైపున అతికించాలి. ఇలా అనుమతి లేకుండా మార్పుచేర్పులు చేస్తే మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం ఆ వాహనాన్ని తాత్కాలికంగా జప్తు చేసే అధికారం ట్రాఫిక్ పోలీసులకు ఉంది.



క్షేత్రస్థాయిలో పరిశీలించాకే నివేదికలు...

ఎన్నికల ప్రచారంలో భాగంగా రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో హడావుడి నిత్యకృత్యం. సభలు, సమావేశాలతో పాటు రోడ్ షోలు తదితరాలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహిస్తుంటారు. కొన్ని ప్రచార కార్యక్రమాలకు రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు, అత్యంత ప్రముఖులు, సినీ తారలు సైతం హాజరవుతూ ఉంటారు. అయితే ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి ముందు కచ్చితంగా రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పర్మిషన్ ఇచ్చే ముందు ఈ అధికారులు ట్రాఫిక్ పోలీసుల అభిప్రాయం తీసుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఆయా కార్యక్రమంలో జరిగే ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు. ప్రజలు, సాధారణ ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కలిగించే వాటి విషయంలో పక్కాగా ముందుకు వెళ్లనున్నారు. 'నగరంలో ట్రాఫిక్‌కు సజావుగా సాగడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. ఎన్‌ఫోర్స్‌మెంట్ కంటే రెగ్యులేషన్‌కే కీలక ప్రాధాన్యం ఇస్తాం. ఏ కార్యక్రమం నేపథ్యంలోనూ సామాన్యుడు ఇబ్బంది పడకూడదన్నదే మా లక్ష్యం' అని సిటీ ట్రాఫిక్ చీఫ్ పేర్కొన్నారు.

పరిమితికి మించి ఉన్నా పట్టేస్తారు...

బరిలో ఉన్న ప్రతి అభ్యర్థి, పార్టీ తమ ఉనికి, బలం చాటుకోవాలనే ప్రయత్నిస్తుంటారు. ఇందులో భాగంగా ర్యాలీ, సభలు, సమావేశాలు.. వీలున్నంత వరకు జన సమీకరణ చేయాలని చూస్తారు. ఈ నేపథ్యంలోనే తమ కార్యక్రమాల్లో ఎంత ఎక్కువ మంది ఉంటే అంత హడావుడి ఉంటుందని భావిస్తారు. అయితే.. వారిని తరలించడానికి, ప్రచారంలో వినియోగించడానికి అవసరమైన సంఖ్యలో వాహనాలు ఏర్పాటు చేయరు. దీంతో ఉన్న వాహనాల్లోనే వారంతా సర్దుకుని, ఇరుక్కుని ప్రయాణించాల్సి ఉంటుంది. ఇలాంటి వాహనాల పైనా ప్రత్యేక నిఘా ఉంచాలని ట్రాఫిక్ విభాగం అధికారులు నిర్ణయించారు. రహదారులపై, ఆయా ప్రాంతాల్లో పరిమితికి మించి ప్రయాణికులతో కనిపించే ఇలాంటి ఓవర్ లోడెడ్ వాహనాలపై మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 113 ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోనున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన

వైద్యవిద్యార్థి ఏడాది సస్పెన్షన్

- సత్ఫలితాలిస్తున్న కంప్లైంట్ బాక్సులు
- గతంలో వేటుపడిన విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేతకు నో
- గాంధీ యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం


సమావేశమైన గాంధీ యాంటీ ర్యాగింగ్ కమిటీ

గాంధీఆస్పత్రి : ర్యాగింగ్ చట్టాలను కఠినంగా అమలు చేస్తున్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా పలు మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ఘటనలు అడపాదడపా వెలుగుచూస్తున్నాయి. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థిని ఏడాది పాటు సస్పెండ్ చేస్తూ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, గాంధీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి నేతృత్వంలో గురువారం కమిటీ ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై తీర్మానాలు చేశారు. అనాటమీ విభాగంలో ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్స్‌లో ర్యాగింగ్‌కు సంబంధించి పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా 2020 బ్యాచ్‌కు చెందిన ఓ విద్యార్థి పలుమార్లు జూనియర్లను ర్యాగింగ్ చేసినట్లు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో సదరు విద్యార్థిని ఏడాది పాటు హాస్టల్‌తోపాటు కళాశాలను నుంచి సస్పెండ్ చేస్తూ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. గతంలో ర్యాగింగ్‌కు పాల్పడి సస్పెన్షన్‌కు గురైన విద్యార్థులు, వారి తల్లితండ్రులు యాంటి ర్యాగింగ్ కమిటీని కలిసి మరోమారు ర్యాగింగ్‌కు పాల్పడమని, సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరగా, కమిటీ వారి అభ్యర్థనను ఏకగ్రీవంగా తిరస్కరించింది. క్రిమినల్ కేసులు నమోదు చేయకుండా కేవలం సస్పెన్షన్‌తో సరిపెట్టినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్ చట్టాలను మరింత కఠినంగా అమలు చేయాలని, ఇకపై ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై పోలీస్ కేసులు నమోదు చేయాలని నిర్ణయించారు. గాంధీలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, కాలేజీకి చెడ్డపేరు తెచ్చేవారిని ఉపేక్షించరాదని తీర్మానించి, ర్యాగింగ్ నిరోధానికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో గాంధీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, సూపరింటెండెంట్ రాజారావులతోపాటు పలు విభాగాలకు చెందిన హెచ్‌ఓడీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిక్ష అనుభవించాల్సిందే : డీఎంఈ రమేష్‌రెడ్డి

అన్ని తెలిసి కావాలని చేసిన తప్పునకు శిక్ష అనుభవించాల్సిందేనని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రమేష్‌రెడ్డి హెచ్చరించారు. గాంధీ యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడిన 2020 బ్యాచ్ విద్యార్థికి ఏడాది పాటు సస్పెండ్ చేసినట్లు వివరించారు. గాంధీలో గతంలో ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేసేందుకు కమిటీ విముఖత వ్యక్తం చేసిందన్నారు. ఎంతో ప్రతిభగలవారికే గాంధీ మెడికల్ కాలేజీలో ప్రవేశం లభిస్తుందని, పవిత్ర వైద్య వృత్తిని ఎంచుకుని తోటివారిపై ర్యాగింగ్‌కు పాల్పడడం అత్యంత హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలలో యాంటీ ర్యాగింగ్ చట్టాలను మరింత కఠినంగా అమలు చేస్తామని, ర్యాగింగ్ ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి త్వరలోనే అమలు చేస్తామని డీఎంఈ స్పష్టం చేశారు.

నట్లు బిగించి..వెల్డింగ్ చేసి..

ఐరన్ పిల్లర్లలో గంజాయి అక్రమ రవాణా

- గంజాయి తరలింపులో నిందితుల కొత్త ఎత్తుగడ
- ఒడిశా నుంచి పాత బస్తీకి సరఫరా
- రూ.1.11 కోట్ల విలువ చేసే 430 కిలోల సరుకు స్వాధీనం
- ముగ్గురి అరెస్టు ; పరారీలో మరో ముగ్గురు


స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న సీపీ చౌహాన్


పోలీసుల అదుపులో నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: ఐరన్ పిల్లర్లలో గంజాయిని నింపి, బయటికి కనిపించకుండా నట్లు, బోల్ట్‌లతో బిగించి, ఆపైన వెల్డింగ్ చేసి ఒడిశా నుంచి పాత బస్తీకి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. రూ.1.11 కోట్ల విలువ చేసే 430 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

◆ కర్ణాటకలోని బీదర్‌కు చెందిన బాహుల్య లీలావతి అలియాస్ గంగరాజు అలియాస్ భీమ్ రావు, గోపాల్ అలియాస్ ముల్‌చంద్ యాదవ్, సంతోష్, మోహన్ రాథోడ్‌లకు ఒడిశా రాష్ట్రంలోని గంజాయి పెడ్లర్లతో సత్సంబంధాలు ఉన్నాయి. విలాసవంతమైన జీవనానికి అలవాటు పడిన వీరంతా సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలించి, కస్టమర్లకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావించారు.

◆ పథకం ప్రకారం నలుగురు కలిసి ఒడిశా వెళ్లి గంజాయి సరఫరాదారుల నుంచి 430 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేసి, ఎనిమిది ఇనుప పిల్లర్లలో నింపారు. ఈ సరుకును ఒడిశా నుంచి పాత బస్తీకి తరలించేందుకు నాచారంలోని మల్లాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ పెద్ద బాబు రావును సంప్రదించారు. బాబురావు తన స్నేహితుడు సికింద్రాబాద్‌కు చెందిన మద్దెల రమేష్‌తో కలిసి అశోక్ లేల్యాండ్ దోస్త్ వాహనంతో ఒడిశాకు వెళ్లాడు. సరుకు తీసుకుని మోహన్ రాథోడ్‌తో కలిసి ఆటోలో బయలుదేరారు. ఈ వాహనానికి ముందు పైలెట్ వెహికిల్‌లో లీలావతి, గోపాల్, సంతోష్ బయలుదేరారు.

◆ గురువారం తెల్లవారుజామున హైదరాబాద్ శివార్లలో తనిఖీలు నిర్వహిస్తున్న మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), కీసర పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయడంతో గంజాయి గుట్టురట్టయ్యింది. దీనిని గమనించిన పైలెట్ వాహనంలో ఉన్న లీలావతి, గోపాల్, సంతోష్‌లు అక్కడి నుంచి పరారయ్యారు. నిందితుల నుంచి రూ.2,170 నగదుతో పాటు గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, ఇనుప పిల్లర్లు, అశోక్ లేల్యాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

200 కిలోల గంజాయి పట్టివేత

– ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులు అరెస్టు

గంజాయిని తరలిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.60.10 లక్షలు విలువ చేసే 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పొరుగు రాష్ట్రానికి చెందిన అక్కాబత్తుల లక్ష్మయ్య కుమార్, గంటా శ్రీనుబాబులకు అదే ప్రాంతానికి చెందిన నూకరాజుతో పరిచయం ఏర్పడింది. తన వద్ద ట్యాంకర్ లారీ ఉందని, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని పుణే, ఢిల్లీలకు తరలించి డబ్బు సంపాదించవచ్చని వీరికి ఆశ చూపాడు. ఒక్క ట్రిప్‌కు రూ.10 వేలు కమీషన్ ఇస్తానని చెప్పడంతో లక్ష్మయ్య, శ్రీనుబాబు అందుకు అంగీకరించారు. గతంలో మూడు పర్యాయాలు ఏజెన్సీ నుంచి గంజాయిని అక్రమంగా పుణేకు తరలించి, సొమ్ము చేసుకున్నారు.

◆ ఈ క్రమంలో ఈనెల 18న లక్ష్మయ్య, శ్రీనుబాబులకు నూకరాజు ఫోన్ చేసి తాను చెప్పిన ప్రాంతానికి రావాలన్నాడు. దీంతో అక్కడికి వెళ్లిన ఇరువురికి 200 కిలోల గంజాయి లోడ్ చేసిన లారీని అప్పగించి సరుకును ఢిల్లీకి చేర్చాలని సూచించాడు. గురువారం ఉదయం లారీతో అక్కడి నుంచి ఖమ్మం, సూర్యాపేట మీదుగా ఢిల్లీకి బయలుదేరారు. పెద్ద అంబర్‌పేట ఔటర్ వద్దకు చేరుకోగానే విశ్వసనీయ సమాచారంతో హయత్‌నగర్ పోలీసులు లారీని తనిఖీ చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మయ్య, శ్రీనుబాబులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి రూ.10వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

చింతల రామచంద్రా రెడ్డిపై కేసు నమోదు

పంజగుట్ట: ఎన్నికల ప్రచారానికి పోలీసుల అనుమతి తీసుకోలేదని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు చింతల రామచంద్రా రెడ్డిపై పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెలితే .. బుధవారం ఉదయం ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి బూత్ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో అనుచరులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందుకు ముందస్తు అనుమతి తీసుకోకపోవడంతో పోలీసులు ఆయనపై పిట్టీ కేసు నమోదు చేశారు.

నిమ్స్‌లో డెంటల్ క్లినిక్..

స్పెషాలిటీ బ్లాక్ రూమ్ నెం.11 నుంచి సేవలు


డెంటల్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు

లక్డీకాపూల్ : నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్)ను పేద ప్రజలకు మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య విభాగాలను విస్తరిస్తున్నామని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. గురువారం ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డెంటల్ సర్వీసెస్ సేవలను ప్రారంభించారు. స్పెషాలిటీ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని రూమ్ నెం.11 నుంచి దంత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంటల్ క్లినిక్ సేవలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డా.ఎన్.లక్ష్మీ భాస్కర్, డా.కేవీ.కృష్ణారెడ్డి, అసోసియేట్ డీన్ డా.సాయి సతీష్, డాక్టర్ సాయి బాబా, ఏపిఆర్ఓ ఆషారాణి, దంత వైద్యనిపుణులు మహమ్మద్ క్వాజా మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి బలి

హిమాయత్‌నగర్: విద్యుత్ షాక్ తగిలి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ నరేష్‌కుమార్ సమాచారం మేరకు... యూపీ రాష్ట్రానికి చెందిన సూర్యప్రతాప్ సింగ్ (19) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలన వచ్చి బోరబండలోని రాజీవ్ గాంధీనగర్‌లో ఉంటూ పెయింటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. హిమాయత్‌నగర్‌లోని ఆల్ సమద్ కాంప్లెక్స్ సూపర్‌వైజర్ రఘునాథ్ పెయింటింగ్ పని నిమిత్తం సూర్య ప్రతాప్ సింగ్‌ను పిలిపించాడు. భవనానికి పెయింటింగ్ వేస్తున్న క్రమంలో కాంప్లెక్స్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్యూమినియం నిచ్చెన తగలడంతో దానిపై ఉన్న సూర్య ప్రతాపసింగ్ విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. స్థానికులు అతడిని హైదర్‌గూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

వైభవంగా ఆనందో మేళా వేడుకలు..

సాక్షి, సిటీబ్యూరో: బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారా హిల్స్‌లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో దుర్గా పూజా మహోత్సవాల్లో భాగంగా ఆనందో మేళా వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ శుక్రవారం అధికారికంగా ప్రారంభించనున్నారు. 24 వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారికి పుష్పాంజలి నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి భోగ్ సమర్పిస్తారు. సాయంత్రం కోల్‌కతా, ముంబై నుంచి వచ్చిన కళాకారులు, గాయకులు వేదికపై ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకే మిత్ర మాట్లాడుతూ.., బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఈ సంవత్సరం స్వర్ణోత్సవాన్ని జరుపుకుంటుందన్నారు. ఉత్సవాలకు సంప్రదాయ, ప్రామాణికమైన బెంగాలీ రుచిని తీసుకురావడానికి, అసోసియేషన్ కోల్‌కతా నుంచి నిపుణులైన కళాకారులను ఆహ్వానించామని తెలిపారు. ఈ తరహా వేడుకలను రాష్ట్రంలో మొదటిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. దశమి వేడుకల చివరి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో దాండియాలో పాల్గొంటారని, సాయంత్రం తొలుత అర్ధంకి నిమజ్జనం, అనంతరం దుర్గామాత విగ్రహాన్ని బంజారా ఫంక్షన్ హాల్ నుంచి హుస్సేన్ సాగర్ చెరువు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

రీచెక్ చేసుకోండి



సాక్షి,సిటీబ్యూరో: ఓటరు ఐడీ కార్డు ఉన్నంత మాత్రాన ఓటుందని భావించవద్దని, తుది ఓటరు జాబితాలో పేరుందో లేదో రీ చెక్ చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. గురువారం హైకోర్టు లో స్వీప్ యాక్టివిటీ కింద ఏర్పాటు చేసిన రీ–చెక్ యువర్ ఓట్ కౌంటర్ ను డిప్యూటీ ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జీలు, న్యాయవాదులు, సిబ్బంది తో మాట్లాడి ఓటరు జాబితాలో తమ పేరును ఎలా చెక్ చేసుకోవాలో అవగాహన కల్పించారు. voter.eci.gov.in లేదా voter helpline app ద్వారా ఓటరు జాబితాలో పేరును చెక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1950ను సంప్రదించాలని ఎన్నికల అధికారి తెలిపారు.

'హస్తం' నేతల్లో ఉత్కంఠ

- రెండ్రోజుల్లో తుది జాబితా
- కొందరు ఢిల్లీలో మకాం
- మరికొందరు లాబీయింగ్

గెలుపు గుర్రాలు

సిటీబ్యూరో: నగర కాంగ్రెస్ రెండో జాబితాపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే తొలి జాబితాను ప్రకటించిన ఆ పార్టీ.. మరో రెండు రోజుల్లో తుది జాబితా విడుదలకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ దూకుడు పెంచింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా వ్యూహాత్మంగా ముందుకు సాగుతోంది. నగరంలోని పాతబస్తీ మినహా అన్ని అసెంబ్లీ స్థానాల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు సిద్ధమైంది. ఇక్కడ మరో 10 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండటంతో ఆశావహులు ఢిల్లీకి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కొందరు ఏకంగా దేశ రాజధానిలో మకాం వేసి అగ్రనేతల ద్వారా లాబీయింగ్ చేస్తున్నారు.

అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ కోర్ సిటీతో పాటు శివార్ల అసెంబ్లీ సెగ్మెంట్లలో గెలుపు గుర్రాలను ఎన్నికల బరిలో దింపేందుకు సిద్ధమైంది. అభ్యర్థుల బలాబలాలపై సర్వే చేయిస్తూ అంచనా వేస్తోంది. ఇతర పార్టీల అసమ్మతివాదులను సైతం తమ వైపు తిప్పుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పలు సెగ్మెంట్లలో ఇతర పార్టీలకు చెందిన అసమ్మతి నేతలకు గాలం వేసింది. ముఖ్యంగా ఎల్‌బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ తదితర సెగ్మెంట్లలో తీవ్ర పోటీ నెలకొంది. దీంతో అధిష్టానం అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. అయితే.. ఇతర పార్టీల నుంచి వలసలు పెరగడంతో రాజకీయ సమీకరణలు కూడా మారుతున్నాయి.

పేలిన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ

గృహోపకరణాలు దగ్ధం


కాలిపోయిన గృహోపకరణాలు

మలక్‌పేట: చార్జింగ్ పెట్టిన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంఘటన గురువారం తెల్లవారుజామున మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూసారంబాగ్ డివిజన్ ఇందిరనగర్‌లో మహేష్ అనే వ్యక్తి ఓ ఇంట్లో కిందిపోర్షన్‌లో భార్య, కుమార్తెతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. రాత్రి తన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ చార్జింగ్‌కు పెట్టి నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారు జామున బ్యాటరీ పేలి మంటలు వ్యాపించడాన్ని గుర్తించిన వారు ఇంట్లో నుంచి బయటికి వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. ఇంటి యాజమాని మలక్‌పేట ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, బీరువా, సర్టిఫికెట్స్, సరుకులు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు.

యువతిపై లైంగికదాడి

- బయటికి చెప్పవద్దంటూ బెదిరింపులు
- జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ మాజీ చైర్మన్ మురళీ ముకుంద్, అతని కుమారుడిపై కేసులు నమోదు

బంజారాహిల్స్: ఇంట్లో పని చేసే యువతిని బెదిరించి లైంగిక దాడి చేసిన ఓ ప్రైవేట్ స్కూల్ మాజీ చైర్మన్ అతని కుమారుపై బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..నగరానికి చెందిన యువతి (22) ఇంటి పని చేసేందుకు ఏ గ్రేట్ ఏజెన్సీలో పేరు నమోదు చేసుకుంది. సదరు ఏజెన్సీ జూన్ 18న ఆమెను బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 మిథులానగర్‌లో నివాసముండే జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ మాజీ చైర్మన్ మురళీముకుంద్, అతని కుమారుడు ఆకాష్ ఇంట్లో పనికి నియమించింది. ఆ తర్వాత కొన్నాళ్లకే తండ్రీ కొడుకులు ఆమెను వేధించడం మొదలు పెట్టారు. జూలై 16న మధ్యాహ్నం మురళీముకుంద్ సదరు యువతికి తన బెడ్రూంలో బెడ్‌షీట్ మడత పెట్టాలని చెప్పి లోపలికి పంపించాడు. అనంతరం అతను కూడా లోపలికి వెళ్లి తలుపు గడియ పెట్టి స్నానంచేసి రావాలని ఆమెను బలవంతం చేశాడు. ఆమె వినకపోవడంతో బెదిరింపులకు పాల్పడటంతో అతను చెప్పినట్లు చేసింది. బాత్ రూం నుంచి బయటకు వచ్చిన తర్వాత స్నానం చేస్తుండగా ఫొటోలు, వీడియో తీశానని బెదిరించి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే యువతితో పాటు ఆమె తల్లిని చంపేస్తానని బెదిరించాడు. రెండు రోజుల తర్వాత బాధితురాలు ఈ విషయాన్ని ఆకాష్‌కు చెప్పగా అతను కూడా ఆమెను తీవ్రంగా కొట్టి బెదిరించాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు దాడి చేయడంతో బాధితురాలు నెల రోజుల క్రితం పోలీసులను ఆశ్రయించగా రాజీ కుదిర్చి పంపించారు. అయితే ఆ సమయంలో లైంగిక దాడి విషయం చెప్పని యువతి ఇటీవల జరిగిన దారుణాన్ని తన తల్లికి చెప్పింది. ఆమె సహాయంతో ఈ నెల 18న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలిని భరోసా కేంద్రానికి తరలించిన పోలీసులు నిందితులు మురళీ ముకుంద్, అతని కుమారుడు ఆకాష్‌లపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జంట హత్యల కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు


ప్రధాన నిందితుడు మట్టా రెడ్డి

రంగారెడ్డి కోర్టులు: ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో 2022లో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో ముగ్గురు నిందితులకు యావజ్జీవ శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 3వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి జి. భవానీ చంద్ర గురువారం తీర్పు చెప్పారు.

ఏపీపీ డి.రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని చర్లపటేల్‌గూడ గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న శ్రీనివాస్ రెడ్డి, అతడి స్నేహితుడు రాఘవేందర్ రెడ్డిలను భూ వివాదాల కారణంగా ప్రధాన నిందితులు మేరెడ్డి మట్టా రెడ్డి, మహమ్మద్ ఖాజా మోయినుద్దీన్, బుర్రి భిక్షపతితో కలిసి హత్య చేశాడు. మృతుడు శ్రీనివాస్ రెడ్డి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితులను రిమాండ్‌లోనే ఉంచి కేసు విచారణ చేపట్టిన న్యాయస్థానం ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు లేకపోయినా సాంకేతిక ఆధారాలను పరిగణలోకి తీసుకుని తీర్పు వెలువరించింది. ఘటనా స్థలంలో దొరికిన బుల్లెట్లను సేకరించిన ఫోరెన్సిక్ నిపుణులు ఇచ్చిన నివేదిక ఆధారంగా విచారణ చేపట్టిన న్యాయస్థానం గురువారం ప్రధాన నిందితుడైన మేరెడ్డి మట్టా రెడ్డికి జీవిత ఖైదు, రూ.1,100 జరిమానా, మిగతా ఇద్దరు నిందితులైన మహమ్మద్ ఖాజా మోయినుద్దిన్, బుర్రి భిక్షపతిలకు జీవిత ఖైదు, రూ. 800 జరిమానా విధిస్తూ తుది తీర్పు వెలువరించింది.

క్లుప్తంగా...

బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఖైరతాబాద్: ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో ఈ నెల 22న పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించే నిమిత్తం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సంవత్సరం కూడా పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అనుమతివ్వాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోరారు. బీఆర్ఎస్ నేతలు మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్, కమ్మరి వినయ్, దీపు, మల్లారెడ్డి, గంగాదర్ యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం జగన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి

లిబర్టీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీ జనగణన చేయాలని నిర్ణయించడానికి బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి స్వాగతించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరహాలో తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జనగణన చేయాలని కోరారు. గురువారం ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నవంబర్ 15వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కులగణన చేయాలని నిర్ణయించదన్నారు. బీసీ గణన చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. నేతలు నవ్య, సుభాష్, చరణ్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీలోని అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి మహా అన్న దాన కార్యక్రమం జరిగింది. బోరబండ సెక్టార్ ఎస్ఐ మరోజ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, బస్తీ అధ్యక్షుడు వేముల యాదయ్య, వెంకటేశ్ భరత్ సిద్ధాంతి, వడ్డెర సంఘం నాయకులు ముద్దంగులు శేఖర్, గొలుసుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా లక్ష్మి

రహమత్‌నగర్: బీజేపీ హైదరాబాద్ జిల్లా సెంట్రల్ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌కు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకురాలు బండ లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతం రావు గురువారం ఆమెకు అందజేశారు. సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు కళావతి, జూబ్లీహిల్స్ కన్వీనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఫెర్నాండజ్ హాస్పిటల్‌తో హెర్బి ఏంజిల్ భాగస్వామ్యం

బంజారాహిల్స్: శిశువులు, చిన్నారుల కోసం దేశంలో మొట్ట మొదటి సర్టిఫైడ్ ఆర్గానిక్ పర్సనల్ కేర్, న్యూట్రిషియన్ బ్రాండ్ హెర్బి ఏంజిల్ బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఫెర్నాండజ్ హాస్పిటల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని చేసుకున్నట్లు వెల్లడించింది. గురువారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెర్బి ఏంజిల్ సీఎక్స్‌వో షెర్రి జైరత్ మాట్లాడుతూ... మెటర్నిటి కేర్‌లో పేరున్న ఫెర్నాండజ్ హాస్పిటల్‌లో కలిసి పని చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

వెంగళరావునగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యువకులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి ప్రాంతానికి చెందిన రమేష్ నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. భరత్‌నాగ పవన్, హేమంత్ సత్య గణేష్‌లు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరంతా ఎల్లారెడ్డిగూడలో ఉంటూ అక్రమంగా డబ్బును సంపాదించాలని మద్యం విక్రయిస్తున్నారు. పోలీసులు ఎల్లారెడ్డిగూడలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ ముగ్గురు అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం: మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: శాసనసభ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోనూ బీఆర్ఎస్ పార్టీ జెండా మరోసారి ఎగురవేయడం ఖాయమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ ధీమా వ్యక్తం చేశారు. ఎస్పీ ఆర్‌హిల్స్‌లోని రాజీవ్ గాంధీనగర్, శివగంగానగర్ బస్తీల్లో గురువారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులే తనను తప్పకుండా గెలిపిస్తాయన్నారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, నాయకులు నజీర్, ఫయాజ్, సయ్యద్ బషీర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘సీ-విజిల్’తో ఎన్నికల అక్రమాలకు చెక్!

ఎన్నికల్లో అక్రమాల నియంత్రణకు సీ–విజిల్ యాప్‌ను కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలిసారిగా 2014లో ఈ యాప్‌ను అందుబాటులోకి తేగా ప్రస్తుతం దీన్ని ఆధునికీకరించి ఈ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనుసంధానం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన దృశ్యాలను ఈ యాప్‌లో అనుసంధానించిన వంద నిమిషాల వ్యవధిలో అధికారులు అక్కడికి చేరుకుంటారు. సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారుల నివేదికల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదుదారు వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు ఏం చర్యలు తీసుకోవాలన్నదానిపై మొబైల్ ఫోన్‌కు సందేశాలను అందిస్తున్నారు.


సీ-విజిల్ యాప్‌పై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి సూచనలిస్తున్న ఖైరతాబాద్ ఎన్నికల అధికారులు

- ప్రజల చేతుల్లో వజ్రాయుధం సీ-విజిల్ యాప్
- ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో పరిష్కారం
- ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యం
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో యాప్‌పై ప్రచారం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు సీ-విజిల్ ద్వారా నాలుగు ఫిర్యాదులు అందగా అందులో రెండు ఫిర్యాదులు అర గంట వ్యవధిలోనే పరిష్కరించారు. గోడ రాతలు, ఫ్లెక్సీలు, బ్యానర్లతో పాటు అనుమతులు లేకుండా ప్రదర్శనలు, ఊరేగింపులు, ప్రచారాలు నిర్వహించడంతో పాటు డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేస్తే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

- ఓటర్లకు సీ విజిల్ ఓ వరంలా మారనుందని ఇప్పటికే అధికారులు అవగాహన కార్యక్రమాల్లో వెల్లడిస్తున్నారు. డబ్బు, కానుకలు, మద్యం పంపిణీ కట్టడికి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ స్టాటస్టిక్ సర్వైలెన్స్ టీమ్‌లు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో రేయింబవళ్ళు పని చేస్తున్నాయి. అక్రమాలపై నిఘా పెట్టడమే కాకుండా వీడియో రికార్డింగ్ కూడా చేస్తున్నారు.
- ఈ యాప్ ద్వారా ప్రజలు కోడ్ ఉల్లంఘనలపై కూడా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. నేరుగా వచ్చి కూడా ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రేకు, షేక్‌పేట మండల కార్యాలయంలో జూబ్లీహిల్స్ రిటర్నింగ్ అధికారి రవికి ఫిర్యాదులు అందజేయవచ్చు. ఎక్కడెక్కడ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారో వాటి వివరాలను ఈ యాప్ ద్వారా నమోదుచేయవచ్చు.
- ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు పౌరులను భాగస్వాములను చేసే దిశలో ఈ యాప్‌ను ప్రవేశ పెట్టడం జరిగింది. పౌరులు ఎవరైనా సరే ఎన్నికల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కేవలం ఒక ఫొటో కానీ, చిన్న వీడియో కానీ తీసి అప్‌లోడ్ చేస్తే చాలు తక్షణమే అధికారులు చర్యలు తీసుకుంటారు. ఈ యాప్‌పై కొంత కాలంగా ఎన్నికల అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

మహిళలే ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిలింనగర్: ఇప్పటికే ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో పాటు బీఆర్ఎస్ పార్టీ తీసుకొచ్చిన మేనిఫెస్టోలోని పథకాలను మహిళలకే ఎక్కువగా ప్రచారం చేసి కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పిలుపునిచ్చారు. గురువారం ఖైరతాబాద్ డివిజన్‌లోని రామకృష్ణానగర్ బస్తీ మహిళలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే దానంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ... బస్తీకి తాను మొదటి నుంచి అండగా ఉన్నానని బస్తీలోని ప్రతి గుడిసెకు గృహలక్ష్మి పథకం అందించే బాధ్యత తనదేనని అన్నారు. పార్టీ మేనిఫెస్టోలో చెప్పినట్లు ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాగానే రూ. 400లకు గ్యాస్ సిలిండర్‌తోపాటు ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం మహిళలకు ఎంతగానో తోడ్పాటునందిస్తుందని అన్నారు. మహిళలకు ఇన్ని విధాలుగా గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి సంక్షేమ పథకాల గురించి ఆలోచించలేదని అన్నారు.


రామకృష్ణానగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివ మాదిగ

వెంకటేశ్వరకాలనీ: మాదిగలను ఐక్యం చేసేందుకు ఈ నెల 25న ఖైరతాబాద్‌లో నిర్వహించబోయే ఆత్మీయ సమ్మేళనంలో మాదిగ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఎమ్మార్పీస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివమాదిగ కోరారు. గురువారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని డబుల్ బెడ్‌రూమ్ నివాసాలతో పాటు దళిత బంధు పథకంలో ఎక్కువ శాతం మాలలకే కేటాయించారని ఇప్పటి వరకు ఖైరతాబాద్‌లో అందించిన దళిత బంధులో మాదిగలకు ఎన్ని మాలలకు ఎన్ని ఇచ్చారో అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధమైన ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతున్న తమకు అడుగడుగునా అన్యాయమే జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25వ తేదీన నిర్వహించబోయే మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగతో పాటు టీఎంహెచ్‌డీ ఫౌండర్ జన్ను కనకరాజు మాదిగ పాల్గొంటున్నారని తెలిపారు. నేతలు అశ్విన్, సురేష్, మహేష్, కళ్యాణి, సౌందర్య, లలిత, సుకన్య, సుజాత పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై అవగాహన

ఖైరతాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నిక ఆరు గ్యారంటీలపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి ఖైరతాబాద్ డివిజన్‌లోని ఓల్డ్‌సీఐబీ క్వార్టర్స్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు సాధ్యం కావని చెప్పిన బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన తన ఎన్నికల మేనిఫెస్టో ఎలా సాధ్యమవుతుందో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నోరు తెరిస్తే అన్ని అబద్ధాలే బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. పేదలందరికీ కాంగ్రెస్ పార్టీలోనే న్యాయం జరిగిందని గుర్తుచేశారు.


ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో అవగాహన కల్పిస్తున్న విజయారెడ్డి

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి: చింతల


ఉదయ్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్: బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఉదయ్‌నగర్ బస్తీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని గురువారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. 2014–18 సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి తప్పితే ప్రస్తుత ఎమ్మెల్యే ఒరగబెట్టిందేమీ లేదని ఆయన దుయ్యబట్టారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మభ్యపెడుతూ మోసం చేస్తూ ప్రజలకు ఏమీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు బీజేపీతోనే తెలంగాణ రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.

29న జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలు

బంజారాహిల్స్: తెలుగు సినీ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలు ఈ నెల 29న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన నోటీసును తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ నెల 11న జారీ చేసింది. ఇందులో భాగంగా గురువారం జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్ష పదవికి స్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి పదవికి వల్లభనేని అనిల్‌కుమార్, కోశాధికారి పదవికి శేషగిరిరావు చిక్కడపల్లిలోని కార్మిక శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్యాం సుందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. 2023–25 సంవత్సరాలకుగాను నూతన కార్యవర్గం ఎన్నిక కానుంది. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 19న నామినేషన్ల స్వీకరణతో పాటు నామినేషన్ల తనిఖీ చేపట్టి తుది జాబితాను కూడా వెల్లడించారు. ఈ నెల 21న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు గుర్తుల కేటాయింపు కూడా చేపట్టనున్నారు. అర్హత గల ఓటర్ల జాబితాను ఫెడరేషన్‌కు అందజేశారు. మొత్తం 4400 మంది జూనియర్ ఆర్టిస్టులు ఈ ఎన్నికల్లో ఓట్లు వేయనున్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న వల్లభనేని అనిల్‌కుమార్

సూర్యప్రభ వాహనంలో శ్రీవారు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం ఉదయం సూర్యప్రభ వాహనంలో, సాయంత్రం చంద్రప్రభ వాహనంలో తిరువీధుల్లో ఊరేగారు. స్వామివారి ఊరేగింపులో భక్తులు భారీగా పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ సి.హెచ్.రామయ్య, ఈవో ఎన్. లావణ్యతో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, సేవాకాలం, భగవాదారాధన, వైభవంగా నిర్వహించారు.

పోలీసుల తనిఖీలు: రూ. 11.25 లక్షల స్వాధీనం

హిమాయత్‌నగర్: పోలీసుల తనిఖీల్లో భారీ ఎత్తున డబ్బు పట్టుబడింది. బుధవారం నారాయణగూడ శ్మశానవాటిక ఎక్స్ రోడ్డు వద్ద నారాయణ గూడ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో టీఎస్ 09 ఎఫ్.సీ 4892 నెంబర్ గల వైట్ కలర్ యాక్టివా స్కూటీపై వెళ్తున్న ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆ వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న బ్యాగులో రూ. 500 నోట్ల కట్టలు కనిపించాయి. అవి మొత్తం రూ. 11 లక్షల 25 వేలు ఉన్నాయి. పొంతన లేని లెక్కలు చెప్పడంతో ఆ డబ్బును పోలీసులు సీజ్ చేశారు. అతడు అమీర్‌పేట్ ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి రాజేష్ కుమార్(52)గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షఫీ తెలిపారు.

బతుకమ్మ వేడుకల్లో సీరియల్ నటి విష్ణుప్రియ


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సీరియల్ నటి విష్ణుప్రియ, కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్: బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ప్రముఖ సీరియల్ నటి విష్ణుప్రియ అన్నారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విష్ణుప్రియ మాట్లాడుతూ... ప్రతి మహిళకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. తొలుత బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ దేదీప్య విజయ్ తదితరులు మహిళలతో కలిసి బతుకమ్మలను నెత్తిన పెట్టుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అసోసియేషన్ మహిళావింగ్ నేతలు సుగుణ, పద్మావతి, నిర్మల, సుష్మ, చంద్రావతి, హరిత, సుధ, లలిత, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, కళ్యాణ చక్రవర్తి, కోశాధికారి ఉప్పలయ్య, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

బంజారాహిల్స్: అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు ఎక్కడికక్కడ ఎన్నికల బృందాలు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశాయి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వాహనాల తనిఖీలు చేపట్టి క్షుణ్ణంగా పరిశీలించాయి. ఇటీవల కాలంలో నగదు రవాణా జరుగుతున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ఒక వైపు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మరో వైపు ఆకస్మికంగా తనిఖీలుచేపడుతున్నారు. తాజాగా ఫిలింనగర్ పోలీసులు ఓ వాహనదారుడి నుంచి రూ. 3.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.


ఫిలింనగర్‌లో తనిఖీలు చేస్తున్న దృశ్యం

కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదు: దానం

హిమాయత్‌నగర్: ఆరు గ్యారంటీలు అంటున్న కాంగ్రెస్ పార్టీకే రాష్ట్రంలో గ్యారంటీ లేదని ఎమ్మెల్యే దానం నాంగేందర్ ఎద్దేవా చేశారు. అభివద్ధి కావాలంటే సీఎం కేసీఆర్ రావాలని, కేసీఆర్ సీఎం కావాలంటే నాలాంటి ఎమ్మెల్యేలు తెలంగాణలో గెలవాలని దానం అన్నారు. హిమాయత్‌నగర్ ఎంఏ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో హిమాయత్ నగర్ డివిజన్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... ఖైరతాబాద్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల అప్లికేషన్లు 5000 వస్తే అందులో 3600 మంది లబ్ధిదారులకు ఇప్పటికే ఇచ్చామని, మిగిలిన 1400 మందికి మార్చి తర్వాత ఇస్తామన్నారు. బీఆర్ఎస్ హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు యాదగిరి, నేతలు యతిరాజ్, రమేష్ యాదవ్, అశోక్, ప్రభాకర్, సర్వరాజ్, రాజేందర్ కుమార్, మాధురి, కళ తధితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

వెంగళరావునగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో యువత చేరుతోందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. మధురానగర్‌కాలనీకి చెందిన మినుకూరి శ్రీకాంత్‌రెడ్డి గురువారం రాత్రి తన అనుచరులతో కలిసి పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన శ్రీకాంత్‌రెడ్డికి ఎమ్మెల్యే తమ పార్టీ కండువాలను కప్పి స్వాగతం పలికారు. కార్పొరేటర్ దేదీప్య విజయ్, సీనియర్ నాయకులు చిన్న రమేష్, అంబటి రామకృష్ణ, దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, సాయి, రఘు, కాలనీ నేతలు కోడె సాంబశివరావు, శివరామకృష్ణ, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగినికి వాచ్‌మెన్ లైంగిక వేధింపులు

వెంగళరావునగర్: సాఫ్ట్‌వేర్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న మహిళను వాచ్‌మెన్ లైంగిక వేధింపులకు గురి చేస్తున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఓ మహిళ వెంగళరావునగర్ డివిజన్ వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఉన్న సిరి టెక్నాలజీలో హెచ్‌ఆర్‌గా విధులు నిర్వహిస్తుంది. గత నెల 20న మేనేజర్ రమేష్ తమ కార్యాలయ అధికారిక పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. ఈ సమయంలో వాచ్‌మెన్ కె.శ్రీనివాస్ కార్యాలయంలోకి ప్రవేశించి ఆ మహిళ ఎదురుగా కూర్చుని అసభ్యంగా ప్రవర్తించాడు. ఇలా పలుమార్లు ప్రవర్తించారు. తాజాగా నెల 5న ఆఫీసులో ఆమె గదిలో ఎవరూ లేని సమయంలో ఆమె వద్దకు వచ్చి లైంగిక దాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో మరో గదిలో విధులు నిర్వహిస్తున్న భార్గవి అనే మరో మహిళ వచ్చి అడ్డుకుంది. ఆగ్రహించిన శ్రీనివాస్ కత్తి చూపించి నాకు లొంగకపోతే నీ అంతు చూస్తానంటూ బెదిరించాడు. మరుసటి రోజున ఆఫీసుకు వెళుతుండగా శ్రీనివాస్‌తో పాటు అతని కుమారుడు నరేందర్ ఆమెను అసభ్యంగా తిడుతూ ఉన్నారు. దీనిని భరించలేక బాధితురాలు మేనేజర్ రమేష్‌కు విషయం చెప్పి అనంతరం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి అదృశ్యం

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సత్తయ్య సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ వెంకటగిరి సమీపంలోని వాటర్ ట్యాంక్ లైన్‌లో నివసించే శ్యాం నాగులు(30) తోటమాలిగా పని చేస్తుంటాడు. ఈ నెల 11న ఆయన భార్య ముత్యాల లక్ష్మి తన అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయింది. స్వల్ప గొడవతో ఆమె వెళ్లిపోగా ఒంటరిగా ఉన్న శ్యాం ఈ నెల 15వ తేదీన తెల్లవారుజామున ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఆమె ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఇంటికి వచ్చి చూడగా ఇల్లంతా ఖాళీగా ఉంది. అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకపోవడంతో తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 61278లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.


శ్యాం నాగులు

లలితాదేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి

బంజారాహిల్స్: శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లి శ్రీ లలితా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకంతో నవరాత్రోత్సవ పూజలు ప్రారంభం అయ్యాయి. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారు శ్రీ లలితా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జూబ్లీహిల్స్ శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో కొలువుదీరిన శ్రీ పర్వత వర్ధనీ దేవి అమ్మవారు మీనాక్షి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీ కనకదుర్గా దేవి అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి నిత్యపూజా సహిత చండీ హోమాలు నిర్వహించారు. శ్రీ లలితా సహస్ర నామ విధాన సామూహిక కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి.


లలితా దేవి అలంకారంలో జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి


లలితాదేవిగా ఫిలింనగర్ దైవసన్నిధానం అమ్మవారు


లలితా త్రిపుర సుందరీ దేవిగా మాగంటి కాలనీ కనకదుర్గాదేవి


లలితా దేవిగా ఫిలింనగర్ రాజరాజేశ్వరీదేవి


బాలాత్రిపురసుందరీగా బంజారాహిల్స్ కనకదుర్గాదేవి


శ్రీనగర్‌కాలనీ భ్రమరాంబికాదేవి


మీనాక్షి దేవిగా జూబ్లీహిల్స్ సీతారామ స్వామి ఆలయంలోని పర్వత వర్ధని దేవి

చంద్రబాబు రిమాండ్ పొడిగింపు

సాక్షి, అమరావతి/రాజమహేంద్రవరం: స్కిల్ స్కామ్‌లో కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రిమాండ్‌ను నవంబర్ 1వ తేదీ వరకూ పొడిగిస్తూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబు రిమాండ్ గడువు ముగియడంతో ఆయనను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వర్చువల్ విధానంలో విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఎదుట గురువారం ప్రవేశ పెట్టారు. రిమాండ్‌ను మరో 14 రోజులు పొడిగించాలని సీఐడీ తరఫు న్యాయవాది మెమో దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యం ఎలా ఉంది అని చంద్రబాబును న్యాయమూర్తి వాకబు చేశారు. తనకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఏం కంగారు పడొద్దని.. మెడికల్ టీమ్ ఉందని న్యాయమూర్తి అన్నారు. చంద్రబాబు వైద్య నివేదికలు ఎప్పటికప్పుడు న్యాయస్థానానికి పంపించాలని న్యాయమూర్తి ఆదేశించారు. తన భద్రతపై తనకు కొన్ని సందేహాలు ఉన్నాయని చంద్రబాబు కోర్టు దృష్టికి తీసుకురాగా.. ఏమైనా సందేహాలుంటే లిఖితపూర్వకంగా తన దృష్టికి తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు. ఆయన రాసే లేఖను తనకు పంపించాలని జైలు అధికారులను ఆదేశించారు. అనంతరం చంద్రబాబుకు మరో 14 రోజులపాటు (నవంబర్ 1 వరకూ) రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన రిమాండ్‌ను పొడిగించడం ఇది అయిదోసారి. స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబును సీఐడీ అధికారులు సెప్టెంబర్ 9వ తేదీన అరెస్ట్ చేశారు. సెప్టెంబర్ 10న కోర్టులో హాజరు పరిచారు. ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది.

సాహితీవేత్త జూపల్లి ప్రేమ్‌చంద్ కన్నుమూత



అనంతపురం కల్చరల్: దళిత, బహుజన అస్తిత్వవా దానికి సాహిత్యాన్ని ఆలంబనగా చేసుకున్న ప్రముఖ సాహితీవేత్త జూపల్లి ప్రేమ్‌చంద్ (66) గురువారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. వారం రోజు లుగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతు న్నారు. సుదీర్ఘకాలం అనంత రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తూ అనేక సాహిత్య కార్యక్రమాలను ఎంతో సమర్థవంతంగా నడిపించిన ఆయన... అనేక ప్రజాసంఘాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి వద్ద 'రుధిర జ్యోతి' కావ్యంపై ఎంఫిల్, 'సామాజిక పరిణామాలు-వచన కవిత్వం' అనే అంశంపై పీహెచ్‌డీ పట్టా పొందారు. దిగంబర కవిత్వానికి మరింత ప్రచారం కల్పిస్తూ ఆయన రాసిన 'ధిక్కార స్వరం' ప్రచురిస్తే అది తెలుగు సాహిత్యంలో సంచలనంగా మారింది. 'అవేద' పేరుతో అద్భుత కావ్యాన్నే కాకుండా నిచ్చనమెట్ల లోలకం, మౌన శంఖం సిద్ధాంత గ్రంథం ఆయన కలం నుంచి జాలువారాయి.



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

కౌరవులతో తలపడుతున్నాం

సాక్షి ప్రతినిధి కర్నూలు: 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ ప్రతీ అడుగులోనూ వారికి నేనున్నానంటూ భరోసా ఇస్తూ ప్రేమ, బాధ్యత చూపిస్తున్న ప్రభుత్వం మనది. రాబోయేది కురుక్షేత్ర యుద్ధం. పేదవాడు ఓవైపు, పెత్తందారీ మరోవైపు ఉన్నాడు. యుద్ధం జరగబోయేది కులాల మధ్య కాదు.. జరగబోయే యుద్ధం క్లాస్ వార్! కౌరవులంతా ఓవైపు ఉన్నారు. తోడేళ్లంతా ఏకం అవుతారు. ఆ గజదొంగల ముఠాల్లా మీ బిడ్డకు అరడజను టీవీ ఛానెళ్లు లేవు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, దత్తపుత్రుడి తోడూ ఉండదు. నేను నమ్ముకుంది దేవుడి దయ, మీ అందరి చల్లని దీవెనలను మాత్రమే. మీ అందరికీ ఒకటే చెబుతున్నా.. వారు చెప్పే మోసాలు, అబద్ధాలను నమ్మకండి. ఓటు వేసే ముందు ఒక్కటే ఆలోచించండి. మీ బిడ్డ వల్ల మీ ఇంటికి మంచి జరిగిందా? లేదా? అని ఆలోచించండి. మంచి జరిగిందంటే మీరే మీ బిడ్డకు సైనికుల్లా అండగా ఉండండి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో 'జగనన్న చేదోడు' నాలుగో విడత సాయాన్ని ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. 3.25 లక్షల మంది టైలర్లు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.325.02 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఆయనేమన్నారంటే..



- కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సభలో ముఖ్యమంత్రి జగన్
- రానున్నది కురుక్షేత్ర యుద్ధం.. తోడేళ్లంతా ఏకం అవుతారు
- ఇది పేదలు – పెత్తందార్ల మధ్య జరుగుతున్న క్లాస్‌వార్
- గజదొంగల ముఠా చెప్పే అబద్ధాలను నమ్మకండి
- గతంలో ఎప్పుడూ జరగని విధంగా అందరికీ మేలు చేస్తున్నాం
- చివరకు కుప్పంలో కూడా 20 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చాం

\+ నాలుగేళ్లలో అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి రూ.2.38 లక్షల కోట్లు

జీవన యానంలో తోడుగా నిలబడ్డాం..

వెనుకబడిన కులాలు, వర్గాలను వెన్నెముక కులాలుగా మారుస్తామని నా పాదయాత్ర సందర్భంగా మాటిచ్చా. ఈ 52 నెలల పాలనలో నవరత్నాలులోని ప్రతి కార్యక్రమం ద్వారా నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలను, నా నిరుపేద వర్గాలను చేయి పట్టుకుని నడిపించగలిగానని మీ బిడ్డగా సగర్వంగా తలెత్తుకుని చెబుతున్నా. వారి జీవన ప్రయాణంలో తోడుగా నిలబడ్డాం. ఈ 52 నెలల్లో ప్రతీ అడుగు మంచి కోసమే వేశాం. మొత్తంగా రూ.2.38 లక్షల కోట్లను మీ బిడ్డ బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేశాడు. ఎక్కడా లంచాలు లేవు. వివక్ష చూపలేదు.

కుప్పంలోనూ ఇళ్లు ఇచ్చింది మీ బిడ్డ ప్రభుత్వమే

చంద్రబాబు సాగించిన పాలనను చూస్తే కుప్పం ప్రజలు కూడా ఆయన్ను తమవాడు అని చెప్పుకునే పరిస్థితి లేదు. మూడు విడతలుగా 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా అక్కడ పేదవాళ్లకు ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు లేవు. మీ బిడ్డ ప్రభుత్వం అక్కడ 20 వేల ఇంటి పట్టాలను పేదలకు ఇచ్చింది. ఆ అక్కచెల్లెమ్మలకు ఇంటి పట్టాలివ్వడమే కాకుండా 8 వేల ఇళ్లను కూడా నిర్మిస్తోంది మన ప్రభుత్వమే.

ఏకంగా 2.07 లక్షల కొత్త ఉద్యోగాలు..

చంద్రబాబు హయాంలో పేదవాడు ఎలా బతుకున్నారో కనీసం ఆలోచించలేదు. ఇల్లు, ఇంటి స్థలం ఉందా? అని ఆలోచించి కనీసం ఒక్క సెంటు ఇచ్చిన పాపాన పోలేదు. మీ బిడ్డ సీఎం అయ్యాక 10, 20 లక్షలు కాదు.. ఏకంగా 31 లక్షల ఇంటి పట్టాలిచ్చాడు. ఒక్కో ఇంట్లో సగటున ముగ్గురు ఉన్నారనుకున్నా ఏకంగా కోటి మందికి మేలు చేసే కార్యక్రమం చేశాం. అందులో 22 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. వేగంగా పేదల గృహాలను నిర్మిస్తున్నాం. ఈ తేడాను గమనించాలి. చంద్రబాబు హయాంలో ఎంతమంది పేదలకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని అడుగుతున్నా. జాబు రావాలంటే బాబు రావాలి.. అంటూ ప్రకటనలిచ్చారు. జాబు ఇవ్వకపోతే ఇంటింటికీ నెలకు రూ.రెండు వేలు నిరుద్యోగభృతి ఇస్తానని ఊదరగొట్టారు. బాబు సీఎం అయినా భృతి ఇవ్వకుండా పిల్లలను కూడా మోసం చేశాడు. ఆపై మీ బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాడు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటే మీ బిడ్డ హయాంలో ఏకంగా 2.07 లక్షల కొత్త ఉద్యోగాలు ఇచ్చాడు. అందులో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే 80 శాతం ఉద్యోగాలిచ్చాం.

వరుసగా మూడో ఏడాదీ | వైఎస్సార్ అవార్డులు

ఏడు రంగాల్లో 27 అవార్డులను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి : ఎంతో ప్రతిష్టాత్మకమైన 'వైఎస్సార్ పురస్కారాల'ను రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాదీ ప్రకటించింది. వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్టులైన 27 మంది వ్యక్తులు, సంస్థలను అవార్డులతో సత్కరించనుంది. వ్యవసాయం, కళలు–సంస్కృతి, తెలుగు భాషా–సాహిత్యం, క్రీడలు, వైద్యం, మీడియా, సమాజ సేవ వంటి విభాగాల్లో 23 వైఎస్సార్ జీవిత సాఫల్య, నాలుగు వైఎస్సార్ సాఫల్య పురస్కారాలను అందించనుంది. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్స్) జీవీడీ కృష్ణమోహన్ మీడియాకు ఈ అవార్డు గ్రహీతల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత సంకల్పంతో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా సామాన్యుల్లోని అసామాన్యులను గుర్తించి 'వైఎస్సార్' అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి వచ్చిన ప్రతిపాదనలను ప్రత్యేక కమిటీ వివిధ దశల్లో క్షుణ్ణంగా పరిశీలించి ఎంతో పారదర్శకంగా అవార్డులకు ఎంపిక చేసిందన్నారు. సమాజంపై తమదైన ముద్రవేసిన వారిని సముచితంగా గౌరవించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆమోదంతో అవార్డులను ప్రకటిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 1న ఈ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. వైఎస్సార్ పురస్కార ఎంపికల కమిటీలో తనతోపాటు ప్రభుత్వ సలహాదారులు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, దేవులపల్లి అమర్ (జాతీయ మీడియా), సీఎం రాజకీయ కార్యదర్శి ముత్యాలరాజు, సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డితో పాటు వివిధ శాఖలకు చెందిన ముఖ్యకార్యదర్శులు సభ్యులుగా ఉన్నారన్నారు. ఇక వైఎస్సార్ జీవిత సాఫల్యం కింద రూ.10 లక్షలు, వైఎస్సార్ సాఫల్యం కింద రూ.5 లక్షల నగదు ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేస్తామని జీవీడీ చెప్పారు.

అవార్డు గ్రహీతల వివరాలు..

వ్యవసాయం :

- ఎస్టీ మహిళా రైతు పంగి వినీత, ఉత్తరాంధ్ర (సాఫల్య పురస్కారం)
- రైతు వైవీ మల్లారెడ్డి, అనంతపురం జిల్లా (జీవిత సాఫల్య)

తెలుగు భాష – సాహిత్యం..

- ప్రొ. బేతవోలు రామబ్రహ్మం, పశ్చిమ గోదావరి (జీవిత సాఫల్య)
- నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు (జీవిత సాఫల్య)
- అట్టాడ అప్పలనాయుడు, శ్రీకాకుళం (జీవిత సాఫల్య)
- ఖదీర్‌బాబు, గ్రామీణ మాండలికాల్లో పల్లెటూరి రచయిత, నెల్లూరు (సాఫల్య పురస్కారం)
- మహెజబీన్, నెల్లూరు (సాఫల్య పురస్కారం)

కళలు–సంస్కృతిలో జీవిత సాఫల్య పురస్కారాలు..

- యడ్ల గోపాలరావు, రంగస్థల కళాకారుడు, శ్రీకాకుళం
- తలిసెట్టి మోహన్, శ్రీకాళహస్తి కలంకారీ కళాకారుడు, తిరుపతి
- కోట సచ్చిదానంద శాస్త్రి, హరికథ, బాపట్ల
- కోన సన్యాసి, జనపదాల్లో ప్రత్యేకత ఉన్న తప్పెట గుళ్లు, శ్రీకాకుళం
- ఉప్పాడ హ్యాండ్‌లూమ్ వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ, కాకినాడ
- ఎస్వీ రామారావు, అంతర్జాతీయ చిత్రకారుడు, కృష్ణా
- రావు బాలసరస్వతి, తొలితరం నేపథ్య గాయని, నెల్లూరు
- తల్లావఝుల శివాజీ, చిత్రకారుడు, రచయిత, పాత్రికేయుడు, ప్రకాశం
- చింగిచెర్ల కృష్ణారెడ్డి, జానపద కళలు, అనంతపురం
- కలీసాహెబీ మహబూబ్–షేక్ మహబూబ్ సుబానీ దంపతులు, నాదస్వరం, ప్రకాశం

క్రీడా విభాగం..

- ▲ పుల్లెల గోపీచంద్ (బ్యాడ్మింటన్), గుంటూరు (జీవిత సాఫల్య)
- ▲ కరణం మల్లీశ్వరి (వెయిట్‌లిఫ్టింగ్), శ్రీకాకుళం, (జీవిత సాఫల్య)

వైద్య రంగం..

- ▲ మానసిక వైద్య నిపుణులుగా, స్వయంగా రచనలు చేస్తూ సమాజాన్ని జాగృతం చేసిన డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా, (జీవిత సాఫల్య)
- ▲ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వినికిడి లోపం కలిగిన చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్స్ వైద్య సహాయం అందిస్తున్న డాక్టర్ ఈసీ వినయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా, (జీవిత సాఫల్య)

మీడియా రంగం..

- ▲ సమాజానికి ఎంతోమంది జర్నలిస్టులను అందించిన సీనియర్ జర్నలిస్టు గోవిందరాజు చక్రధర్, కృష్ణాజిల్లా, (జీవిత సాఫల్య)
- ▲ విప్లవ సాహిత్యంతో పాటు సంస్కరణవాద కవిత్వానికి పెద్దపీట వేస్తూ పత్రికల్లో ప్రముఖ సేవలందించిన హెచ్‌ఆర్కే, కర్నూలు(జీవిత సాఫల్య)

సామాజిక సేవ..

- ▲ బెజవాడ విల్సన్, ఎన్టీఆర్ (జీవిత సాఫల్యం)
- ▲ నిర్మల హృదయ్ భవన్, ఎన్టీఆర్ (జీవిత సాఫల్యం)
- ▲ డాక్టర్ జి.సమరం, ఎన్టీఆర్ (జీవిత సాఫల్యం)
- ▲ శ్యాంమోహన్, అంబేద్కర్ కోనసీమ (సాఫల్య పురస్కారం)

నగర వార్తలు

సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకొని మేడిన్ ఇండియా పేరుతో సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. ఉమేష్ మధ్యాన్, మోడల్స్ రిషిత, మనీష, దీపిక, వాణి అగర్వాల్ తదితరులు ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రదర్శన జరగనుంది.

అవయవదానం చేసిన బాలిక



అభినయశ్రీ (ఫైల్)

లక్డీకాపూల్ : తాను చనిపోతూ.. పలువురి జీవితాల్లో వెలుగులు నింపింది 17 ఏళ్ల బాలిక. బ్రెయిన్ డెడ్ అయిన బాలిక అవయవాలను ఆమె కుటుంబసభ్యులు జీవన్‌దాన్‌కు దానం చేశారు. ఖమ్మం వికలాంగుల కాలనీకి చెందిన ముర్ర అభినయశ్రీ డిప్లొమా చదువుతోంది. ఈ నెల15వ తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం మలక్‌పేట యశోద ఆస్పత్రికి తరలించారు. ఇంటెన్సివ్ కేర్ ట్రీట్‌మెంట్ పొందుతున్న ఆమె ఈ నెల18న బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ కోఆర్డినేటర్ కౌన్సిలింగ్‌తో అభినయశ్రీ అవయవాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. ఫలితంగా ఆమె లివర్, రెండు కళ్లను జీవన్‌దాన్ ద్వారా బాధిత కుటుంబాలకు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

నేషనల్ బాప్టిస్ట్ యూత్ కాన్ఫరెన్స్ ప్రారంభం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ప్రాంతంలోని సెంటినరీ బ్యాప్టిస్ట్ చర్చిలో నేషనల్ బాప్టిస్ట్ కాన్ఫరెన్స్ గురువారం ప్రారంభమైంది. బాప్టిస్ట్ యూత్ ఫెలోషిప్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాలతో పాటు, దేశాలకు చెందిన యువతీ, యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా యేసు క్రీస్తు పాటలు, క్యారల్స్, ఆరాధన, మ్యూజిక్ ఫెస్టివల్స్ తదితర కార్యక్రమాలతో పాటు క్రీస్తు సందేశాన్ని అందించారు. సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ పురుషోత్తం, చీఫ్ డీకెన్ జాన్ విల్సన్, చర్చి ప్రధాన కార్యదర్శి రెవరెండ్ క్యాలిస్టర్‌లు మాట్లాడారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

ప్రొఫెసర్ కోదండరామ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సహకార సంఘాలను బలోపేతం చేయాలని అప్పుడే రైతుల ఆత్మహత్యలను నివారించవచ్చునని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత పులి రాజు రచించిన రైతు ఆత్మహత్యల గోస పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించిన కోదండరామ్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వమే విత్తనాలను అందించాలని, కోనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అన్నారు. దోపిడీ వ్యవస్థను అంతమొందిస్తేనే రైతుల ఆత్మహత్యలు ఆగిపోతాయన్నారు. దళారి వ్యవస్థలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కనీసం గిట్టుబాటు ధర కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ ప్రాంతంలో కూడా ఆకలి చావులు జరిగాయన్నారు. ఎక్కడ అభివృద్ధి జరుగుతుందో అక్కడ ఆత్మహత్యలు పెరిగాయని ఇదేమి విచిత్రమో అర్థం కాదన్నారు. ముఖ్యంగా కౌలు రైతులు ఆత్మహత్యలే ఎక్కువగా ఉన్నాయని దీనికి కారణంగా ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడులు రాక గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులకు నష్టం ఏర్పడుతుందన్నారు. వ్యవసాయ రంగంలో ప్రత్యామ్నాయ విధానాన్ని ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సామాజిక విశ్లేషకురాలు కె.సజయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, పాకాల శ్రీహరిరావు, టిజేఏసీ నాయకులు ఉమాసుధీర్, సీనియర్ జర్నలిస్టు ఎస్.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా సాగాలి



బీఎల్ఎఫ్ రెండవ జాబితాను ప్రకటిస్తున్న నల్లా సూర్యప్రకాష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో 16 మందితో బీఎల్ఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థుల రెండవ జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ... బహుజనులకు రాజ్యాధికారం వచ్చినప్పుడే ప్రజలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బహుజనులను మోసం చేస్తూనే ఉన్నాయని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సామాజిక న్యాయానికి పాతరేశాయని విమర్శించారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ నాయకులు గాదగోని రవి, దండి వెంకట్, పాండు రంగాచారి, వనం సుధాకర్, పల్లెపు ఉపేందర్‌రెడ్డి, కుంభం సుకన్య, మారోజు సునీల్, తుకారామ్‌నాయక్, తాంద్ర కళావతి తదితరులున్నారు.

ఇఫ్లూలో విద్యార్థుల ఆందోళన



ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గురువారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరు యువకులు ఇఫ్లూ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తెల్లవారు జామున 4 గంటల నుంచి పాలనా భవనం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఇఫ్లూలో అమ్మాయిలకు రక్షణ కరువైందని అమ్మాయిల భద్రతపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వీసీ ప్రొ.సురేష్‌కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఇఫ్లూ విద్యార్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఓయూ సీఐ ఆంజనేయులు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ఖండన

ఇఫ్లూలో రాత్రులు విద్యార్థినిపై గుర్తుతెలియని వ్యక్తుల లైంగికదాడికి పాల్పడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ధ్వజమెత్తారు. లక్షల రూపాయాలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇఫ్లూకు 2019 నుంచి విద్యార్థి ఎన్నికలు నిర్వహించకుండా నియంతలా వ్యవహరిస్తూ ఇష్టారాజ్యాంగా పాలనను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వీసీ ప్రొ.సురేష్‌కుమార్ పదవీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సౌధలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

పంజగుట్ట: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యుత్‌సౌధాలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులు అందమైన బతుకమ్మలు పేర్చి సంప్రదాయ దుస్తులతో బతుకమ్మలు ఆడారు కార్యక్రమానికి హాజరైన విద్యుత్ సంస్థల సీఎండీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ .. పండగలు సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. తెలంగాణలో విద్యుత్ ఎంత డిమాండ్ ఎన్నిరెట్లు పెరుగుతున్నప్పటికీ ఎక్కడా రాజీ పడకుండా ప్రణాళికాబద్ధంగా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు లీలా ప్రభాకర్, డాక్టర్ హిమబిందు, అసోసియేషన్ అధ్యక్షురాలు వసంత, ప్రధాన కార్యదర్శి ప్రణీత, సలహాదారు విజయలక్ష్మి, అశ్విని, మాధవి, అపర్ణ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సౌధలో బతుకమ్మ ఆడుతున్న విద్యుత్ ఉద్యోగులు

రాష్ట్రంలో విద్యావ్యవస్థపై నిర్లక్ష్యం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం వచ్చాక విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, చిన్న కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించి కార్పొరేట్ కాలేజీలతో మంత్రులు వర్కింగ్ పార్టనర్లుగా మారి వాటిని ప్రోత్సహిస్తున్నారని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో విజిలెన్స్ దాడులు చేయించడం దారుణమని విద్యాసంస్థల మంచిచెడులు విద్యావంతులకు తెలుస్తాయి కాని పోలీసులకు ఏం తెలుస్తుందని కేవలం లంచాలు తీసుకుని వెల్లడం తప్ప అని అన్నారు. రాష్ట్రంలో 75 శాతం మంది చదివే చిన్న వెయ్యి జూనియర్ కాలేజీలు, 600 డిగ్రీ కాలేజీలు, 150 వరకు ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడ్డాయని కార్పొరేట్ కాలేజీలు మాత్రం రోజురోజుకూ విస్తరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ గౌరి సతీష్ అధ్యక్షతన 'విద్యావ్యవస్థ నిర్మాణమా ..? విధ్వంసమా?' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ .. ఈ ప్రభుత్వంలో నోరు విప్పాలన్నా, మాట్లాడాలన్నా ఎంతో ధైర్యం కావాలని, మీరు ధైర్యం చేసి బయటకు రావడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తే ప్రతి ఒక్కరూ సంతోషిస్తారని కాని కార్పొరేట్ విద్యాసంస్థల కోసం 75శాతం మంది చదివే విద్యాసంస్థలను అణచివేస్తామంటే సహించేది లేదన్నారు. రజాకర్లు అంటే విన్నాము ఇప్పుడు చూస్తున్నామని భూమికి రక్షణ లేదు, ప్రాణాలకు రక్షణ లేదు, నిరుద్యోగులు ఉద్యోగం అడిగితే దాడులు, ప్రశ్నించే వారిపై దాడులు, కేసులు, అరెస్టులు ఇలాంటి రోజులు ఎప్పుడూ చూడలేదన్నారు. తాను ఎలాగూ ఎన్నికల్లో పోటీ చెయ్యడం లేదని ఎప్పుడు ఎక్కడకు పిలిచినా మీకు అండగా ఉంటానని తెలిపారు. ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ .. ప్రైవేట్ కాలేజీల వ్యవస్థ ఇలానే కొనసాగితే 75 శాతం కాలేజీలు మూసుకోవాల్సి వస్తుందన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కాలేజీ చదివే విద్యార్థులు సుమారు 5 నుండి 6 వేల మంది ఉంటారని ఈ ప్రభుత్వం ఇలానే కొనసాగితే చిన్న ప్రైవేట్ కాలేజీలు బతకలేవని అందుకే వ్యతిరేక ప్రచారం చెయ్యాలని సూచించారు. గౌరీ సతీష్ మాట్లాడుతూ .. ఇప్పటికే వందల సంఖ్యలో చిన్న కాలేజీలు మూతపడ్డాయని, చిన్న కాలేజీలు లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలు అటు ప్రభుత్వ కాలేజీల్లో సరైన వసతులు లేక, ఇటు కార్పొరేట్ కాలేజీల్లో ఫీజులు కట్టలేక విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో కత్తి వెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌భాస్కర్ సాహిత్యానికి కింగ్ చార్లెస్–3 పురస్కారం



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వేలో డిప్యూటీ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్గా పని చేస్తున్న ఎస్. విజయ భాస్కర్ సాహిత్యానికి కింగ్ చార్లెస్–3 నుంచి ప్రశంసా పత్రం లభించింది. ఈ మేరకు చార్లెస్ రాయల్ కరెస్పాండెన్స్ అధిపతి అందజేసిన ప్రశంసా పత్రంల్లో, దివంగత రాణి మహిమాన్విత జ్ఞాపకార్థం రాసిన ×మానవ సంక్షేమం౦౯౯ అనే కవిత చార్లెస్ హృదయాన్ని తాకినట్లు౯ పేర్కొన్నారు.చార్లెస్ నుంచి హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. విజయ్ భాస్కర్ తన కాలేజీ రోజుల నుంచి రచనలు చేస్తున్నారు. వందలాది వ్యాసాలు రాశారు. ఆయన రాసిన ×ఐయామ్ ఇన్ లవ్.విత్ ఆల్మైటీ౯ అనే ఆధ్యాత్మిక పుస్తకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఐర్లాండ్ అధ్యక్షుడు మైకేల్ డి హిగ్గిన్స్, అమెరికా మాజీ విదేశాంగ కార్యదర్శి హిల్లరీ క్లింటన్,తదితరరులు ప్రశంసించారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రులు ఘనంగా సాగుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ఉండే కంటోన్మెంట్‌లో దుర్గాపూజలతో పాటు దాండియా ఉత్సవాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ముఖ్యంగా బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్, సిఖ్ విలేజ్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న దాండియా ఉత్సవాలకు సందర్శకులు పోటెత్తుతున్నారు. డీజే దరువు, లైవ్ ఆర్కెస్ట్రా నడుమ అర్ధరాత్రి వరకు సాంప్రదాయ నృత్యాలతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటోంది. బోయిన్‌పల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ నేత టింకూ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని మంత్రి మల్లారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





ఏఎస్‌డీ జాబితాలో 'వలస' ఓటర్లు

Interview



చనిపోయిన, ఇళ్లు మారిన, గైర్హాజరీలో ఉన్నవారితో ప్రత్యేక ఓటర్ల జాబితా

బోగస్ ఓటింగ్, రిగ్గింగ్ జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటాం

అధికారుల బదిలీకి ఈసీ ఎలాంటి కారణాలు తెలపలేదు

పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12డీ పంపిణీ ప్రారంభించాం

నవంబర్ 15లోగా కొత్త ఓటర్లందరికీ ఓటరు కార్డుల పంపిణీ

నవంబర్ 10 తర్వాత ఓటరు స్లిప్పుల పంపిణీ

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

ముహమ్మద్ ఫసియుద్దీన్

'ఒకటికి మించి ఓటు ఉన్న వారు, చనిపోయిన వారికి సంబంధించి 2022, 2023లో రాష్ట్రంలో మొత్తం 22 లక్షల ఓటర్లను తొలగించాం. ఇళ్లు మారిన ఓటర్లు ఎక్కడికి పోయారో తెలియదు. వీరి పేర్లను తొలగించే ముందు వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా 15 రోజుల గడువుతో నోటీసులు జారీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. వారు స్పందించని పక్షంలో బీఎల్ఓతో విచారణ జరిపించాలని, ఆ తర్వాతే వారి పేర్లను తొలగించాలని స్పష్టంచేసింది. ఈ ప్రక్రియ మధ్యలో ఉండగానే ఎన్నికల షెడ్యూల్ వచ్చేయడంతో వారిని తొలగించలేకపోయాం' అని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. అయితే, అలాంటి ఓటర్లతో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ (ఏఎస్‌డీ) అనే పేరుతో ప్రత్యేక ఓటర్ల జాబితాను రూపొందించి పోలింగ్ కేంద్రాలకు అందజేస్తామన్నారు. వీరిలో ఎవరైనా ఓటేయడానికి వస్తే గుర్తింపును కచ్చితంగా ధ్రువీకరించుకున్న తర్వాతే ఓటు వేసేందుకు అనుమతిస్తామని చెప్పారు. బోగస్ ఓటింగ్, రిగ్గింగ్ జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర శాసనసభకు సాధారణ ఎన్నికల నేపథ్యంలో వివిధ అంశాలపై ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి..

ఓటరు నమోదుకు ఎప్పటిలోగా దరఖాస్తు చేసుకోవాలి? వేరే ప్రాంతానికి ఓటును బదిలీ చేసుకోవచ్చా?

వికాస్‌రాజ్: కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, వేరే ప్రాంతానికి బదిలీ/వివరాల దిద్దుబాటుకు ఫారం-8ను అక్టోబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. నామినేషన్లు నవంబర్ 10తో ముగుస్తాయి.ఆ తర్వాత అర్హులైన వారి పేర్లతో అనుబంధ ఓటర్ల జాబితాను ప్రచురిస్తాం.

కొత్త ఓటర్లకు కార్డుల పంపిణీ ఎప్పుడు చేస్తారు?

- ఇప్పటికే 27.5 లక్షల కొత్త ఓటర్లకు సంబంధించిన ఓటరు గుర్తింపు కార్డులను ముద్రించి స్పీడు పోస్టు ద్వారా వారి చిరునామాలకు పంపాం. మరో 12.5 లక్షల కార్డులను ముద్రించి నవంబర్ 15లోగా పంపిస్తాం. నవంబర్ 10 తర్వాత ఓటర్లందరికీ ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ ప్రారంభిస్తాం.

హైదరాబాద్‌లో పోలింగ్ కేంద్రం ఎక్కడుందో తెలియక చాలామంది ఓటేయలేకపోతున్నారు?

- పోలింగ్ కేంద్రం వివరాలతో ఓటర్లందరికీ ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులను పంపిణీ చేస్తాం. 'ఓటర్ హెల్ప్‌లైన్ యాప్'తోపాటు ఈసీఐ వెబ్‌సైట్‌లోని 'ఓటర్ సహాయ మిత్ర' అనే లింక్ ద్వారా పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకోవచ్చు. ఓటరు కార్డు నంబర్ ద్వారా వివరాలు తెలుస్తాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి కొందరి పోలింగ్ కేంద్రాలు మారొచ్చు.

ఓటర్ల జాబితాలో 120 ఏళ్లకు పైబడిన ఓటర్లు వందల సంఖ్యలో ఉన్నారు? ఎలా సాధ్యం?

- పుట్టిన సంవత్సరం సరిగ్గా తెలియక కొందరు తమ పుట్టిన సంవత్సరాన్ని 1900గా నమోదు చేయించారు. దీంతో కొందరు ఓటర్ల వయసు 120 ఏళ్లకు పైగా ఉన్నట్టు జాబితాలో వచ్చింది. ఆ ఓటర్లే తమ పుట్టిన సంవత్సరం సవరణకు దరఖాస్తు చేసుకోవాలి.

పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ఎలా పొందాలి?

- 80 ఏళ్లుపైబడిన వృద్ధులు, 40శాతానికి మించిన వైకల్యమున్న ఓటర్లు ఇంటి నుంచే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయొచ్చు. ఇందుకోసం వీరికి 'ఫారం-12డీ' దరఖాస్తులను పంపిణీ చేస్తున్నాం. వీటిని బీఎల్‌ఓలు సేకరిస్తారు. ముందే నిర్దేశించిన తేదీల్లో ప్రిసైడింగ్ అధికారి నేతృత్వంలోని బృందం వీరి ఇళ్లకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ అందజేస్తుంది. రహస్యంగా ఓటేసేందుకు వీలుగా ఇంట్లో కంపార్ట్‌మెంట్ సైతం ఏర్పాటు చేస్తుంది. వీడియో కెమెరా బృందం, పోలీసులు సైతం ఉంటారు. పార్టీల ఏజెంట్లనూ అనుమతిస్తారు. ఓటేసిన తర్వాత ఓటరే స్వయంగా బ్యాలెట్ పత్రాన్ని కవర్‌లో ఉంచి సీల్ చేసి ప్రిసైడింగ్ అధికారికి ఇవ్వాలి. జర్నలిస్టులతో సహా 13 అత్యవసర సేవల విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చే కేంద్రాల్లోనే పోలింగ్ ఫెసిలిటేటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. అక్కడే వారికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చి ఓటు వేయించుకుంటాం.

ప్రగతి భవన్‌లో బీ-ఫారాల పంపిణీ, రజాకార్ సినిమా, సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై అధికార, విపక్ష పార్టీలు ఫిర్యాదు చేశాయి కదా?

- ఆ ఫిర్యాదులు కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలనలో ఉన్నాయి. అక్కడి నుంచి అందే సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

ఎన్నికల సంఘం ఇటీవల రాష్ట్రంలో పెద్దఎత్తున అధికారులను ఆకస్మిక బదిలీ చేసింది? కారణమేంటి?

- బదిలీ ఉత్తర్వుల్లో ప్రత్యేకంగా కారణాలేమీ తెలపలేదు. వారి వద్ద ఉన్న సమాచారం ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు.

ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు వివరాలిస్తే నామినేషన్ తిరస్కరిస్తారా?

- అఫిడవిట్‌లో తప్పుడు సమాచారమిస్తే రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరించరు. అన్ని కాలమ్‌లను భర్తీ చేయనిపక్షంలో అభ్యర్థికి నోటీసులిస్తారు. అయినా భర్తీ చేయకుంటే ఆ నామినేషన్‌ను తిరస్కరించవచ్చు.

నేర చరిత్రపై అభ్యర్థులు, పార్టీలు సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా అనామక పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నాయి?

- త్వరలో అన్ని పార్టీలకు సూచనలు జారీ చేస్తాం. సర్క్యులేషన్, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలో ఓ జాబితాను పార్టీలకు అందజేస్తాం.

ఆన్‌లైన్ ద్వారా ఓటర్లకు నగదు బదిలీపై నిఘా ఉంచారా?

- యూపీఐ ద్వారా ఏ బ్యాంకు ఖాతా నుంచి ఎంత డబ్బు బదిలీ చేస్తున్నారు? అనే అంశంపై ఆదాయ పన్ను శాఖకు రోజువారీగా నివేదికలు అందుతున్నాయి.

రాష్ట్రానికి కేంద్ర బలగాలు ఎన్ని వస్తున్నాయి?

- ఎన్నికల బందోబస్తు కోసం 65 వేల మంది పోలీసుల సేవలు అవసరం కాగా, రాష్ట్రంలో 40వేల మంది ఉన్నారు. మరో 25,000 మంది బలగాలను పంపాలని డీజీపీ అడిగారు. 100 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రానికి వస్తున్నాయి.

గాసిప్ టైమ్

'అనుబంధం' లేనట్టేనా?

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ఈసారి టికెట్ల గిరాకీ బాగానే ఉంది. ఎప్పుడూ ఉండే గిరాకీనే అయినా ఈసారి తాకిడి ఇంకొంచెం ఎక్కువగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ గిరాకీలో పార్టీ అనుబంధ సంఘాల టికెట్లు ఎగిరిపోతాయేమోననే చర్చ జరుగుతోంది. ఈసారి పార్టీ అనుబంధ సంఘాలైన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్స్, కిసాన్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఫిషర్‌మెన్ కాంగ్రెస్‌ల అధ్యక్షులు టికెట్లు ఆశిస్తున్నారు. వీరిలో ఇప్పటివరకు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలికి మాత్రమే టికెట్ ఖరారైంది. మిగిలిన అనుబంధ అధ్యక్షులకు టికెట్లు వస్తాయో రావో అనే అనుమానాలు వస్తున్నాయి. వీరు ఆశించే సీట్లలో ఇతరులకు టికెట్లు వస్తున్నాయన్న ప్రచారం ఈ మధ్య కాలంలో బాగా ఊపందుకుంది. ఈ జాబితాలో హుజూరాబాద్, వనపర్తి, తుంగతుర్తి, దేవరకొండ, మహబూబాబాద్, ఆర్మూరు, చార్మినార్, గోషామహల్ లాంటి సీట్లున్నాయి. ఇందులో ఒకట్రెండు సీట్లకు అభ్యర్థులను ప్రకటించారు కూడా. కొసమెరుపేమిటంటే.. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలికి టికెట్ అయితే కన్ఫామ్ అయింది కానీ, ఆ టికెట్‌పై ఆమె కూడా ఆశాజనకంగా లేరంట.

మీకు తెలుసా ?

గద్వాల అడ్డా డీకే ఫ్యామిలీ

గద్వాల నుంచి డీకే కుటుంబం కూడా సుదీర్ఘకాలంగా రాజకీయాలలో కొనసాగుతోంది. డీకే సత్యారెడ్డి రెండుసార్లు అసెంబ్లీకి ఎన్నిక కాగా, ఆయన కుమారుడు సమరసింహారెడ్డి నాలుగుసార్లు గెలిచారు. మరో కుమారుడు డీకే భరతసింహారెడ్డి ఒకసారి, భరత్ భార్య డీకే అరుణ మూడుసార్లు అసెంబ్లీకి గెలిచారు. సమర, భరత్‌లు ఒకసారి పరస్పరం పోటీ పడ్డారు. సమరసింహారెడ్డి ఇప్పుడు అంత యాక్టివ్‌గా రాజకీయాల్లో లేరు. సమరసింహారెడ్డి, అరుణలు మంత్రి పదవులు పొందారు. డీకే కుటుంబానికి మేనల్లుడు అయిన కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్ పక్షాన ప్రస్తుతం గద్వాల ఎమ్మెల్యేగా ఉన్నారు. అరుణ తండ్రి సి.నర్సిరెడ్డి మక్తల్ నుంచి మూడుసార్లు గెలుపొందగా, ఆయన కుమారుడు రామ్మోహన్ రెడ్డి మూడుసార్లు ఎన్నికయ్యారు.

ఆవిడతో కలిసి అసెంబ్లీకి...

భార్యాభర్తలిద్దరూ ఒకేసారి శాసనసభలో ఉండడం అరుదుగా జరుగుతుంది. 1950 వ దశకంలో ఆలేరు నుంచి ఆరుట్ల కమలాదేవి, ఆమె భర్త రామచంద్రారెడ్డి ఒకేసారి అసెంబ్లీలో ఉండడం విశేషం. వీరిద్దరూ కమ్యూనిస్టు పార్టీ తరపున ఎన్నికయ్యారు. రామచంద్రారెడ్డి భువనగిరి నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2009లో కొత్తకోట దయాకరరెడ్డి, ఆయన భార్య సీత ఒకసారి శాసనసభలో ఉన్నారు. దయాకరరెడ్డి 1994, 99లలో అమరచింత నుంచి రెండుసార్లు, 2009లో మక్తల్ నుంచి ఒకసారి , సీత 2009లో దేవరకద్ర నుంచి గెలుపొందారు. వీరిద్దరూ టీడీపీ నుంచి గెలిచారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన భార్య పద్మావతి కూడా 2014లో ఒకేసారి శాసనసభలో ఉన్నారు. ఉత్తం హుజూర్ నగర్ నుంచి, పద్మావతి కోదాడ నుంచి గెలుపొందారు.

ఓటరు మనసు పసిగట్టే.. ఏఐ మంత్రం!

పబ్లిక్ మీటింగ్‌లో జనం మూడ్ ఏంటో పరిశీలన

సోషల్ మీడియా నుంచి మనోభావాల విశ్లేషణ

కృత్రిమ మేధతో ముంబై ఐఐటీ విద్యార్థుల సరికొత్త ప్రయోగం

ప్రాజెక్టు వర్క్‌గా తెలంగాణ ఎన్నికల్లో వినియోగం



వనం దుర్గాప్రసాద్

రోజురోజుకు సరికొత్తగా మారుతూ వస్తున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) అసెంబ్లీ రాజకీయ సమరాంగణంలోకి కూడా అడుగుపెట్టింది. ఎక్స్(ట్విట్టర్), ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సామాజిక మాధ్యమాలను వడపోసి ఓటర్ల నాడి ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. వివిధ పార్టీల నాయకుల పట్ల ప్రజల మనోగతాన్ని విశ్లేషించబోతోంది. ముంబై ఐఐటీ విద్యార్థులు ఈ సరికొత్త ప్రయోగానికి సిద్ధమయ్యారు. కృత్రిమ మేధపై అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ చేసిన విద్యార్థులు, హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులను కూడా ఇందులో భాగస్వామ్యం చేసి.. ఒక ప్రాజెక్టు వర్క్‌గా దీనిని చేపట్టాలని నిర్ణయించారు. విద్యార్థుల ప్రయోగ ఫలితాలను సీనియర్ ప్రొఫెసర్లు విశ్లేషించనున్నారు. వివిధ సర్వేల మాదిరిగానే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఆధారంగా ఓటర్ల మూడ్‌ను గుర్తించి ఓ అంచనాకు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి దీన్ని ప్రయోగ స్థాయిలోనే చూడాలని.. ఎన్నికల ఫలితాలతో ఏఐ పరిశీలన సమాచారాన్ని సరిపోల్చిచూడాలని ముంబై ఐఐటీ విద్యార్థులు నిర్ణయించారు. ఇది విజయవంతమైతే వివిధ ఎన్నికల్లో మరింతగా పరిశీలన జరిపే ఆలోచనలో ఉన్నారు.

బహిరంగ సభల నుంచి కూడా..

ఆన్‌లైన్ విద్యావిధానంలో ఆయా విద్యార్థులు క్లాసులు సరిగా వింటున్నారా, లేదా? అన్నది పసిగట్టేందుకు కృత్రిమమేధను ఉపయోగిస్తుంటారు. ఆకస్మికంగా అనుబంధ ప్రశ్నలు వేయడం, వచ్చే సమాధానాల ద్వారా విద్యార్థి ఏకాగ్రతను గుర్తించడం చేస్తుంటారు. వైద్యరంగంలోనూ రోగి అందుకున్న వైద్యసేవల ఆధారంగా, తీసుకున్న మందుల ద్వారా భవిష్యత్ వ్యాధులను ఏఐ అంచనా వేస్తోంది. ఇలాంటి విజయాలను ఆధారంగా చేసుకుని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రజల మానసిక ధోరణిని తెలుసుకునే కృత్రిమమేధ సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసేందుకు ప్రయోగాలు చేపట్టింది. దీని ఆధారంగానే ఇప్పుడు ముంబై ఐఐటీ విద్యార్థులు ఎన్నికల్లో ప్రజల మూడ్‌ను తెలుసుకునే ప్రయోగానికి సిద్ధమయ్యారు. ముఖ్యనేతల సభలకు హాజరయ్యే ప్రజల ఫొటోలు, వీడియోలను సదరు సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం చేస్తారు. అందులోని జనం హావభావాలను కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ నిశితంగా పరిశీలిస్తుంది. కోడ్ భాషలో కొన్ని సంకేతాలు పంపుతుంది. వీటిని విశ్లేషించడం ద్వారా ఆ సభలో ఓటరు తీరు ఎలా ఉంది? అనుకూలమా? వ్యతిరేకమా? అన్నది పరిశీలిస్తారు. నాయకుడు మాట్లాడిన అంశాలపై ప్రజలు ఏరకంగా స్పందించారనేదానిపై అంచనా వేస్తారు.

సోషల్ మీడియాలో పసిగట్టేలా..

ఫేస్‌బుక్,ఎక్స్(ట్విట్టర్),ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఓ వ్యక్తి పోస్టులు సాధారణంగా వారి పొలిటికల్ మూడ్‌ను స్పష్టం చేస్తాయని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ ఓ పరిశీలనలో గుర్తించింది.యువత సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ చురుగ్గా ఉంటారు. ఈ క్రమంలో ఐఐటీ విద్యార్థులు కొన్ని నియోజకవర్గాల్లో యువత సామాజిక పోస్టులను ఏఐ ప్రోగ్రామ్‌కు జోడించి, మెజారిటీ యూత్ మనోభావాలను గుర్తించే ప్రయత్నం చేయనున్నారు. ఇది వ్యక్తిగత సమాచారం కిందకు ఏమీ రాదని న్యాయ నిపుణులు కూడా అంటున్నారు. ప్రస్తుతానికి ఈ ప్రయోగాన్ని యువత వరకే పరిమితం చేస్తున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, వాటిపై సానుకూల, ప్రతికూల ఫలితాలను కూడా ఏఐ విశ్లేషించే వీలుందని నిపుణులు చెప్తున్నారు. ఉదాహరణకు ఏదైనా పథకంపై వివిధ వర్గాల నుంచి మాధ్యమాల్లో వచ్చే కామెంట్స్‌ను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా విశ్లేషించి.. ఆపథకం ప్రభావంపై అంచనా వేసే అవకాశం ఉంటుందన్నారు.

భవిష్యత్‌లో ఏఐతోనే ప్రధాన సర్వేలు



అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధ అద్భుత ఫలితాలు సాధిస్తోంది. పైథాన్‌తోపాటు పలు రకాల సాంకేతిక లాంగ్వేజీల ఆధారంగా నిపుణులు ఏఐ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. యూట్యూబ్‌లో మనం ఓ వీడియో చూస్తున్నప్పుడు మన మానసిక పరిస్థితి ఏమిటో అంచనా వేసి, అదే తరహా వీడియోలు వరుసగా వస్తుండటానికి అలాంటి ప్రోగ్రామ్‌లే కారణం. ఇంతగా అభివృద్ధి చెందిన ఏఐ.. ఇప్పుడు రాజకీయంగా ఓటర్ల నాడిని వందశాతం విశ్వసనీయతతో పసిగడుతుందని చెప్పవచ్చు. ఈ తరహా ప్రయోగాల్లో ఐఐటీ విద్యార్థులు చూపిస్తున్న ఆసక్తిని అభినందించాల్సిందే. స్టాన్‌ఫర్డ్‌లో ఈ తరహా ప్రయోగాలు విజయవంతమయ్యాయి. వీటిని మరింత ముందుకు తీసుకెళ్లాలి.

– ఎమ్‌వీ రమణారావు, ఎన్ఐటీ డైరెక్టర్, రాయ్‌పూర్

వివిధ టూల్స్ క్రోడీకరణతో కచ్చితమైన ఫలితాలు



క్లౌడ్ థింకింగ్ ఇప్పటికే విస్తరించింది. అనేక రకాల సమాచారం నిక్షిప్తమైంది. కృత్రిమ మేధ కూడా ఒక టూల్. రాజకీయ సర్వేల్లో దీని భాగస్వామ్యం ఇప్పటికిప్పుడు కచ్చితంగా వస్తుందని చెప్పలేం. కాకపోతే క్లౌడ్ ఆధారిత డేటా విశ్లేషణతో భవిష్యత్‌లో దీని ప్రాధాన్యత ఉందనేది సుస్పష్టం.

– ఎస్‌జీఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్, ఎంవీఎస్ఆర్ కాలేజీ

మేనిఫెస్టో లేని మజ్లిస్

ప్రచార ఆర్భాటాలు లేకుండా ప్రజాక్షేత్రంలోకి..

పార్టీ నేతల మాటలే అక్కడి ప్రజలకు మేనిఫెస్టో

మహమ్మద్ హమీద్ ఖాన్

ప్రతి రాజకీయ పార్టీకి ఎన్నికల మేనిఫెస్టో కీలకమైనది. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామో చెబుతూ.. ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించడం ఆనవాయితీ. దాన్ని బట్టే ఆ పార్టీ గెలుపుపోటములు కూడా ఆధారపడి ఉంటాయి. స్వతంత్రులు సైతం తమను గెలిస్తే చేసే పనులను ప్రకటించి ఓట్లను అభ్యర్థిస్తారు. కానీ, అసలు మేనిఫెస్టో లేకుండా ఎన్నికల బరిలో దిగే ఏకైక రాజకీయ పార్టీ ఆల్ ఇండియా మజ్లిస్- ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం). సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్నా, వరసగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఏఐఎంఐఎం మాత్రం ఎన్నడూ మేనిఫెస్టో విడుదల చేయలేదు. ఎన్నికల మేనిఫెస్టోతో సంబంధం లేకుండా.. ఓటర్లకు జవాబుదారీగా ఉండేందుకు ఏం చేశారో, ఏం చేస్తారో చెప్పకుండానే ఓటర్లను ఆకర్షిస్తోంది. ఆరున్నర దశాబ్దాలుగా ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఏ ఎన్నికల్లోనూ మేనిఫెస్టో పత్రాన్ని విడుదల చేయలేదు. తాజాగా కూడా తెలంగాణ, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం మేనిఫెస్టో లేకుండానే బరిలో దిగుతోంది. ప్రాంతీయ పార్టీగా ఎన్నికల సంఘం గుర్తింపు ఉన్న ఏఐఎంఐఎం మిగతా రాజకీయ పక్షాలకు భిన్నంగా మేనిఫెస్టో విడుదల చేయని పార్టీగా రికార్డుకెక్కింది.

పాతబస్తీ నుంచి దేశస్థాయికి

"మా పనితీరు.. మా గుర్తింపు" అనే నినాదంతో ఎన్నికల క్షేత్రంలో దిగే ఎంఐఎం హైదరాబాద్ పాతబస్తీ నుంచి జాతీయ స్థాయికి పార్టీని విస్తరించింది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, బిహార్ శాసనసభల్లో సైతం పార్టీ ప్రాతినిధ్యం కలిగి ఉంది. అదేవిధంగా కర్ణాటక, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలో స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం వహిస్తోంది. పార్లమెంటులోనూ హైదరాబాద్ నుంచి అసదుద్దీన్ ఒవైసీ, ఔరంగాబాద్ నుంచి ఇంతియాజ్ జలీల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



వారంలో ఆరు రోజులు...

ఏఐఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయమైన దారుస్సలాంలో వారంలో ఆరు రోజుల పాటు ప్రతి రోజూ ప్రజా గ్రీవెన్స్ కొనసాగుతుంది. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కార్పొరేటర్ నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీల వరకు అందుబాటులో ఉంటారు. వివిధ పనులపై వచ్చే ప్రజలు నేరుగా కార్పొరేటర్‌నో, ఎమ్మెల్యేనో, ఎంపీనో కలిసి తమ సమస్యలు చెప్పుకొనే అవకాశం ఇక్కడ ఉంటుంది. ముస్లిం సామాజిక వర్గం కంటే హిందుసామాజిక వర్గం తాకిడి దారుస్సలాంకు అధికంగా ఉండటం విశేషం. అయితే ఇక్కడ అంతా క్యూ పాటించాల్సిందే.

పాతబస్తీలో కింగ్ మేకర్

హైదరాబాద్ రాజకీయాలలో మజ్లిస్ కింగ్ మేకర్ పాత్రను పోషిస్తోంది. హైదరాబాద్ పాతనగరం రాజకీయ పరిస్థితికి కొత్త నగరం భిన్నంగా ఉంటుంది. హిందూ, ముస్లిం ఎజెండాలతో ఇక్కడ మజ్లిస్, బీజేపీ రాజకీయంగా తలపడుతున్నా.. ఫలితం మాత్రం వన్‌సైడ్‌గా ఉంటోంది.

ఇదీ చరిత్ర

96 ఏళ్ల కిందట నిజాం పాలనలోని హైదరాబాద్ స్టేట్‌లో 1927లో 'మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్'గా ఆవిర్భవించిన ధార్మిక సంస్థ క్రమంగా ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్' రాజకీయ పార్టీగా రూపాంతరం చెందింది. 1948లో హైదరాబాద్ స్టేట్ ఇండియన్ యూనియన్‌లో చేరిన తర్వాత ఈ సంస్థ నిషేధానికి గురైంది. అసదుద్దీన్ ఒవైసీ తాత అప్పటి ప్రసిద్ధ న్యాయవాది మౌలానా అబ్దుల్ వాహిద్ ఒవైసీ 1958లో రాజ్యాంగంలో పొందుపరిచిన మైనారిటీల హక్కుల కోసం పోరాడేందుకు ఆ సంస్థనే రాజకీయ పార్టీగా మార్చారు.

1959లోనే హైదరాబాద్‌లో జరిగిన రెండు మున్సిపల్ ఉప ఎన్నికల్లో పార్టీ విజయం సాధించింది. 1960లో హైదరాబాద్ బల్దియాలో ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించింది. వరసగా అబ్దుల్ వాహెద్ ఒవైసీ కుమారుడు సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ, ఆ తర్వాత ఆయన కుమారుడు అసదుద్దీన్ ఒవైసీ పార్టీ పగ్గాలు చేపట్టి ముస్లిం మైనారిటీ గొంతుకగా బలమైన రాజకీయ శక్తిగా మార్చుతూ వచ్చారు.

మభ్యపెట్టడానికే మేనిఫెస్టో



ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టడానికి మేనిఫెస్టో ఒక ప్రచారసాధనం. ఓట్లు రాబట్టుకునేందుకు ఒక ఆయుధం. అందుకే మేం ఎన్నడూ ఆ ఊసెత్తం. హామీలు ఇవ్వం. పని చేసి గుర్తింపు తెచ్చుకుంటాం. ప్రజల మధ్యనే ఉంటాం. ఎప్పుడూ అందుబాటులో ఉంటాం. ఇలాంటప్పుడు ఇక మేనిఫెస్టో అవసరం ఏముంది. అమలు కాని హామీలిచ్చి ప్రజలకు అందుబాటులో లేకుండా తిరగడం మజ్లిస్ పార్టీ పద్ధతి కాదు.

- అసదుద్దీన్ ఒవైసీ ,అధినేత, ఏఐఎంఐఎం



సిద్దిపేట నుంచి..

బాలరంగం

మరో టీఆర్‌ఎస్

తెలంగాణ రాజ్య సమితి పేరుతో రిజిస్ట్రేషన్

సాక్షి, సిద్దిపేట: రాష్ట్రంలో టీఆర్ఎస్ (తెలంగాణ రాజ్య సమితి) పేరుతో మరో కొత్త రాజకీయ పార్టీ అవతరించింది. సిద్దిపేట జిల్లాకు చెందిన సీఎం కేసీఆర్ గతంలో టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసి, ఇటీవల దానిని బీఆర్ఎస్ (భారత్ రాష్ట్ర సమితి)గా మార్చిన విషయం తెలిసిందే. తాజాగా అదే సిద్దిపేట జిల్లా పొన్నాల గ్రామానికి చెందిన ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు తుపాకుల బాలరంగం పార్టీ అధ్యక్షుడిగా తెలంగాణ రాజ్య సమితి రిజిస్ట్రేషన్ కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిబ్రవరి 13న దరఖాస్తు చేశారు. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ఆ పార్టీని రిజిస్టర్ చేసింది. దీనిని టీఆర్ఎస్ అని సంక్షిప్తంగా పేర్కొంటున్నారు. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ఈ పార్టీకి గ్యాస్ సిలిండర్ గుర్తు కేటాయించింది.

బహుజనులకు రాజ్యాధికారం కోసమే..: రాష్ట్ర జనాభాలో 75 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలున్నా రాజ్యాధికారం దక్కడంలేదు. ముదిరాజ్‌లు 14 శాతం, పద్మశాలీలు 8 శాతం, యాదవ్‌లు 12 శాతం, గౌడలు 10 శాతం జనాభా ఉన్నా, ఐదుశాతం లోపు జనాభా ఉన్నవారికే ప్రస్తుతం పదవులు దక్కుతున్నాయి. రాబోయే కాలంలో బహుజనులకు రాజ్యాధికారం కోసమే పార్టీని స్థాపించాం. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 50 శాతం సీట్లలో పోటీ చేస్తాం. – బాలరంగం

రెండుసార్లు ఎమ్మెల్యే అయినా అద్దె ఇంట్లోనే..

సాక్షి,యాదాద్రి: ఓ దఫా కౌన్సిలర్‌గా గెలిస్తే చాలు.. రూ.కోట్లు కూడగట్టేసుకుంటున్న నేటి రోజుల్లో ఏకంగా రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసినా సొంతిల్లు కూడా కూడగట్టుకోలేని నిజాయితీకి నిలువుటద్దం కొమ్మిడి నర్సింహారెడ్డి. సర్పంచ్‌గా ప్రజా జీవితం ప్రారంభించి, సమితి ప్రెసిడెంట్‌గా, భువనగిరి ఎమ్మెల్యేగా రెండు దఫాలు సేవలందించిన కొమ్మిడి ప్రజా సమస్యలే ఎజెండాగా ఎంచుకున్న నిస్వార్థ రాజకీయనాయకుడు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉన్నా మర్రి చెన్నారెడ్డి లాంటి వారి కోట రీలో ఉన్నా తనకంటూ ప్రత్యేకంగా ఆస్తిపాస్తులు సంపాదించుకోలేదు. చివరకు అద్దె ఇంట్లో ఉంటూ సాధారణ జీవితం గడుపుతున్న కొమ్మిడి ఆదర్శ ప్రస్థానం ఓసారి చూద్దాం రండి.

నిజాయతీకి నిలువుటద్దం కొమ్మిడి నర్సింహారెడ్డి

ప్రజాసమస్యలే ఆయన ఎజెండా

83ఏళ్ల వయస్సులో ఇప్పుడు భూపరిహారం కోసం పోరాటం

ఇదీ..భువనగిరి మాజీ ఎమ్మెల్యే జీవితం



ఎన్టీఆర్ ప్రభంజనాన్నీ ఎదుర్కొని గెలిచి..

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కొమ్మిడి నర్సింహారెడ్డి భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1962 నుంచి 1970 వరకు బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. తొలిదశ తెలంగాణ పోరాటసమయంలో 1969లో బ్రాహ్మణపల్లి సర్పంచ్‌గా ఉన్నారు. అనంతరం 1978 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి భువనగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు.1983లో ఎన్టీ.రామారావు టీడీపీ ప్రభంజనంలో కూడా ఆయన రెండవ సారి భువనగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

డబ్బులు లేవని పోటీకి దూరం

1985 మధ్యంతర ఎన్నికల్లో కొమ్మిడి నర్సింహారెడ్డి ఎమ్మెల్యే ఎన్నికల నుంచి తప్పుకున్నారు. 1978 ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఆయన ఎన్నికల ఖర్చు సుమారు రూ.7 వేలు కాగా, రెండోసారి ఎన్నికల నాటికి ఆ ఖర్చు రూ.2 లక్షలకు పెరిగింది. మూడోసారి పోటీ చేసే అవకాశం ఉన్నా.. డబ్బు లేదని పోటీ నుంచి స్వచ్ఛందంగా విరమించుకున్నారు. ఆ ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ పోటీ చేయమని కోరినా కొమ్మిడి నర్సింహారెడ్డి సున్నితంగా తిరస్కరించారు. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు.

పరిహారం వస్తే ఇల్లు కట్టుకుంటా

“నా సొంత భూమి బొల్లేపల్లి కాల్వ తవ్వడం కోసం ప్రభుత్వం తీసుకుంది. తీసుకున్న భూమికి పరిహారం డబ్బులు వస్తే ఇల్లు కట్టుకుంటా. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నా. సీఎం, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లను కలిసి వినతి పత్రాలు ఇచ్చినా పరిహారం డబ్బులు అందడం లేదు. ప్రభుత్వం స్పందించి భూ పరిహారం డబ్బులు ఇప్పించాలి.”

– కొమ్మిడి నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

భూములను పేదలకు పంచారు

బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో తన వాటాగా వచ్చిన సాగు భూమిని నర్సింహారెడ్డి పేదలకు పంచారు. 83 సంవత్సరాల వయసులో సైతం ఆయన ఇప్పటికీ దీర్ఘకాలిక ప్రజా సమస్యలపై పోరాడుతున్నారు. భువనగిరి ప్రాంత సమస్యలతో పాటు రాష్ట్ర స్థాయి సమస్యలను ఎజెండాగా చేసుకుని పోరాటం కొనసాగిస్తున్నారు. గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టి భువనగిరి, ఆలేరు ప్రాంతాలకు సాగు నీరు అందించాలని ఆయన ఎన్నో పోరాటాలు చేశారు. గోదావరి నదీ జలాల సాధన, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని మూసీ పరీవాహక ప్రాంతంలో కాలుష్యం నివారణ, నిమ్స్, సీసీఎంబీ కోసం గతంలో ఆమరణ దీక్ష చేశారు.

గతంలో స్కూటర్‌పైనే ప్రయాణం

నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే నర్సింహారెడ్డి వాహనం బజాజ్ చేతక్‌ను ఉపయోగించేవారు. వృద్ధాప్యం వల్ల ప్రస్తుతం స్కూటర్‌ను వాడడం లేదు. అప్పట్లో అసెంబ్లీ, సీఎం ఇల్లు, సచివాలయం, అధికారుల వద్దకు ఎక్కడికి వెళ్లినా ఆయన తన స్కూటర్ పైనే వెళ్లేవారు. జాతీయ స్థాయి నాయకుల నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు ఎందరితోనో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నప్పటికీ.. ఎప్పుడు తాను నమ్మిన సిద్ధాంతాన్ని వీడలేదు. తన ప్రజాసమస్యల పోరాట నావను ఆపలేదు.



రాహుల్‌లా ఉన్నాడే..

కాటారం: భూపాలపల్లి జిల్లా కాటారం కార్నర్ మీటింగ్‌లో రాహుల్‌గాంధీని పోలిన ఒక వ్యక్తి సందడి చేశాడు. అర్ధగంటకుపైగా కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించిన రాహుల్‌గాంధీ.. అనంతరం కాన్వాయ్‌లో మంథనికి వెళ్లిపోయారు. అనంతరం ఆయన్ను పోలిన మరోవ్యక్తి ప్రధాన కూడలిలో అభివాదం చేయడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. అతనితో ఫొటోలు దిగడానికి పలువురు పోటీ పడ్డారు.



మున్నేటిలో ఈదుతూ..

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మంలోని మున్నేరు వాగులో పలువురు స్విమ్మర్లు గురువారం వినూత్న రీతిలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మద్దతుగా ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఖమ్మం నుంచి కాంగ్రెస్ తరఫున తుమ్మల పోటీ చేస్తారని ప్రచారం జరుగుతుండగా.. వారు తుమ్మల ఫొటోతో కూడిన జెండాలను ప్రదర్శిస్తూ ఈత కొట్టారు.

ప్రసంగాల్లో సామెతలు.. ఉపన్యాసాల్లో నుడి‘కారాలు’!

షుగర్ & పెప్పర్
..:: యాసీన్

కేసీఆర్‌కు భాష మీదా, సామెతల మీద పట్టెక్కువ. మొన్ననే జడ్చర్ల, మేడ్చల్ సభల్లో ‘కాంగ్రెస్ వస్తే కాటగలుస్తం’, ‘గోల్‌మాల్ చేసే టోళ్లతోని గోసవడ్డం’, ‘రైతుబంధుకు రాంరాం, దళితబంధుకు జైభీం అంటరు’... అంటూ ప్రసంగించారు.

సామెతల్తో చెప్పే మాట చటుక్కున ఎక్కుతది. అదే ధోరణి అన్ని పార్టీలూ అనుసరించినప్పుడు

....

కారు సారు కేసీయారు మాట తీరు...

ఈ కాంగ్రెసోళ్లు ఎట్లాంటోళ్లంటే..‘ముచ్చటపెట్టేటాయన బిచ్చం బెట్టడు. ఊరబిస్కెను గోసి ఊరంత పంచుతనంటడు’. ఈళ్ల పనితీరు ఎట్లుంటదంటే..‘పప్పుల ఉప్పేసెటప్పుడు చెప్పెయ్యే కోడలా అంటే..కాళ్ల ఏసుకునే చెప్పేసి అత్తకు ‘తాత సంపాయించిన ఆస్తి.. మన వడితో మట్టిపాలు’ అన్నట్టుగా అమ్ముకుని తింటున్నది మా హయాంలో జరిగిన అభివృద్ధినే కదా.

....

ఇగ పువ్వు పార్టీలోళ్లు అచ్చం సంప్రదాయాలే మాట్లాడతరు. ‘ఆకు ఇస్తే అన్నం పెట్టినంత పున్నెం’ అనుకుంట ఆకే ఇస్తరు గని అన్నం పెట్టరు. మనమేదన్న మర్యాద జెయ్యబోతె..‘అల్లుడొచ్చిండని కల్లు దెస్తె నీసులేదని కేసు పెట్టినట్టు’ సీబీఐ, ఈడీలతోని కేసులు పెట్టిస్తరు. అన్నింటికి ట్యాక్సులేసి ‘ఇంటి ఎద్దుకు కూడ కిరాయికట్టమంటరు’. ‘ఆటాపాటా మా ఇంట్ల... మాపటి బువ్వ మీ ఇంట్ల’ అంటరు.

ఇస్తర్ల అంచుకుపెడతరు’. ఇగ ఈళ్ల కత ఎట్లుంటదో తెలుసా? కర్ణాటకల 20 గంటలు కరెంటిస్తనన్నరు. ఇప్పుడు కటకట బడ్తున్నరు. ‘ఏం లేనోనికి ఎచ్చులెక్కువ..చిన్నకుండలో అన్నానికి పొంగులెక్కువ’. ఇంగ వాళ్ల పార్టీలో సీఎమ్ములెక్కువై.. ‘సచ్చినపామును కొట్టడానికి అందరూ సిపాయిలే’.



....

ఇగ ఈ పువ్వుపార్టీవోళ్లయితే ఏ రాష్ట్రంల ఎవడు ఏ పార్టీల గెలిసినా వాళ్ల కొని.. ‘ఎక్కడ మేస్తె ఏంది, మా ఇంట్లె ఈన్తె సాలు, మా సావిట్లె పాలిస్తె సాలు’ అంటరు. మా ఎమ్మెల్యేలను కూడా కొనబోయిన్రు కదా. ‘ఆగబోగాలు అంకాళమ్మవైతే... పొలికేకలు పోలేరమ్మవి’ అన్నట్టు ఎదుటి పార్టీ ఎమ్మెల్యేలతో ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తరు. ఆ కొనుడు కూడా ‘ఎర్రను చూపిచ్చి, చాపను పట్కపోతరు’. వీళ్లకంతా ఆస్తులు అమ్ముకోవడమే పని. ‘కతలమారి మొగుడు కమ్మలు జేయిస్తె... అప్పుల గల మొగుడు అమ్ముకుతింటడు’ బాపతు ఈ పార్టీ. ఇసొంటోళ్లను ఎన్నుకోకండి. ‘సంకకు ఎక్కిన పిల్ల సచ్చినా దిగడ’ని గుర్తుంచుకోండి.

ఇదే స్టైల్లో... కాంగ్రెస్‌వాళ్ల సభల మాటల తీరు...

తెలంగాణ మేమే ఇచ్చినా.. ఇప్పిచ్చినాయనే మీకు ముద్దొచ్చిండు. ఏమైంది? ‘ఎద్దును చూస్తె ముద్దొస్తదీ, దున్నబోతె దుక్కమొస్తది’ అన్నట్టయింది. ఇచ్చిన మమ్మల్నే ఇడిసిపెట్టి ‘నవ్వుకుంట తిడితిరి..నరకాన బడ్తిరి’. అందుకే ‘ఊరికి పొయ్యేటోన్ని ఇడిసిపెట్టి, నిద్రపొయ్యేటోనికి సద్దిగట్టకుర్రి’. వాళ్లను ఎన్నుకున్రా..ఏమైతది? ‘జీవి ఇడిసిందాక మంచినీళ్లుగూడ పొయ్యేజాలనోళ్లు.. సచ్చింతర్వాత మీ బొందమీద పాలిచ్చే బర్రెను కట్టేస్తా’ అన్నట్టే ఉంటది. దీనికి నిదర్శనమే రూ. 400కు సిలిండరు. మరి అంతగనం ఇచ్చేటోళ్లు మేము రూ.500 అన్నదాక ఎందుకియ్యలే. ఇప్పుడు వీళ్లైనా, ఆ పువ్వు పార్టీవోళ్లైనా

ఇప్పుడు పువ్వుపార్టీవాళ్ల ప్రసంగాలు...

మాది పువ్వు గుర్తు. మేము ఆవు పార్టీ. ‘ఆవు పాలల్ల అరవైఆరు పిండివంటలు’ ఉంటయి. అందుకే ఎవడన్న ‘ఆవును ఇచ్చి... పలుపు దాచుకుంటడా?’ అట్లాంటి పని ఎప్పుడూ చేయకండి. ‘ఆవులేని ఇంట అన్నమే తినవద్దు’ అంటరు. అట్లాంటిది మన సొంత రాష్ట్రంలో ఆవు పార్టీని లేకుండా చేసుకుంటరా..మీరే చెప్పండి.

అప్పుడు జనాలు...

మా బతుకులన్నీ ‘ఎంత పెరిగినా గానీ...గొర్రెకు బెత్తెడే తోక’ అన్నట్టు. ప్రతిపూటా మా ‘గతిలేనోళ్లకు గంగే పాయసం’. ఎంత చెడ్డా మీరంత ఒక్కటే. ‘ఈత కాయ ఇచ్చినట్టే ఇచ్చి..తాటికాయ తీసుకుంటరు’. ‘అన్నం పెడితే అరిగిపోతది..చీరె ఇస్తె చినిగిపోతది..వాత పెడ్తె కలకాలం ఉంటది’ అని మాకు వాతలు బెడతరు. మీ ధోరణంతా ‘ఆశ గలమ్మ దోషమెరగదూ... పూటకూళ్లమ్మ పుణ్ణెమెరగదు’లా అందరూ అందరే. అందరూ ఒక్కటే. అందుకే ‘కర్రుగాల్చి వాత పెట్టాలె’. అది ఎవరికి పెడతామో చూద్దురుగానీ.

పంచతంత్రం


బరిలో డిగ్గీ సొంత సైన్యం!

మధ్యప్రదేశ్ బరిలో దిగ్విజయ్ కుటుంబం నుంచి నలుగురు

కొడుకు, తమ్ముడు, అల్లుళ్లకు టికెట్లు

కాంగ్రెస్ కుటుంబ పాలనకు నిదర్శనం: బీజేపీ

మధ్యప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయాలపై తన పట్టును మాజీ రాజ కుటుంబీకుడు దిగ్విజయ్‌సింగ్ మరోసారి నిరూపించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కుమారుడు, తమ్ముడు, అల్లుళ్లు... ఇలా ఏకంగా నలుగురికి టికెట్లు దక్కడం విశేషం! దీన్ని కాంగ్రెస్ వ్యక్తి పూజకు, కుటుంబ పాలనకు మరో నిదర్శనంగా ఎప్పట్లాగే బీజేపీ ఎద్దేవా చేస్తుండగా సమర్థులకే అవకాశాలిస్తున్నామంటూ కాంగ్రెస్ సమర్థించుకుంటోంది...



దిగ్విజయ్

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ ఇటీవల విడు దల చేసిన మధ్యప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయా లపై తన పట్టును మా జీ రాజ కుటుంబీకుడు దిగ్వి జయ్‌సింగ్ మరోసారి నిరూపించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కుమారుడు, తమ్ముడు, అల్లుళ్లు... ఇలా ఏకంగా నలుగురికి టికెట్లు దక్కడం విశేషం! దీన్ని కాంగ్రెస్ వ్యక్తి పూజకు, కుటుంబ పాలనకు మరో నిదర్శనంగా ఎప్పట్లాగే బీజేపీ ఎద్దేవా చేస్తుండగా సమర్థులకే అవకాశాలిస్తున్నామంటూ కాంగ్రెస్ సమర్థించుకుంటోంది...తొలి జాబితా చాలా కారణాలతో వార్తల్లో నిలిచింది. అయితే అందరినీ ఆకర్షించింది మాత్రం పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ కుటుంబంలో ఏకంగా నలుగురికి టికెట్లు దక్కడం! వివాదాస్పదుడైన సోదరుడు లక్ష్మణ్‌సింగ్‌తో పాటు కుమారుడు జైవర్ధన్, అల్లుడు ప్రియవ్రత్, అదే వరుసయ్యే అజయ్‌సింగ్ రాహుల్ పేర్లకు జాబితాలో చోటు దక్కింది.

అజయ్‌సింగ్ రాహుల్



68 ఏళ్లు. దిగ్విజయ్‌కి వరసకు కోడలి భర్త. రక్త సంబంధీకుడు కాకున్నా డిగ్గీకి అత్యంత విశ్వాసపాత్రుడు. ఐదుసార్లు ఎమ్మెల్యే. వింధ్య ప్రాంతంలో గట్టి పట్టున్న నాయకుడు. ముఖ్యంగా సిద్ధి జిల్లాపై పలు దశాబ్దాలుగా రాజకీయ పెత్తనం ఆయన కుటుంబానిదే.

‘మధ్యప్రదేశ్ ప్రజలకు కాంగ్రెస్ ఇవ్వగలిగింది కేవలం కుటుంబ పాలన మాత్రమేనని దిగ్విజయ్ ఉదంతం మరోసారి నిరూపించింది. ఇది కాంగ్రెస్ రక్తంలోనే ఉంది. నా కుమారుడు ఆకాశ్ తనకు టికెటివ్వొద్దని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు స్వయంగా విజ్ఞప్తి చేశారు. ఇవీ మా పార్టీ పాటించే విలువలు!’

– బీజేపీ ప్రధాన కార్యదర్శి, మధ్యప్రదేశ్‌లో పార్టీ సీనియర్ నేత.

లక్ష్మణ్‌సింగ్



68 ఏళ్లు. దిగ్విజయ్ తమ్ముడు. మూడుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. 1990లో రాజకీయాల్లోకి వచ్చారు. వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. సొంత పార్టీనీ వదలకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటారు! 2004లో బీజేపీలో చేరి రాజ్‌గఢ్ నుంచి అసెంబ్లీకి గెలిచారు. 2010లో నాటి బీజేపీ అధ్యక్షుడు నితిన్ గడ్కరీని విమర్శించి బహిష్కారానికి గురయ్యారు. 2018లో రాష్ట్ర రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చి కాంగ్రెస్ నుంచి మళ్లీ ఎమ్మెల్యేగా నెగ్గారు.

ప్రియవ్రత్‌సింగ్



45 ఏళ్లు. దిగ్విజయ్ మేనల్లుడు. కిల్చీపూర్ సంస్థాన వారసుడు. ఆ స్థానం నుంచే 2003లో అసెంబ్లీకి వెళ్లారు. అభివృద్ధి పనులతో ఆకట్టుకుని 2008లో మళ్లీ నెగ్గారు. 2013లో ఓడినా 2018లో మంచి మెజారిటీతో గెలిచారు. కమల్‌నాథ్ మంత్రివర్గంలో ఇంధన శాఖ దక్కించుకున్నారు.

జైవర్ధన్‌సింగ్



37 ఏళ్లు. దిగ్విజయ్ కుమారుడు. గ్వాలియర్–చంబల్ ప్రాంతంలో సింధియాల కంచుకోటలను చేజిక్కించుకోవడంపై ఈసారి దృష్టి సారించారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి మారి కేంద్ర మంత్రి పదవి పొందిన జ్యోతిరాదిత్య సింధియా అనుయాయుల్లో పలువురిని ఇటీవల కాంగ్రెస్ గూటికి చేర్చారు. డూన్ స్కూల్లో చదివిన ఆయన కొలంబియా వర్సిటీలో మాస్టర్స్ చేశారు. 2013లో రాజకీయాల్లో అడుగు పెట్టారు. తమ మాజీ సంస్థానమైన రాఘవ్‌గఢ్ అసెంబ్లీ స్థానం నుంచి 59 వేల పైచిలుకు మెజారిటీతో నెగ్గారు. 2018లో దాన్ని 64 వేలకు పెంచుకోవడమే గాక కమల్‌నాథ్ మంత్రివర్గంలో చోటు కూడా దక్కించుకున్నారు.

కాంగ్రెస్‌తో కలిసి ఉండలేం

లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుపై పునరాలోచన చేస్తాం

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ: విపక్ష ‘ఇండియా’ కూటమిలో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు చిచ్చు పెట్టే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తమను పట్టించుకోకుండా ఏకపక్షంగా 144 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేయడం పట్ల సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో కలిసి పని చేసే పరిస్థితి లేనప్పుడు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో చేతులు కలిపే అంశాన్ని పునఃపరిశీలించాల్సి ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. తమతో వారి (కాంగ్రెస్) ప్రవర్తన లాగే వారితో తమ ప్రవర్తన ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలను మోసగిస్తోందని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పోటీ చేస్తున్న స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. 18 స్థానాల్లో ఈ రెండు పార్టీలు పరస్పరం బలంగా పోటీ పడుతున్నాయి. దీంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోయి అధికార బీజేపీ లాభపడుతుందని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల నాయకులు ఆందోళన చెందుతున్నారు. మధ్యప్రదేశ్‌లో తమకు తగిన బలం ఉందని, గతంలో రెండో స్థానంలో నిలిచామని అఖిలేష్ యాదవ్ గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా ఆరు స్థానాలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, చివరకు మొండిచెయ్యి చూపిందని ఆరోపించారు.



మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం కోసం బీజేపీ రంగంలోకి దించిన హై టెక్ వాహనాలివి. భోపాల్‌లో గురువారం వీటిని సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ జెండా ఊపి ప్రారంభించారు.

కాంగ్రెస్ నక్సలిజాన్ని ప్రోత్సహిస్తోంది

బీజేపీకి అధికారమిస్తే రాష్ట్రాన్ని ఈ బెడద నుంచి విముక్తం చేస్తాం


ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ర్యాలీలో హోం మంత్రి అమిత్ షా



జగదల్‌పూర్: కాంగ్రెస్ పార్టీ నక్సలిజాన్ని ప్రోత్సహిస్తోందని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. ప్రధాని మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో వామపక్ష తీవ్రవాద ఘటనలు 52 శాతం మేర తగ్గుముఖం పట్టాయని ఆయన చెప్పారు. ఛత్తీస్‌గఢ్ సీఎం భగేల్ రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు ఏటీఎంగా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలన స్కాముల ప్రభుత్వంగా తయారైందని పేర్కొన్నారు. జగదల్‌పూర్, కొండగావ్‌లలో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీల్లో అమిత్ షా మాట్లాడారు. ‘రాష్ట్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని అర్థించటానికే మీ ముందుకు వచ్చా. స్కాములకు పాల్పడటం ద్వారా గిరిజనుల డబ్బును దోచుకున్నవారిని తలకిందులుగా వేలాడదీస్తాం’అని ఆయన అన్నారు. బీజేపీకే ఓటు వేయాలని ప్రజలను కోరిన అమిత్ షా, ‘మీ ముందు రెండు అవకాశాలున్నాయి..ఒకటి నక్సలిజాన్ని ప్రోత్సహించే కాంగ్రెస్, మరోవైపు, ఈ బెడదను నిర్మూలించే బీజేపీ. కోట్లాది రూపాయల అవినీతి సొమ్మును ఢిల్లీ దర్బార్‌కు పంపే కాంగ్రెస్.. కోట్లాది మంది పేదలకు గ్యాస్ సిలిండర్లు, మరుగుదొడ్లు, తాగు నీరు, ఆరోగ్య సదుపాయాలు, రేషన్, ఇళ్లు అందజేస్తున్న బీజేపీ. ఈ రెండింట్లో మీరు ఏ ప్రభుత్వాన్ని కోరుకుంటారు?’అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ ప్రజలు దీపావళి పండుగను ఈసారి మూడుసార్లు జరుపుకుంటారంటూ... మొదటిది దీపావళి రోజున, రెండోది డిసెంబర్ 3న రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక, మూడోది జనవరిలో అయోధ్య రామాలయ నిర్మాణం పూర్తయ్యాక (శ్రీరాముడి మాతామహుల నివాసం ఛత్తీస్‌గఢ్ అని ప్రజల విశ్వాసం)అని అమిత్ షా చెప్పారు. ‘రాష్ట్రంలో బీజేపీకి అధికారమిస్తే, ఈ బెడద నుంచి పూర్తిగా విముక్తి కల్పిస్తాం. మోదీ ప్రభుత్వ పాలనలో 9 ఏళ్ల కాలంలో నక్సల్ సంబంధ హింస 52% తగ్గగా నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 62% మేర క్షీణించింది’అని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో జరిగే తీవ్రవాద సంబంధ హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయే పోలీసులైనా, పౌరులైనా, నక్సలైట్లయినా అందరూ గిరిజనులేనని ఆయన చెప్పారు.

ముఖ్యమంత్రి పదవి నన్ను వదులుకోదు

• రాజస్తాన్ సీఎం గహ్లోత్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి పదవి వదులుకోవాలని తాను అనుకుంటున్నప్పటికీ ఆ పదవి తనను వదిలి పెట్టబోదని రాజస్తాన్ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గహ్లోత్ వ్యాఖ్యానించారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ తానే ముఖ్యమంత్రి అవుతానని పరోక్షంగా తేల్చిచెప్పారు. సీఎం పదవిపై ఆశలు పెట్టుకోవద్దంటూ పార్టీలో తన ప్రత్యర్థి అయిన సచిన్ పైలట్‌కు నర్మగర్భంగా సూచించారు. గహ్లోత్ గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ‘దేవుడి దయతో మీరు నాలుగోసారి ముఖ్యమంత్రి అవుతారని ఓ మహిళా నాతో చెప్పింది. ముఖ్యమంత్రి పోస్టు వదులుకోవాలని నేను అనుకుంటున్నా అది నన్ను వదలడం లేదని ఆమెతో చెప్పా. ఇక ఎప్పటికీ ఆ పదవి నన్ను వదలకపోవచ్చు’ అని గహ్లోత్ వెల్లడించారు. రాజస్తాన్‌లో సీఎం పోస్టు కోసం ఈసారి సచిన్ పైలట్ గట్టిగా పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో గహ్లోత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు బయటపడ్డాయని ప్రత్యర్థులు అంటున్నారు. ఎవరికి టికెట్లు ఇచ్చినా అభ్యంతరం లేదు. ఎవరికి టికెట్లు ఇచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. పైలట్ వర్గం సహా అందరితో చర్చించి, అభ్యర్థులను ఖరారు చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి పదవిని ఎవరికి అప్పగించాలో పార్టీ నాయకత్వమే నిర్ణయిస్తుందని, పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో తాము చేసిన అభివృద్ధే తమ పార్టీని గెలిపిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి పదవి వదులుకుంటానని చెప్పే ధైర్యం దేశంలో ఎంతమంది సీఎంలకు ఉందని ప్రశ్నించారు. రాజస్తాన్‌లో నవంబర్ 25న ఎన్నికలు జరగనున్నాయి.

కాంగ్రెస్ వస్తే పథకాలు ఆగిపోతాయి: శివరాజ్‌సింగ్

భోపాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ‘లాడ్లీ బెహన యోజన’ వంటి సంక్షేమ పథకాలు ఆగిపోతాయని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓటర్లను అప్రమత్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ఈ పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. లబ్ధిదారులకు అందాల్సిన సొమ్ము ఇవ్వడంలో తప్పేముందని ప్రశ్నించారు. చౌహాన్ గురువారం ఝాబౌ జిల్లాలో థాండ్లా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఆ పార్టీకి అధికారం అప్పగిస్తే ప్రజల పరిస్థితి అధోగతేనని అన్నారు. లాడ్లీ బెహన యోజన కింద లబ్ధిదారులకు ప్రతినెలా రూ.1,250 చొప్పున అందజేస్తున్నామని, ఇది చూసి కాంగ్రెస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని చౌహాన్ మండిపడ్డారు.

క్లుప్తంగా...

మోదీ ఫోన్ చేసి చెప్పారు: ఇంద్రసేనారెడ్డి

మలక్‌పేట: ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం పాటుపడతానని, తనకున్న అనుభవంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి చెప్పారు. ఆయన త్రిపుర గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా బంజారాహిల్స్‌లోని నివాసం నుంచి గురువారం మలక్‌పేట సలీం నగర్‌లోని స్వగృహానికి వచ్చారు. మలక్‌పేట పాత నియోజక వర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'బుధవారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీ నాకు ఫోన్ చేసి గవర్నర్ నియామకం గురించి చెప్పారు. నేను ఆయనకు ధన్యవాదాలు అని తెలిపాను. గురువారం ఉదయం త్రిపుర గవర్నర్ ఆఫీస్ నుంచి కూడా ఫోన్ వచ్చింది. బీజేపీలో కార్యకర్తలుగా పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందనడానికి నా నియామకమే ఒక నిదర్శనం. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన మలక్‌పేట ప్రజలకు ఈ గుర్తింపు దక్కుతుంది. మలక్‌పేట ప్రజలకు ఎప్పటికీ కృతజ్ఞత కలిగి ఉంటాను' అని చెప్పారు.

కోవింద్, వెంకయ్య శుభాకాంక్షలు

త్రిపుర గవర్నర్‌గా నియమితులైన ఇంద్రసేనారెడ్డికి మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు, మాజీ ఎంపీ టి.దేవేందర్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు ఆయనకు ఫోన్‌లో అభినందనలు తెలిపారు.

ఇంద్రసేనారెడ్డికి గవర్నర్ పదవి ఇవ్వడం ఎన్నికల ఉల్లంఘనే

టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్



సాక్షి,హైదరాబాద్: రాష్ట్రపతిభవన్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ తెలంగాణకు చెందిన నల్లు ఇంద్రసేనారెడ్డిని త్రిపుర గవర్నర్‌గా నియమించిందని, దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ తెలిపారు. ఈసీ వెంటనే స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన కోరారు. దేశంలో ఎన్నికల కోడ్ అందరికీ సమానంగా వర్తిస్తుందా లేదా అనే అంశంపై వివరణ ఇవ్వాలన్నారు.

మామిళ్ల రాజేందర్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు ఆమోదం

సాక్షి,హైదరాబాద్: టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు చేసిన దరఖాస్తును రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆమోదించింది. ఈ మేరకు పబ్లిక్ అండ్ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆఫీసు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజేందర్ శుక్రవారం విధుల నుంచి రిలీవ్ కానున్నారు. కాగా ఆయన దరఖాస్తును ప్రభుత్వం ఆమోదించిన నేపథ్యంలో రాజేందర్ రాజకీయ ప్రవేశానికి లైన్ క్లియర్ అయింది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన రాజేందర్ శనివారం బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరనున్నారు. సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన రాజేందర్‌కు ఎన్నికల ప్రచార బాధ్యతను అప్పగించే అవకాశం ఉంది.

సైబర్ నేరాలకు పరిష్కారం చెబితే రూ.లక్ష

సాక్షి, హైదరాబాద్: నాలుగో ఆల్ ఇండియా సైబర్‌థాన్–2023లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బృందానికి రూ.లక్ష బహుమతి ఇవ్వనున్నట్టు చండీగఢ్ పోలీసులు ప్రకటించారు. సైబర్ నేరాల నియంత్రణ, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సైబర్‌థాన్‌ను ఇన్ఫోసిస్, చండీగఢ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో కళాశాల విద్యార్థుల బృందాలతోపాటు పోలీస్ బృందాలు సైతం పాల్గొనవచ్చు. దరఖాస్తులు పంపేందుకు ఈనెల 26 గడువుగా నిర్వాహకులు పేర్కొన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు పరిష్కారాలు సమర్పించేందుకు నవంబర్ 5 వరకు గడువుంది. ఎంపికైన బృందాలకు ఆఖరి ఈవెంట్‌ను నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహిస్తారు. కళాశాల విద్యార్థుల విభాగంలో మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.75 వేలు, మూడో బహుమతిగా రూ.50 వేలు.. పోలీస్ బృందాల్లో ఉత్తమ బృందానికి రూ.75 వేలు బహుమతి అందజేస్తారు. అర్హులైన, ఆసక్తి ఉన్నవారు https://chandigarhpolice.gov.in/cyberthon.htmlలో సంప్రదించాలని సూచించారు.

వెలిగొండ ప్రాజెక్టు పనులను అడ్డుకోండి

కృష్ణా బోర్డుకు తెలంగాణ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం అర్ధవీడు మండలంలోని రెండు ఎత్తిపోతల పథకాల నిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం రూ.51.16 కోట్లతో పాలనపరమైన అనుమతులు జారీ చేయడం పట్ల తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్–1 అవార్డు, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను వెంటనే ఆపాలని ఆ దిశగా ఏపీని నిలువరించాలని కృష్ణా బోర్డుకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ గురువారం కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు.

నాకు పదవొస్తే కాంగ్రెస్‌కు ఎందుకంత భయం?

సీఈవోకి ఎందుకు ఫిర్యాదు చేశారో అర్థం కావడం లేదు

బీజేపీకి బీసీలే అండగా నిలుస్తారు, ఇతర వర్గాలూ దన్నుగా ఉంటాయి

ఎమ్మెల్యేలు ఆస్తులు వెల్లడించాల్సి రావడం నా ప్రశ్నతోనే మొదలైంది

అంకితభావంతో పనిచేస్తే పార్టీలో కచ్చితంగా గుర్తింపు వస్తుంది

త్రిపుర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనారెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ పదవిలో తనను నియమిస్తే కాంగ్రెస్ పార్టీ ఎందుకంత భయాందోళనలకు గురై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కు ఫిర్యాదు చేసిందో అర్థం కావడం లేదని త్రిపుర గవర్నర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్‌నేత నల్లు ఇంద్రసేనారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం పార్టీ పక్షాన ఎన్నికల సన్నద్ధతలో కీలకంగా వ్యవహరిస్తున్న తనను మరో రాష్ట్రానికి గవర్నర్‌గా నియమిస్తే సంతోషపడాలే కాని భయంతో ఉన్నారంటే ఇక్కడున్న పరిస్థితులు అర్థమవుతున్నాయన్నారు. ఇప్పటికే బీసీలు బీజేపీ వైపు ఉండగా, రెడ్డిగా తనకు ఈ పదవి ఇవ్వడం వల్ల ఈ సామాజికవర్గం ఓట్లు కూడా బీజేపీకే పడతాయనే భయంతో కాంగ్రెస్ ఉన్నట్టు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం బీఆర్ఎస్ సర్కార్‌పై వివిధ వర్గాల ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందని, ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమి తథ్యమని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌పార్టీని ప్రజలు విశ్వసించే పరిస్థితే లేదన్నారు. తనకు ఈ పదవి లభించడం పట్ల సుదూర ప్రాంతాల నుంచి కార్యకర్తలు ఫోన్ చేసి అభినందించడం, వారిలో నూతనోత్సాహం వెల్లివిరియడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి అంకితభావంతో పనిచేస్తే బీజేపీలో తప్పకుండా గుర్తింపు లభిస్తుందనడానికి గవర్నర్‌గా తన నియామకం స్పష్టం చేస్తుందన్నారు. నియామకపత్రాలు అందాక ఈ నెల 24న లేదా 26న పదవీబాధ్యతలను స్వీకరించే విషయంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా సాక్షికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అనేక అంశాలపై ఆయన మాట్లాడారు.

సాక్షి: మీ రాజకీయ జీవితంలో సాధించిన విజయాలు, గుర్తుండిపోయే సందర్భాలు ఏమిటి?

ఇంద్రసేనారెడ్డి: 1983 అసెంబ్లీ ఎన్నికల్లో (33 ఏళ్ల వయసులో) నాటి హోంమంత్రి కె.ప్రభాకర్‌రెడ్డిని, 1985 ఎన్నికల్లో నాటి ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావును ఓడించి సంచలనం సృష్టించాను. 1985లో గెలిచాక కొత్త అసెంబ్లీ భవనంలోకి మారాక జరిగిన తొలిరోజు సభలో నేను వేసిన మొట్టమొదటి ప్రశ్న మంత్రులు తమ ఆస్తులను ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరాను. దానిపై అప్పటి సీఎం ఎన్టీరామారావు ఆవేశంగా స్పందిస్తూ...ఒక్క మంత్రులే కాదు, ఎమ్మెల్యేలంతా కూడా ప్రతీ ఏడాది తమ ఆస్తులు, అప్పులకు సంబంధించిన బ్యాలెన్స్ షీటు సమర్పించేలా ఆదేశిస్తామన్నారు. దీనినే ఈసీ కూడా పరిగణనలోకి తీసుకుని ఎన్నికల నామినేషన్ల సమర్పణకు ముందు ఆస్తులకు సంబంధించిన అఫిడవిట్‌ను సమర్పించడం తప్పనిసరి చేసింది. దీనికి నా ప్రశ్నే కారణం కావడం గర్వంగా ఉంది. అసెంబ్లీ కమిటీల్లోనూ కీలకపాత్ర పోషించి కొంతమంది ఉన్నతాధికారులు సైతం తమ తప్పులను సరిదిద్దుకునే పరిస్థితిని కల్పించిన సందర్భాలున్నాయి.

సాక్షి: బీజేపీలో పలువురు నేతలు ఎమ్మెల్యే అయ్యాక ఎంపీగా, కేంద్రమంత్రిగా ప్రమోషన్ పొందారు? మీకు అది వెలితి అనిపించిందా ?

ఇంద్రసేనారెడ్డి: ఎంపీగా వెళితే మరింత విస్తృతంగా ప్రజలకు సేవ చేయొచ్చునని భావించాను. కానీ అది సాధ్యం కాలేదు. 1980లోనే బీజేపీ తరఫున నల్లగొండ నుంచి లోక్‌సభకు పోటీచేసి ఓటమి చవిచూశాను. ఆ తర్వాత పలుమార్లు ఎంపీగా పోటీచేసినా విజయం సాధించలేకపోయాను. 2014లో చివరిసారిగా భువనగిరి నుంచి ఓడిపోయాక ఎన్నికల రాజకీయాల నుంచి వైదొలిగాను. అప్పటి నుంచి సంస్థాగతంగా పార్టీ కార్యకలాపాలు, కార్యక్రమాల సమన్వయం తదితర విషయాల్లో నా రాజకీయ అనుభవాన్ని ఉపయోగించి ట్రబుల్ షూటర్‌గా నిలిచాను. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా పార్టీపరంగా పూర్తి సమన్వయ బాధ్యతలను నిర్వహిస్తున్నాను.

సాక్షి: మీ రాజకీయ జీవితం ఎలా ప్రారంభమైంది?

ఇంద్రసేనారెడ్డి : 1968, 69 నుంచి ఏబీవీపీలో, అంతకు ముందు విద్యార్థిగా ఆరెస్సెస్‌లో తిరిగాను. 1975 ఎమర్జెన్సీ విధించాక మీసా కింద అరెస్టయి జైలుకు కూడా వెళ్లాను. 1977లో లోక్‌నాయక్ జయప్రకాశ్ ప్రారంభించిన ఉద్యమంలో భాగస్వామి అయ్యాను. జనతాపార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించాను. 1980లో బీజేపీలో చేరి కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి 1983, 1985, 1999లలో మలక్‌పేట నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యాను. బీజేఎల్పీనేతగా వ్యవహరించా. ఆ తర్వాత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా, జాతీయ కార్యదర్శిగా ఉన్నా. ప్రస్తుతం జాతీయకార్యవర్గసభ్యుడిగా కొనసాగుతున్నాను. మొత్తంగా 46 ఏళ్లుగా బీజేపీ, జనతాలతో అనుబంధం ఉంది.

సాక్షి: కీలకమైన ఎన్నికల సందర్భంలో గవర్నర్ పదవి రావడంపై ఏమంటారు?

ఇంద్రసేనారెడ్డి: ఈ పదవి ఇంకా రెండు, మూడునెలలు ఆలస్యంగా వచ్చి ఉంటే బాగుండేదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పార్టీ కృషిలో భాగస్వామినై ఉన్నాను. వివిధ కీలకబాధ్యతలను నిర్వహిస్తూ పార్టీకి ఉపయోగపడుతున్నాను.

సాక్షి: రాజ్యాంగబద్ధ పదవిని ఎలా భావిస్తున్నారు ?

ఇంద్రసేనారెడ్డి : నా మొత్తం రాజకీయజీవితంలోని అనుభవసారాన్ని అక్కడి ప్రజల సమస్యలు పరిష్కరించడంలో వెచ్చిస్తాను. రాజ్యాంగ పరిధిలో ఏ మేరకు మరింత మెరుగ్గా పనిచేయగలను, ప్రజల అభ్యున్నతికి ఎలా కృషి చేయగలను అన్నవే నా ముందున్న లక్ష్యాలు. సుదీర్ఘ రాజకీయ అనుభవం అందుకు పనికొస్తుందని విశ్వసిస్తున్నాను.

ఒకే రోజు రూ.78 కోట్ల జప్తు

రూ.57.67 కోట్ల విలువ చేసే బంగారం, వెండి, వజ్రాలు స్వాధీనం

ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు ● రూ.243.76కోట్లకు చేరిన మొత్తం జప్తు విలువ



నల్లగొండ జిల్లా చిట్యాలలో బంగారం, వెండి ఉంచిన సంచులను బయటికి తీస్తున్న పోలీసులు



పట్టుబడ్డ నగదును పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ సాయిశ్రీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు గురువారం రికార్డు స్థాయిలో రూ.78.03 కోట్లు విలువ చేసే నగదు, మద్యం, ఇతర వస్తువులను జప్తు చేశారు. దీంతో ఇప్పటి వరకు రాష్ట్రంలో జప్తు చేసిన నగదు, ఇతర వస్తువుల మొత్తం విలువ రూ.243.76 కోట్లకు పెరిగిపోయింది. కాగా, ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు రూ.87.92 కోట్లు.

ఒక్క రోజు 6వేల లీటర్ల మద్యం జప్తు

తాజాగా రూ.1.21 కోట్లు విలువ చేసే 6132 లీటర్ల మద్యం జప్తు చేశారు. దీంతో ఈ నెల 9 నుంచి ఇప్పటి వరకు జప్తు చేసిన మొత్తం మద్యం 65,223 లీటర్లు కాగా, దీని విలువ రూ.10.21 కోట్లు. గురువారం రూ.16.77లక్షలు విలువ చేసే 103.165 కిలోల గంజాయి స్వాధీనం చేసుకోగా, ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న గంజాయి 2950 కిలోలకు పెరిగింది. దీని విలువ రూ.7.72 కోట్లు. ఇప్పటి వరకు మరో రూ.7.72 కోట్లు విలువ చేసే ఇతర మత్తు పదార్థాలను జప్తు చేశారు. గురువారం రూ.57.67 కోట్లు విలువ చేసే బంగారం, వెండి, ఇతర వస్తువులు పట్టుకున్నారు.

83కిలోల బంగారం పట్టివేత

అందులో 83.046 కిలోల బంగారం, 212 కిలోల వెండి, 112.195 క్యారట్ల వజ్రాలు, 5.35 గ్రాముల ప్లాటినం ఉంది. దీంతో ఇప్పటి వరకు పట్టుబడిన బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువుల విలువ రూ.120.40 కోట్లకు ఎగబాకింది. ఇందులో 181 కిలోల బంగారం, 693కిలోల వెండి, 154.45 క్యారెట్ల వజ్రాలున్నాయి. గురువారం రూ.8.84 కోట్లు విలువ చేసే ల్యాప్‌టాప్‌లు, వాహనాలు, కుక్కర్లు, చీరలు, క్రీడా సామగ్రి తదితర వస్తువులను పట్టుకున్నారు. దీంతో ఇప్పటి వరకు పట్టుబడిన ఇలాంటి వస్తువుల విలువ రూ.17.84 కోట్లకు చేరింది.

హైవేపై రూ.750 కోట్ల నగదు కలకలం

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లా సరిహద్దులోని 44వ జాతీయ రహదారిపై ఏకంగా రూ.750 కోట్ల నగదు పట్టుబడినట్లు సామాజిక మాధ్యమాల్లో గురువారం వైరల్ అయింది. దీంతో జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఓ ప్రకటనలో వెల్లడించారు. ''రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు కేరళ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి హైదరాబాద్ యూబీఐకి నగదును బదిలీ చేస్తున్నట్టు మంగళవారం రాత్రి సమాచారం వచ్చింది. ఈ మేరకు జిల్లా నుంచి ఆర్డీఓ, లీడ్ బ్యాంక్ మేనేజర్, డీఎస్పీ అధికారులు విచారణ చేసేందుకు స్పాట్‌కు వెళ్లి, నగదుకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఆ తర్వాత పోలీస్ ఎస్కార్ట్‌తో నగదును హైదరాబాద్‌లోని యూబీఐకి చేరినట్లు నిర్ధారణ చేసుకున్నాము'' అని క్రాంతి ఆ ప్రకటనలో వివరించారు. అయితే ఎంత మేరకు నగదు ఉందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

పైసలు... తీసుకెళ్లాలంటే పరేషాన్!

వీరేందర్ హయత్‌నగర్‌లో కిరాణా స్టోర్ నిర్వహిస్తున్నాడు. దసరా సీజన్ కావడంతో దుకాణంలోకి సరుకులు తెచ్చేందుకు రెండ్రోజుల క్రితం మార్కెట్‌కు బయలుదేరాడు. చింతలకుంట సమీపంలో రహదారిపై పోలీసులు తనిఖీ చేశారు. అతని వెంట ఉన్న రూ.2.30 లక్షల నగదును సీజ్ చేశారు. కిరాణా దుకాణం నిర్వాహకుడినని, సరుకులు కొనేందుకు మార్కెట్‌కు వెళ్తున్నట్లు చెప్పినా ఫలితం లేకపోయింది. దుకాణంలో రోజువారీ సేల్స్ తాలూకు డబ్బులు కావడంతో సంబంధిత పత్రాలు లేవు. దీంతో నగదును వెనక్కు తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు.

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రధాన రహదారులపై పోలీసుల ముమ్మర తనిఖీలు.. నగదు వెంట తీసుకెళ్లేందుకు వణుకుతున్న జనం
- వ్యక్తిగత అవసరాలు, మెడికల్ తదితర బిల్లుల చెల్లింపులకు అష్టకష్టాలు
- వ్యాపారులకు ప్రహసనంగా మారిన నగదు చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో ఒక వ్యక్తి సగటున రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లే అవకాశం ఉండదు. నిర్దేశించిన మొత్తం కంటే పైసా ఎక్కువున్నా అందుకు సంబంధించిన ఆధారాలను అధికారులకు చూపించాలి. లేకుంటే సదరు నగదును సీజ్ చేస్తారు. పక్కా ఆధారాలను చూపించినప్పుడు ఆ డబ్బును రిలీజ్ చేస్తారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం.. దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన లేకపోవడంతో చాలామంది నగదును తీసుకెళ్తూ పట్టుబడుతున్న ఘటనలు అనేకం కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు కోట్లాది రూపాయలను అధికారులు సీజ్ చేశారు. ఎన్నికల సంఘం విధించిన రూ.50 వేల గరిష్ట పరిమితి నిబంధన వల్ల సామాన్యులు పలు సందర్భాల్లో ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు పెరిగినప్పటికీ చిల్లర వర్తకంలో నగదు లావాదేవీలు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. హోల్‌సేల్‌తోపాటు రిటైల్ మార్కెట్‌లోనూ నగదు లావాదేవీలు పెద్దసంఖ్యలోనే జరుగుతున్నాయి. అలా నగదు లావాదేవీలు జరిగినప్పుడు దుకాణాదారులు చాలాచోట్ల రసీదులు ఇవ్వడం లేదు. హోల్‌సేల్ దుకాణాల్లో వస్తువుల కొనుగోలుకు రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది.

డిజిటల్ లావాదేవీలు మేలు: ప్రస్తుతం దసరా పండుగ సీజన్ నడుస్తోంది. చిల్లర వ్యాపారులు పలు అవసరాలకు నగదు లావాదేవీలు సాగిస్తుంటారు. అంతేగాకుండా సరుకుల కొనుగోలుకు జనాలు సైతం నగదు తీసుకెళ్తుంటారు. ఇవేగాకుండా వైద్య, వ్యాపార అవసరాల నిమిత్తం అప్పులు తెచ్చుకోవడం లాంటివి చేస్తుంటారు. వీటికి లిఖిత పూర్వక ఆధారాలేమీ ఉండవు. చేబదులు రూపంలో తీసుకునే మొత్తానికి ఎలాంటి రసీదు ఉండదు. మరోవైపు వైద్య ఖర్చులు, శస్త్రచికిత్సల కోసం ఆస్పత్రులకు వెళ్లే వారు, కాలేజీ ఫీజులు చెల్లించే వాళ్లు తమ వెంట రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పోలీసులు చేస్తున్న తనిఖీల్లో ఎక్కువగా ఇలాంటివే ఎక్కువ వెలుగు చూస్తున్నాయి. అందువల్ల ఈ పరిస్థితుల్లో నగదును తీసుకెళ్లాల్సి ఉంటే సరైన ఆధారాలను వెంట ఉంచుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. లేకుంటే సమీప బ్యాంకులో నగదు డిపాజిట్ చేసి డిజిటల్ పద్ధతిలో డబ్బు బదిలీ చేయడం మంచిదని అంటున్నారు.



డీజీపీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర డీజీపీ కార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీజీపీ కార్యాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు డీజీపీ అంజనీకుమార్, అడిషనల్ డీజీపీలు సౌమ్యమిశ్రా, అభిలాష బిస్త్, సంజయ్‌కుమార్ జైన్, ఐజీ రమేశ్‌రెడ్డి, ముఖ్య పరిపాలనాధికారి నవనీతతోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక్కచోట పెట్టి మహిళా ఉద్యోగులు, వారి పిల్లలు ఆటపాటలతో సంబురాలు చేసుకున్నారు. ఉత్సవాలను ప్రారంభించిన డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ దేవీనవరాత్రులతో మహిళలను శక్తిరూపంగా పూజించే గొప్ప సంస్కృతి మనదన్నారు.

టీపీసీసీ కల్లు గీత కార్మికుల విభాగానికి నూతన కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: కల్లు గీత కార్మికుల విభాగానికి నూతన కార్యవర్గాన్ని టీపీసీసీ ప్రకటించింది. టీపీసీసీ కల్లు గీత కార్మికుల విభాగం చైర్మన్ నాగరాజుగౌడ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్రీకాంత్‌గౌడ్, వైస్ చైర్మన్లుగా ఎస్.మల్లయ్యగౌడ్, జి.మహేందర్‌గౌడ్, భరత్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్‌గౌడ్, స్టేట్ సెక్రటరీలుగా ప్రదీప్‌గౌడ్, యాదగిరిగౌడ్, నరేష్‌గౌడ్, సతీశ్‌గౌడ్, మధుగౌడ్, సత్యనారాయణగౌడ్, బి.సుధీర్‌గౌడ్‌లను నియమించారు.

డబ్బు, బంగారం పరిమితిపై ఎలాంటి ఆధార పత్రాలుండాలి?

- ఎన్నికల అధికారిని కోరిన ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి



సాక్షి, హైదరాబాద్: యాభై వేలకు పైగా డబ్బు తీసుకెళ్తున్నప్పుడు ఎలాంటి రుజువు పత్రాలు ఉండాలో తెలపాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ).. ఎన్నికల అధికారిని కోరింది. బంగారం ఎంత పరిమితిలో తీసుకెళ్లాలో వివరించాలని, దానికి ఎలాంటి ఆధార పత్రాలుండాలో తెలపాలని పేర్కొంది. ఈమేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. కేంద్ర ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్ ప్రకారం పట్టుకున్న బంగారం, డబ్బును కమిటీతో విచారించి 48 గంటల్లో తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ప్రజలు, వ్యాపారులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వైన్‌షాపుల యాజమానులు డబ్బులను డిపాజిట్ చేసే క్రమంలో పట్టుకుంటున్నారని వెల్లడించారు. పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో నగదును తీసుకెళ్తారని, వంశపారంపర్యంగా వచ్చిన ఆభరణాలకు రశీదులుండవని పద్మనాభరెడ్డి అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల నిబంధనల పేరుతో ప్రజలను, వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దని, వీటిపై పోలీసులు, కింది స్థాయి అధికారులకు తగిన సూచనలు, సలహాలివ్వాలని తెలిపారు. నేరస్తులను పట్టుకోవాలని, అమాయకులను ఇబ్బంది పెట్టొద్దని సీఈవోను కోరారు.

దేశ భవిష్యత్ ఉన్నతిలో నారీశక్తి కీలకం


- ఫిక్కీ చర్చా కార్యక్రమంలో కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ



సాక్షి, హైదరాబాద్: దేశ ఉన్నతిలో, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికల్లో మహిళల ప్రాతినిధ్యం కీలకంగా మారనుందని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖమంత్రి స్మృతీ జుబిన్ ఇరానీ అన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూసిన మహిళా రిజర్వేషన్.. నారీశక్తి రూపంలో కార్యరూపం దాల్చడం తమ ప్రయత్నానికి మరింత శక్తి అందిస్తుందని పేర్కొన్నారు. నగరంలోని ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో గురువారం హోటల్ తాజ్ డెక్కన్ వేదికగా 'ఫ్యూచర్ రోల్ ఆఫ్ వుమెన్ ఇన్ ఇండియా' అనే అంశంపైన చర్చా వేదికను ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో స్మృతీ ఇరానీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ శ్రీరామ్ కర్రి మోడరేటర్‌గా వ్యవహరించగా, ఫిక్కీ చైర్‌పర్సన్ రీతూషా, ఫిక్కీ సభ్యులు పాల్గొన్నారు. స్మృతీ ఇరానీ మాట్లాడుతూ 'రాజ్యాంగబద్ధమైన మహిళా సాధికారతకు నారీశక్తి మహిళా రిజర్వేషన్ ఒక నిదర్శనం. మహిళలకు రాజకీయాల్లో, చట్టసభలతో పాటు అన్ని రంగాల్లో రాణించడానికి స్వేచ్ఛ, స్వతంత్రత అందించే నారీశక్తి ఎంతో అవసరం. 50 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రధానమంత్రి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. జీవితంలో ఒడిదొడుకులు కచ్చితంగా ఉంటాయి. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పుడే సంపూర్ణమైన జీవితాన్ని చూస్తాం. దీనిపై 12 ఏళ్ల వయసు నుంచే కుటుంబ సభ్యులు అవగాహన కల్పించారు. నటిగా, రాజకీయ నాయకురాలిగా, సామాజిక వేత్తగా ఎన్ని రంగాల్లో సేవలందించినా వ్యక్తిగతంగానే జీవితాన్ని ఎక్కువగా ఆస్వాదిస్తా. రోజులో 18 గంటలు పని చేయడం అలవాటు. విద్యార్థి దశ నుంచే అథ్లెట్‌గా జిల్లా స్థాయిలో, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాను' అని వ్యాఖ్యానించారు.

మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోండి..

ఏపీ, తెలంగాణ విద్యుత్ బకాయిల కేసులో హైకోర్టు తీర్పు



- ఏపీకి తెలంగాణ రూ.6,756.92 కోట్లు చెల్లించాలంటూ కేంద్రం ఇచ్చిన నోటీసుల కొట్టివేత
- కేంద్ర ప్రభుత్వానిది కఠిన నిర్ణయమన్న తెలంగాణ
- విభజన చట్టంతో సంబంధంలేదన్న ఏపీ
- సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పు వెల్లడించిన సీజే ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న రూ.6,756.92 కోట్ల విద్యుత్ బకాయిల వివాదంలో కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. 30 రోజుల్లోగా ఏపీకి రూ.6,756.92 కోట్లు (అసలు 3,441.78 కోట్లు, వడ్డీ, సర్‌చార్జీలు కలిపి మరో రూ.3,315.14 కోట్లు) చెల్లించాలంటూ 2022, ఆగస్టు 29న కేంద్రం తెలంగాణకు ఇచ్చిన నోటీసులను కొట్టివేసింది. ఇరు రాష్ట్రాలు మధ్యవర్తిత్వం ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవాలని చెప్పింది. తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థలు.. అలాగే ఏపీ ప్రభుత్వం, విద్యుదుత్పత్తి సంస్థలు మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యపూర్వకంగా ఈ అంశాన్ని పరిష్కరించుకుంటాయని ఆశిస్తున్నట్లు పేర్కొంది. చట్టప్రకారం అందుబాటులో ఉన్న పరిష్కారాన్ని ఆశ్రయించే స్వేచ్ఛను ఇరు పక్షాలకు ఇస్తున్నామంది. తెలంగాణ వాదన కూడా వినకుండా కేంద్రం నోటీసులు జారీచేయడాన్ని తప్పుబట్టింది.

వివాదం ఏంటంటే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ జెన్‌కో/ట్రాన్స్‌కో/డిస్కమ్‌లు 2000 నుంచి 2013 వరకు పలు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏలు) చేసుకున్నాయి. ఇవి రాష్ట్ర విభజన తర్వాత 2019 వరకు కొనసాగాయి. విభజన తర్వాత కేంద్రం ఆదేశాల మేరకు 2014 నుంచి 2017 వరకు తెలంగాణకు ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ సరఫరా చేశాయి. దీనికైన మొత్తాన్ని చెల్లించాలని ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థలు కొన్నేళ్లుగా కోరుతున్నాయి. ఈ వివాదం కేంద్రం వద్దకు చేరడంతో రూ.6,756.92 కోట్ల బకాయిలను ఏపీకి చెల్లించాలని తెలంగాణకు విభజన చట్టం సెక్షన్ 92 కింద నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ తెలంగాణ డిస్కంలు, తెలంగాణ సర్కార్ 2022 సెప్టెంబర్‌లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. అలాగే ఆర్‌బీఐలోనే తమ రాష్ట్ర ఖాతా నుంచి బకాయి మొత్తాన్ని మినహాయించుకొని ఆంధ్రప్రదేశ్‌కు చెల్లించే ప్రయత్నం కేంద్రం చేస్తున్నట్లు తెలిసిందని.. దీనిపై నిర్ణయం తీసుకోకుండా ఆదేశాలివ్వాలని తెలంగాణ సర్కార్ కోరింది. దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం రెండు వారాల క్రితం తీర్పును రిజర్వు చేసి.. గురువారం తుది ఉత్తర్వులు వెలువరించింది.

కేంద్రం వైఖరి సమంజసం కాదు: తెలంగాణ

తెలంగాణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యలపై ముందుగా చర్చించాలని చెప్పారు. దీనిపై పూర్తిగా చర్చించకపోవడంతోనే సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులు ఏపీకి అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో పునర్వ్యవస్థీకరణ చట్టం నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నప్పుడు, కేంద్రం ఇంత కఠినమైన నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదని చెప్పారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 92 ప్రకారం ఈ వివాదంలో జోక్యం చేసుకునే అధికారం కేంద్రానికి లేదన్నారు.

బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో డిస్కంలు: ఏపీ

తెలంగాణ పెద్ద మొత్తంలో పేరుకుపోయిన బకాయిలు చెల్లించకపోవడంతో ఏపీ డిస్కంలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఏపీ విద్యుదుత్పత్తి సంస్థ తరఫు సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదించారు. మౌలిక వసతుల కల్పన కోసం ఏపీ డిస్కంలు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకున్నాయన్నారు. విభజన తర్వాత విద్యుదుత్పత్తి, సరఫరా చేసినందుకు ఈ బకాయిలు చెల్లించాల్సి ఉందని, దీనికీ.. పునర్వ్యవస్థీకరణ చట్టానికీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. కేంద్రం ఆదేశాల మేరకు విభజన తర్వాత 2017 వరకు ఏపీ డిస్కంలు విద్యుత్ సరఫరా చేస్తూనే ఉన్నాయన్నారు. బకాయిలు చెల్లించపోవడంతో బొగ్గు సరఫరా నిలిచిపోయిందని, దీంతో తెలంగాణకు విద్యుత్ నిలిపివేసినట్లు వెల్లడించారు. ఇరు రాష్ట్రాలు అంగీకరించిన తర్వాతే కేంద్రం నోటీసులు జారీ చేసిందన్నారు. బకాయి ఉన్న విషయాన్ని తెలంగాణ కూడా అంగీకరిస్తోందని పేర్కొన్నారు.

కేంద్రానికి అధికారం ఉంది: ఏఎస్‌జీ

కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) సుందరేశన్ వాదనలు వినిపిస్తూ.. కేంద్రం జోక్యంతోనే తెలంగాణకు ఏపీ విద్యుత్ సరఫరా చేసిందని నివేదించారు. ఈ నేపథ్యంలో బకాయిల చెల్లింపుపై ఉత్తర్వులిచ్చే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుందని వివరించారు. ఇరు రాష్ట్రాల కార్యదర్శులు హాజరై ఒప్పుకున్న తర్వాతే బకాయిలపై కేంద్రం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఏపీ స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి కూడా వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. నోటీసులు జారీచేసే అధికారం కేంద్రానికి ఉందా? లేదా? అన్నది తేల్చాల్సిన అవసరం లేదంటూ కేంద్రం ఉత్తర్వులను కొట్టివేసింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 20-10-2023

ఫ్యాషన్

నిన్న.. నేడు.. రేపటి స్టైల్

ఒకరేమో నిన్నటి తరం ఇష్టాలను తెలిసున్నవారు మరొకరు నేటి తరపు ఆసక్తులను ఒంటపట్టించుకున్నవారు ఈ ఇద్దరూ తూరుపు పశ్చిమానికి వారధులుగా ఇండోవెస్ట్రన్ డ్రెస్ డిజైన్స్‌తో సినీ స్టార్స్‌ను కూడా ఆకట్టుకుంటున్నారు. హైదరాబాద్ వాసులైన ఈ అత్తాకోడళ్ల పేర్లు శివానీ సింఘానియా, మాన్సీ సింఘానియా. అత్త తన డిజైన్స్‌ని కోడలికి నేర్పిస్తుంటే.. కోడలు నేటి ట్రెండ్‌ని అత్తకు పరిచయం చేస్తుంది. ఇద్దరూ కలిసి ఒకే రంగంలో రాణిస్తూ పాతికమందికి ఉపాధి కల్పిస్తున్నారు.

మాన్సీ, శివాని



డిజైన్స్ తెలుసుకుంటూ..

కోడలు మాన్సీ మాట్లాడుతూ.. 'నేను ఎంబీయే చేశాను. డ్రెస్ డిజైన్స్‌ని ఎంపిక చేసుకోవడంలో ఇష్టంతో పాటు ఈ తరం ఎలాంటి మోడల్స్‌ని ఇష్టపడుతుందో తెలుసు. అయితే, ఈ రంగంలోకి వస్తాను అనుకోలేదు. నా పెళ్లికి మా అత్తగారే డిజైనర్. అవి నాకు చాలా బాగా నచ్చాయి. పెళ్లయ్యాక మా అత్తగారు శివానీ దగ్గర డిజైన్స్‌కు సంబంధించి కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటూ వాటి రూపకల్పనలో ఉంటున్నాను. మా కలెక్షన్‌లో బ్రైడల్, కాంటెంపరరీ, వెస్టన్, ఇండో–వెస్టర్న్– క్లాసిక్ వేర్‌లలో స్ట్రెయిట్ కట్ ప్యాటర్న్స్, మినిమలిస్ట్ ఎంబ్రాయిడరీ ప్రత్యేకంగా ఉంటాయి. వింటేజ్ స్టైల్స్‌తో పాటు మోడర్న్ డ్రెస్సుల రూపకల్పన మా ప్రత్యేకత' ' అని వివరిస్తుంది మాన్సీ.

సెల్ఫ్ డిజైనర్‌ని..

''నేను చదువుకున్నది ఇంటర్మీడియెట్ వరకు. కానీ ఈ రంగంలో ఉన్న ఆసక్తి నన్ను ఎంతోమందికి పరిచయం చేసింది. ఇంట్లో ఖాళీ సమయాల్లో పెయింట్స్, పెన్సిల్ డ్రాయింగ్ చేసేదాన్ని. కొన్నాళ్లకు ఆ డ్రాయింగ్స్‌ని టైలర్‌కి చూపించి మోడల్ డ్రెస్సులు తయారు చేయమని చెప్పాను. మొదట మా ఇంట్లో అమ్మాయిలకు, బంధువులకు డిజైన్ చేసి ఇస్తూ, ఈ రంగంలోకి వచ్చేశాను. ఆ విధంగా ఫ్యాషన్ డిజైనింగ్‌ని సొంతంగా నేర్చుకున్నాను. నా డిజైన్స్ మామూలు వారి దగ్గర నుంచి టాలీవుడ్, బాలీవుడ్ స్టార్స్ కూడా మెచ్చుకోవడం ఎంతో ఆనందాన్నిస్తుంది. ప్రతి అమ్మాయి మా దుస్తుల్లో ఒక దివ్వెలా వెలిగిపోవాలని ఊహించి తొమ్మిదేళ్ల క్రితం బంజారాహిల్స్‌లో కనక్ పేరుతో డ్రెస్ డిజైన్ స్టూడియో ప్రారంభించాం' అని వివరిస్తారు శివాని.

వ్యక్తిగత శైలి, క్లిష్టమైన డిజైన్స్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ తమ ప్రత్యేకతలు అని చెబుతారు ఈ అత్తాకోడళ్లు. బాలీవుడ్ స్టార్ సోహా అలీఖాన్, సోనాక్షి, మోడల్స్, ప్రముఖ గాయకులతో కలిసి తమ క్రియేషన్స్‌తో వేదికలపైన ప్రదర్శించామని వివరించారు.





వంటిల్లు

తియ్యటి వేడుక

దేవీ నవరాత్రుల్లో సెలవులకు ఇంటికొచ్చిన పిల్లలు, బంధువులతో లోగిళ్లన్నీ కళకళలాడుతున్నాయి. ఈసారి దసరా వేడుకలను విభిన్న తీపి రుచులతో మరింత తియ్యగా చేసుకోమని చెబుతోంది ఈ వారం వంటిల్లు...

దెహరోరి



కావలసినవి: బియ్యం – కప్పు; నీళ్లు – పావు కప్పు; పెరుగు – పావు కప్పు; నెయ్యి – అరకప్పు; పంచదార – రెండు కప్పులు; యాలకుల పొడి – రెండు టీస్పూన్లు; బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: బియ్యాన్ని శుభ్రంగా కడిగి ఆరు గంటల పాటు నానబెట్టుకోవాలి ● నానిన బియ్యంలో నీటిని తీసేసి సూజీ రవ్వలా బరకగా గ్రైండ్ చేయాలి. గ్రైండ్ చేసేటప్పుడు నీళ్లు అసలు పోయకూడదు ● రవ్వలా గ్రైండ్ చేసిన బియ్యంలో పెరుగు వేసి చేతులతో బాగా కలపాలి ● చేతులు వేడెక్కిన తరువాత కలపడం ఆపేసి మూతపెట్టి రాత్రంతా ఉంచేయాలి ● మరుసటిరోజు పంచదారను గిన్నెలో వేయాలి. పంచదార మునిగేన్ని నీళ్లపోసి మంట మీద పెట్టాలి ● సన్నని మంట మీద సిరప్‌ను తయారు చేయాలి ● పాకం తయారైందనుకున్నప్పుడు యాలకుల పొడి వేసి కలిపి, దించేయాలి ● ఇప్పుడు బాణలిలో నెయ్యివేసి చక్కగా కాగనివ్వాలి ● రాత్రి కలిపి పెట్టుకున్న బియ్యం రవ్వ మిశ్రమాన్ని కుడుముల్లా చేసుకుని నెయ్యిలో డీప్‌ఫ్రై చేయాలి ● కుడుము రెండువైపులా లైట్ బ్రౌన్ కలర్‌లోకి మారాక తీసేసి టిష్యూ పేపర్ మీద వేయాలి ● ఐదు నిమిషాల తరువాత టిష్యూపేపర్ మీద నుంచి తీసి పంచదార పాకంలో వేయాలి ● బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులతో గార్నిష్ చేసి సర్వ్‌చేసుకోవాలి. రిఫ్రిజిరేటర్‌లో పెట్టకపోయినా దెహరోరిలు పదిరోజులపాటు రుచిగా ఉంటాయి .

మండిగే



కావలసినవి: బొంబాయి రవ్వ – రెండు కప్పులు; గోధుమ పిండి – కప్పు; ఉప్పు – చిటికెడు; బెల్లం తురుగు – అరకప్పు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు; పచ్చకర్పూరం – చిటికెడు.

తయారీ: పెద్ద గిన్నెలో బొంబాయి రవ్వ, గోధుమ పిండి, ఉప్పు, టేబుల్ స్పూను నెయ్యివేసి కలపాలి ● ఇప్పుడు నీళ్లు చల్లుకుంటూ చపాతీ ముద్దలా చేసుకోవాలి. దీనిపైన మూతపెట్టి ఇరవై నిమిషాలు పక్కన పెట్టాలి ● బెల్లంలో మిగిలిన నెయ్యి, పచ్చకర్పూరం వేసి, కలిపి పక్కన పెట్టుకోవాలి ● 20 నిమిషాల తరువాత పిండిముద్దను ఉండలుగా చుట్టి, చపాతీలా వత్తుకోవాలి ● ఇప్పుడు ఒక చపాతీ తీసుకుని,పైన రెండు టీస్పూన్ల బెల్లం మిశ్రమం వేసి చపాతీ అంతా పరచాలి ● బెల్లం పరిచిన చపాతీపై మరో చపాతీని వేసి చపాతీకర్రతో ఒకసారి వత్తుకోవాలి ● ఇప్పుడు ఈ చపాతీని పెనం మీద వేసి రెండు వైపులా క్రిస్పీగా మారేంత వరకు కాల్చి తీసేయాలి ● ఇలా కాలిన మండిగేను రెండు మూడు మడతలు వేసి సర్వ్ చేసుకోవాలి.

లవంగ్ లతిక



కావలసినవి: మైదా – ముప్పావు కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; పంచదార – కప్పు; లవంగాలు – పన్నెండు; నెయ్యి – డీప్‌ఫ్రైకి సరిపడా. స్టఫింగ్ కోసం: కోవా తురుము – ముప్పావు కప్పు; బాదం, పిస్తా, జీడిపప్పు పలుకులు – అరకప్పు; వేడిపాలు – అరటీస్పూను; కుంకుమ పువ్వు రేకులు – పావు టీస్పూను; పంచదార పొడి – పావు టీస్పూను; యాలకుల పొడి – అరటీస్పూను.

తయారీ: మైదాలో టేబుల్ స్పూను నెయ్యి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలిపి పక్కన పెట్టుకోవాలి ● పంచదారలో ఒకటిన్నర కప్పుల నీళ్లుపోసి మీడియం మంట మీద తిప్పుతూ సిరప్ తయారు చేసుకుని పక్కన పెట్టుకోవాలి ● స్టఫింగ్ కోసం తీసుకున్న పదార్థాలన్నింటినీ ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి ● నానిన పిండిముద్దను ఉండలుగా చుట్టుకోవాలి ● ఈ ఉండలను పూరీల్లా వత్తుకుని మధ్యలో రెండు రెండు టీస్పూన్ల స్టఫింగ్‌ను వేయాలి ● ఇప్పుడు స్టఫింగ్ బయటకు రాకుండా రెండు పక్కలా పూరీని మూయాలి ● పూరీని తిరగేసి తెరచి ఉన్న మరోవైపుని కొద్దిగా తడిచేసి మూసివేయాలి. మడత ఊడిపోకుండా లవంగం గుచ్చాలి ● ఇలా అన్ని లతికలను తయారు చేసుకోవాలి ● ఇప్పుడు సలసల కాగుతోన్న నెయ్యిలో వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేయాలి ● చక్కగా వేగిన లతికలను టిష్యూపేపర్ మీద వేసుకోవాలి ● వీటిని తినాలనుకున్నప్పుడు పంచదార సిరప్‌ను వేడిచేసి దానిలో లతికలను వేసి పదిహేను నిమిషాలు ఉంచి, ఆ తరువాత సర్వ్ చేయాలి.

యువర్స్

● టెక్.. టాక్

వివో వై200



డిస్‌ప్లే: 6.67 అంగుళాలు; రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్; ర్యామ్: 8జీబి; ఫ్రంట్ కెమెరా: 16 ఎంపీ; బ్యాటరీ: 4800 ఎంఏహెచ్; రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్; బరువు: 190 గ్రా.; కలర్ ఆప్షన్స్: డిజెర్ట్ గోల్డ్, జంగిల్ గ్రీన్

హానర్ ప్లే 8టీ



డిస్‌ప్లే: 6.8 అంగుళాలు; రిఫ్రెష్‌రేట్: 90 హెచ్‌జడ్
ఇంటర్నల్: 256జీబి/ 8జీబి ర్యామ్, 256జీబి /12జీబి ర్యామ్; రిజల్యూషన్: 1,080×2,412 పిక్సెల్స్; బ్యాటరీ: 6,000 ఎంఏహెచ్; బరువు: 199 గ్రా.; ఓఎస్: ఆండ్రాయిడ్ 13; కలర్స్: గ్రీన్, సిల్వర్, బ్లాక్

ఇన్‌స్టాలో స్క్రీన్‌టైమ్‌ను లిమిట్ చేయడానికి



ఇన్‌స్టాగ్రామ్ స్క్రోలింగ్‌లో మీమ్స్, రీల్స్, ఫొటోలు చూస్తూ చూస్తూ గంటలు దొర్లిపోతుంటాయి. టైమ్ వేస్ట్ అవుతుంటుంది. 'టైమ్ స్పెంట్' టూల్‌తో స్క్రీన్ టైమ్‌ను లిమిట్ చేయడానికి వీలవుతుంది. దీని కోసం...
1. ప్రొఫైల్ సెక్షన్‌లోకి వెళ్లాలి. 2. హంబగర్ మెనూ–ట్యాప్. 3. 'హౌ టు యూజ్ ఇన్‌స్టాగ్రామ్' కింద టైమ్ స్పెంట్ ఆప్షన్ కనిపిస్తుంది. 4. 'టైమ్ స్పెంట్' ట్యాప్ చేస్తే కొత్త స్క్రీన్ ఓపెన్ అవుతుంది. మనం స్పెండ్ చేస్తున్న డైలీ యావరేజ్ టైమ్‌ను చూపిస్తుంది. ఇక్కడ మనం 'డైలీ టైమ్ లిమిట్'ను సెట్ చేసుకోవచ్చు. బ్రేక్ తీసుకోవడానికి ఇది యూజర్‌లను రీమైండ్ చేస్తుంది.

మాస్టర్‌పీస్ ఎక్స్–జెనరేట్ 3డీ మోడల్స్

స్పెషల్–స్కిల్స్ అవసరం లేకుండా కీబోర్డ్ ద్వారా ఇచ్చే డిస్క్రిప్షన్‌తో 3డీ మోడల్స్‌ను సృష్టించవచ్చా? నిస్సందేహంగా అంటుంది మాస్టర్‌పీస్ ఎక్స్–జెనరేట్. 'మీకు కావాల్సిందల్లా కీబోర్డ్, బ్రౌజర్, కొన్ని పదాలు, కొంత ఊహ' అని చెబుతుంది. ఎకౌంట్ క్రియేట్ చేసుకున్న తరువాత యూజర్‌లు తమ ఆప్షన్‌ను పిక్ చేసుకోవచ్చు. టైప్ చేసిన తరువాత మనం కోరుకున్న 3డీ మోడల్ క్రియేట్ కావడానికి రెండు నుంచి ఎనిమిది నిమిషాల సమయం పడుతుంది.

గేమ్ డెవలప్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, ఆర్కిటెక్చర్... మొదలైన విభాగాల్లో మాస్టర్‌పీస్ ఎక్స్–జెనరేట్ ఉపయోగపడుతుంది. ఈ వెబ్‌సైట్‌లో ఫ్రీ ట్యూటోరియల్ ఆఫర్ కూడా ఉంది.



● సక్సెస్ స్టోరీ

అజేయ పథం

'అసాధ్యం' అనే మాటలో కొందరు 'అ' అనే అక్షరాన్ని ఎప్పటికీ పట్టించుకోరు.
అజయ్ అక్షరాలా అలాంటి కుర్రాడే.
'మనం అనుకోవాలేగానీ సాధ్యం కానిది అంటూ ఏముంది' అనేది అతడి నమ్మకం. అంతులేని బలం.
చిన్న వయసులోనే యూట్యూబ్ ప్రపంచంలోకి వచ్చాడు హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన అజయ్ నాగర్. ఇరవై ఏళ్లు దాటే లోపే వైరల్ యూట్యూబ్ స్టార్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఔత్సాహిక యూట్యూబర్‌లకు రోల్‌మోడల్ అయ్యాడు.



అజయ్ నాగర్

చిన్నప్పుడు ఫుట్‌బాల్ ట్యుటోరియల్ వీడియోలు చూస్తూ వాటి నుంచి స్ఫూర్తి పొంది యూట్యూబ్ చానల్ ప్రారంభించాడు అజయ్. 'అడిక్టెడ్' పేరుతో ఉన్న అతడి యూట్యూబ్ చానల్ ఆ తరువాత 'క్యారీ డియోల్'గా పేరు మార్చుకుంది. కొత్త పేరే కాదు...కొత్త కంటెంట్ వచ్చింది. గేమ్‌ప్లే ఫుటేజిని అప్‌లోడ్ చేయడం నుంచి హీరో సన్నీ డియోల్‌ను అనుకరించడం వరకు ఎన్నో చేశాడు.

అజయ్ వీడియో 'యూట్యూబ్ వర్సెస్ టిక్‌టాక్: ది ఎండ్' ఆరు రోజుల్లోనే 72.2 మిలియన్‌ల వ్యూస్‌తో రికార్డ్ సృష్టించింది. అజయ్ ఫాలోవర్స్ ఒక రేంజ్‌కు చేరుకునే సమయానికి చానల్ పేరు 'క్యారీమినటీ'గా మారింది.

'ఇంతకీ క్యారీమినటీ అంటే?' అని అడిగితే 'నాకు కూడా తెలియదు. ఇట్ జస్ట్ సౌండ్స్ కూల్ అని అలా డిసైడై పోయాను' నవ్వుతూ అంటాడు అజయ్.

ఒక వీడియో హిట్ అయిన తరువాత సంతోషం మాటేమిటో గానీ దాని ప్రభావం చేయబోయే వీడియో మీద పడుతుంది. 'గత వీడియోను మించి వ్యూస్ రావాలి' అనుకునే సమయంలో ఒత్తిడి వచ్చి తల మీద కూర్చుంటుంది. దాన్ని కిందికి దించడం కష్టమైన పని. మరి ఈ సమస్యను అజయ్ ఎలా ఎదుర్కొన్నాడు?

అతడి మాటల్లోనే...

'వీడియోలు చేస్తుప్పుడు ఒత్తిడికి గురవుతుంటారా? అని నన్ను చాలామంది అడిగే వాళ్లు. ఒత్తిడి ఏమిటి! అని ఆశ్చర్యపడేవాడిని. అయితే అది ఒకప్పటి సంగతి. ఆ తరువాత నాలో కూడా మెల్లగా ఒత్తిడి మొదలైంది. ఎన్నో లక్షల మంది నా వీడియోలు చూస్తున్నారు. చాలా జాగ్రత్తగా చేయాలి. నెగెటివ్ కామెంట్స్ రావద్దు...అని ఒకటికి పదిసార్లు అనుకోవడం వల్ల విపరీతమైన ఒత్తిడికి గురయ్యేవాడిని. అయితే చివరి సమయంలో మాత్రం ఏదైతే అది అవుతుంది అనుకొని నా మనసుకు నచ్చినట్లు చేసేవాడిని. నా అంచనా ఎప్పుడూ తప్పలేదు'

ఎవరి పిల్లలు వారికి ముద్దు అన్నట్లు ఎవరు చేసిన వీడియోలు వారికి మురిపెంగానే ఉంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని తన వీడియోలను యూట్యూబ్‌లోకి వదిలే ముందు ఒకటికి పదిసార్లు చెక్ చేసుకుంటాడు. బయటి ప్రేక్షకుడు ఎవరో చూస్తున్నట్లుగా తన వీడియోను చూస్తాడు.

జీవితం పర్సనల్ లైఫ్, ప్రొఫెషనల్ లైఫ్ అని రెండు ప్రపంచాలుగా విడిపోయిన కాలంలో ఉన్నాం మనం. ప్రొఫెషనల్ లైఫ్‌లోనే అజయ్ ఎక్కువ కాలం గడపడం వల్ల కాలేజీ, యూనివర్శిటీలలో చదువుకునే అవకాశం రాలేదు. ఫ్రెండ్స్‌తో సరదాలు లేవు. వినోదాలు లేవు. అయితే అజేయపథంలో దూసుకుపోతున్న అజయ్ నాగర్‌కు వాటి గురించి గుర్తు రావడం అరుదే.

'అజయ్ నాగర్, క్యారీమినటీ ఇద్దరు మంచి స్నేహితులు. ఒకరి అవసరం మరొకరికి ఉంది. కాబట్టి బెస్ట్ ఫ్రెండ్ లేడు అనే బాధ నాకు లేదు' అంటాడు అజయ్.

'చాలా కష్టసమయంలో మీ వీడియో ఒకటి చూశాను. ఉత్సాహం పుంజుకోవడానికి అది నాకు ఔషధంలా పనిచేసింది' ఇలాంటి ఈమెయిల్స్ అజయ్‌కు వస్తుంటాయి. వాటిని చదివినప్పుడల్లా తన బలం రెట్టింపు కావడంతో పాటు బాధ్యత కూడా పెరుగుతుంది.

హార్డ్‌వర్క్, టాలెంట్‌తో అయిదు యూట్యూబ్ అవార్డ్‌లతో పాటు అజయ్ ఎన్నో అవార్డ్‌లు అందుకున్నాడు. ఆర్థిక కోణంలో కోటీశ్వరుడు అయ్యాడు. ఔత్సాహిక యూట్యూబర్‌లకు రోల్ మోడల్‌గా మారాడు.

● మ్యూజిక్ వరల్డ్

ఐయామ్ యువర్ క్వీన్



ఇర్ఫానా హమీద్

కొడైకెనాల్‌కు చెందిన ఇర్ఫానా హమీద్ హిప్‌హాప్ సింగర్, ట్రంపెట్ ప్లేయర్. కర్నాటక సంగీతంతో సంగీత ప్రపంచంలోకి అడుగు పెట్టింది. వీణ నేర్చుకుంది. కాలేజి రోజుల్లో పొయెట్రీ రాసేది. ఇండియన్ హిప్ హాప్‌లో కొత్త గొంతుగా మంచి పేరు తెచ్చుకుంది. యాంటి–ఫాసిజం నుంచి, తమిళ్–ముస్లిం సంస్కృతి వరకు ఇర్ఫానా సంగీతంలో ఎన్నో కోణాలు కనిపిస్తాయి.

నెట్‌ఫ్లిక్స్ వెబ్–సిరీస్ 'మసాబా మసాబా' టైటిల్ ట్రాక్ 'ఐయామ్ యువర్ కింగ్' పాడింది. 'కన్నిల్ పెట్టోల్' ట్రాక్‌తో హిప్ హాప్ సెన్సేషన్‌గా పేరు తెచ్చుకుంది. మన సినిమాల్లోని ఐటమ్ సాంగ్స్ కల్చర్‌పై 'షీలా సిల్క్' చేసింది. బాలీవుడ్ పాపులర్ సాంగ్ షీలాకీ జవానీ, ఐటమ్ సాంగ్స్‌కు పేరుగాంచిన సిల్క్ స్మిత పేరులో నుంచి 'షీలా సిల్క్'ను సృష్టించింది.

యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్(యుఎంజీ) గత సంవత్సరం 'డెఫ్ జామ్ రికార్డింగ్స్'ను మన దేశంలో లాంచ్ చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థతో కలిసి పనిచేస్తుంది ఇర్ఫానా హమీద్. అర్బన్ కల్చర్‌కు సంబంధించిన అంశాల ఆధారంగా సృష్టించే 'డెఫ్ పొయెట్రీ' వింటూ పెరిగింది ఇర్ఫానా. 'హిప్–హాప్ కల్చర్‌పై మన దేశంలోని యువతరానికి ఆసక్తి కలిగించడానికి, వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాను' అంటుంది. ప్రతి సింగర్‌కు సిగ్నేచర్ సౌండ్ ఉంటుంది. మరి ఇర్ఫానా హమీద్‌కు ఇష్టమైనది?

రకరకాల శబ్దాలు, శైలులను ఎక్స్‌ప్లోర్ చేయడం.

English Idioms

నో ది రోప్స్

ఒక అంశం, పని, కార్యక్రమ నిర్వహణ....మొదలైన వాటిలో ఒక వ్యక్తికి తగిన అనుభవం, విషయ పరిజ్ఞానం ఉంది అని చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట...నో ది రోప్స్.

ఉదా: వుయ్ నీడ్ సమ్‌వన్ టు టీచ్ ది న్యూ స్టాఫ్. సమ్‌వన్ హూ నోస్ ది రోప్స్ అండ్ ఈజ్ గుడ్ ఎట్ ఎక్స్‌ప్లెయినింగ్ థింగ్స్

ఏ షాట్ ఇన్ ది ఆర్మ్

ఊహించని సందర్భంలో అదృష్టం లేదా విజయం చేరువ కావడం, అది ఆత్మవిశ్వాసం పెరగడానికి, సానుకూల శక్తి పెరగడానికి ఉపయోగపడడం. ఇలాంటి సందర్భంలో వాడే మాట...ఏ షాట్ ఇన్ ది ఆర్మ్.

ఉదా: విన్నింగ్ దిస్ అవార్డ్ హ్యాజ్ బిన్ ఏ బిగ్ షాట్ ఇన్ ది ఆర్మ్ ఫర్ ది స్టూడెంట్స్

● అవును... ఇది నిజమే!



● ఉత్తర అమెరికాలోని సోనోరన్ ఎడారిలో కనిపించే సగ్వారో కాక్టస్ రెండు వందల సంవత్సరాల వరకు బతుకుతుంది. నలభై అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. ఈ మొక్క 'ప్రకృతి ప్రపంచంలోని అద్భుతం'గా పేరు తెచ్చుకుంది.
● ప్రఖ్యాత రచయిత మార్క్ ట్వైన్ అసలు పేరు... శామ్యుల్ లాంగ్‌హార్న్ క్లెమెన్స్.
● స్ట్రీమింగ్ డాక్యుమెంటరీ సర్వీస్ మాజాలన్ టీవి ఒకసారి ప్రేక్షకులకు డబ్బు ప్లస్ ఒక సంవత్సరం పాటు ఉచిత సబ్‌స్క్రిప్షన్ ఆఫర్ ఇచ్చింది. దీనికి వారు చేయాల్సిందల్లా 48 గంటల్లో 24 గంటల పాటు క్రైమ్ డాక్యుమెంటరీలను చూడాలి. ఆ అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకోవాలి.

హార్దిక్ పాండ్యాకు గాయం

ప్రపంచకప్ వేటలో ఉన్న భారత శిబిరంలో కాస్త ఆందోళన పెంచే ఘటన మైదానంలో జరిగింది. బంగ్లాతో మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయపడ్డాడు. తన తొలి ఓవర్ మూడో బంతిని బ్యాటర్ దాస్ నేరుగా ఆడగా బంతిని ఆపే ప్రయత్నంలో పాండ్యా తన కాలును బాగా ముందుకు జరిపాడు. ఈ క్రమంలో అతని చీలమండ భాగం మడత పడింది. దాంతో అతను నొప్పితో విలవిల్లాడాడు. ప్రాథమిక చికిత్స చేసినా లాభం లేకపోవడంతో అలాగే మైదానం వీడాడు. కొద్ది సేపటికే ఈ మ్యాచ్‌లో అతను బౌలింగ్ చేయడని బీసీసీఐ ప్రకటించింది. అతని కాలికి స్కాన్ నిర్వహించినట్లు తెలిసింది. దాని ఫలితాలపై పూర్తి సమాచారం లేకున్నా మ్యాచ్ తర్వాత రోహిత్ పెద్దగా ప్రమాదం ఏమీ లేకపోవడం మాకు ఊరట. అయితే ప్రతీ రోజు గాయాన్ని వైద్యులు పర్యవేక్షిస్తారు' అని స్పష్టతనిచ్చాడు. పాండ్యా తప్పుకోవడంతో ఆ ఓవర్లో మిగిలిన మూడు బంతులను కోహ్లి బౌల్ చేయడంతో స్టేడియం హోరెత్తింది. దీనికి ముందు 2017లో శ్రీలంకపై చివరిసారిగా కోహ్లి బౌలింగ్ చేశాడు.



మళ్లీ అదే వ్యూహం... అదే ఫలితం... పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయడం... ఆపై మెరుపు బ్యాటింగ్‌తో వేగంగా విజయాన్నందుకోవడం... 199, 272, 191, 256... ఇలా ప్రత్యర్థి స్కోర్లు మారడమే తప్ప భారత జట్టు ఆట మారలేదు... సమష్టి ప్రదర్శనతో సొంతగడ్డపై ప్రపంచకప్‌లో భారత్ జైత్రయాత్ర కొనసాగుతుంది... వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా తమ విజయాల స్కోరును 4/4గా మార్చుకుంది... బలహీన ప్రత్యర్థి బంగ్లాదేశ్‌పై సులువైన విజయంతో రోహిత్ బృందం సత్తా చాటింది. బౌలర్లు చెలరేగడంతో బంగ్లాదేశ్ నామమాత్రపు స్కోరుకు పరిమితం కాగా... రోహిత్, గిల్, కోహ్లి బ్యాటింగ్‌తో అలవోకగా భారత జట్టు లక్ష్యం చేరింది... చిన్నపాటి లక్ష్యంలో కూడా చివర్లో చెలరేగి కోహ్లి 48వ వన్డే సెంచరీని తన ఖాతాలో వేసుకోవడం మ్యాచ్‌లో హైలైట్.

నాలుగోసారీ ఛేదించాం



కోహ్లి

48 వన్డేల్లో కోహ్లి సెంచరీల సంఖ్య. ఈ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా సచిన్ టెండూల్కర్ (49) పేరిట ఉన్న రికార్డును సమం చేసేందుకు కోహ్లి మరో సెంచరీ దూరంలో ఉన్నాడు. రోహిత్ (31) మూడో స్థానంలో ఉన్నాడు.

4 వన్డే వరల్డ్‌కప్ చరిత్రలో ఓ మ్యాచ్‌లో భారత జట్టుపై ఓపెనర్లిద్దరూ అర్ధ సెంచరీలు/సెంచరీలు చేయడం ఇది నాలుగోసారి మాత్రమే. ప్రత్యర్థి జట్టు ఓపెనర్లు హాఫ్ సెంచరీలు/సెంచరీలు చేసిన మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టు ఓటమి చెందగా... నాలుగోసారి మాత్రం భారత్ గెలిచింది.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.385
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.734
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	3	1	2	2	-0.993
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250
శ్రీలంక	3	0	3	0	-1.532

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X పాకిస్తాన్
వేదిక: బెంగళూరు
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్‌లో భారత్‌కు మరో విజయం

7 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు ● విరాట్ కోహ్లి 48వ వన్డే శతకం రాణించిన గిల్, రోహిత్, బౌలర్లు ● ఆదివారం న్యూజిలాండ్‌తో తర్వాతి మ్యాచ్

పుణే: తిరుగులేని ప్రదర్శనతో భారత్ వరల్డ్‌కప్‌లో మరో గెలుపును తమ ఖాతాలో వేసుకుంది. గురువారం జరిగిన పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. లిటన్ దాస్ (82 బంతుల్లో 66; 7 ఫోర్లు), తన్‌జీద్ హసన్ (43 బంతుల్లో 51; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), మహ్ముదుల్లా (36 బంతుల్లో 46; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) జట్టు స్కోరులో కీలకపాత్ర పోషించారు. అనంతరం భారత్ 41.3 ఓవర్లలో 3 వికెట్లకు 261 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (97 బంతుల్లో 103 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీ సాధించగా... గిల్ (55 బంతుల్లో 53; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), రోహిత్ శర్మ (40 బంతుల్లో 48; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. భారత్ ఆదివారం జరిగే తమ తర్వాతి పోరులో ధర్మశాలలో న్యూజిలాండ్‌తో తలపడుతుంది.

ఓపెనర్ల జోరు...

బంగ్లాకు ఓపెనర్లు తన్‌జీద్, దాస్ శుభారంభం అందించారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు చక్కటి బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చారు. శార్దుల్ తొలి ఓవర్లో తన్‌జీద్ వరుసగా 6, 4, 6 బాదడంతో 10 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 63 పరుగులకు చేరింది. ఈ క్రమంలో 41 బంతుల్లో తన్‌జీద్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే అతడిని వికెట్ల ముందు దొరకబుచ్చుకొని కుల్దీప్ భారీ భాగస్వామ్యానికి ముగింపు పలికాడు. అంతే...ఆ తర్వాత బంగ్లా బ్యాటర్లు ఒకరి తర్వాత మరొకరు వరుసగా విఫలమయ్యారు. 93/0తో ఒకదశలో పటిష్ట స్థితిలో కనిపించిన జట్టు వేగంగా వికెట్లు కోల్పోయింది. నజ్ముల్ (8), మిరాజ్ (3) తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా... 62 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్న దాస్ వీరిని అనుసరించాడు. తౌహీద్ (16) బంతులు వృథా చేయగా, ముష్ఫికర్ రహీమ్ (46 బంతుల్లో 38; 1 ఫోర్, 1 సిక్స్) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే మన పటిష్ట బౌలింగ్‌లో పరుగులు రాబట్టడం కష్టంగా మారింది. చివర్లో మహ్ముదుల్లా ధాటిగా ఆడటంతో బంగ్లా ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. గాయం కారణంగా కెప్టెన్ షకీబ్ అల్ హసన్, ప్రధాన పేసర్ తస్కీన్ అహ్మద్ ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో ఆట ఆరంభానికి ముందే బంగ్లా బలహీన పడింది.

కీలక భాగస్వామ్యాలు...

ఛేదనలో ఎప్పటిలాగే రోహిత్ తనదైన శైలిలో దూకుడు చూపిస్తూ వరుస బౌండరీలతో దూసుకుపోయాడు. మరో వైపు నసుమ్ ఓవర్లో 2 సిక్స్‌లతో జోరు పెంచిన గిల్... ముస్తఫిజుర్ ఓవర్లో మూడు ఫోర్లు బాదాడు. అయితే హసన్ ఓవర్లో భారీ సిక్స్ కొట్టిన రోహిత్ తర్వాతి బంతికి అదే తరహా షాట్ ఆడబోయి వెనుదిరగడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కోహ్లి బాధ్యత తీసుకోగా... 52 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన తర్వాత గిల్ నిష్క్రమించాడు. చూడచక్కటి షాట్లు ఆడిన కోహ్లి 48 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ (25 బంతుల్లో 19; 2 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోగా... కోహ్లి, కేఎల్ రాహుల్ (34 బంతుల్లో 34 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) భాగస్వామ్యం జట్టును గెలుపు దిశగా నడిపించింది. వీరిద్దరు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగా, వీరిని నిలువరించలేక బంగ్లా బౌలర్లు చేతులెత్తేశారు.



గిల్



రోహిత్

సెంచరీ దిశగా ఉత్కంఠ!

బ్యాటింగ్‌లో భారత్ జోరు చూస్తే జట్టు విజయంపై ఎలాంటి సందేహాలు లేవు. అయితే కోహ్లి శతకం చేరుకునే ప్రయత్నం చేయడమే చివర్లో ఆటను కాస్త ఆసక్తికరంగా మార్చింది. 36 ఓవర్ల తర్వాత జట్టు విజయానికి 48 పరుగులు కావాల్సి ఉండగా... కోహ్లి 68 పరుగుల వద్ద ఉన్నాడు. తర్వాతి ఓవర్లో రాహుల్ 6, 4 సహా 12 పరుగులు చేయడంతో ఈ అంతరం మరింత తగ్గింది. మరుసటి ఓవర్ తర్వాత భారత్‌కు 28 పరుగులు. కోహ్లి సెంచరీకి 27 పరుగులు కావాలి. ఇద్దరు ప్రధాన బ్యాటర్లు క్రీజ్‌లో ఉంటే ఒక్కడే పరుగులు చేయడం దాదాపుగా జరగదు. కానీ తగినన్ని ఓవర్లు అందుబాటులో ఉండటంతో సమస్య లేదు కాబట్టి ఈ దశలో కోహ్లి సెంచరీపై దృష్టి పెట్టాడు. రాహుల్ కూడా పరుగులు చేయకుండా వెనక్కి తగ్గాడు. సింగిల్స్ తీసే అవకాశమున్నా దానిని బ్యాటర్లు కాదనుకున్నారు. ఫలితంగా కోహ్లికి శతకం సాధ్యమైంది. తర్వాతి 32 పరుగుల్లో కోహ్లి ఒక్కడే 30 పరుగులు సాధించగా రాహుల్ సింగిల్ మాత్రమే తీశాడు. మరో పరుగు వైడ్ రూపంలో వచ్చింది. నసుమ్ వేసిన ఫుల్‌టాస్ బంతిని డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాది విరాట్ శతక గర్జన చేశాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 51; లిటన్ దాస్ (సి) గిల్ (బి) జడేజా 66; నజ్ముల్ (ఎల్బీ) (బి) జడేజా 8; మిరాజ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 3; తౌహీద్ (సి) గిల్ (బి) శార్దుల్ 16; ముష్ఫికర్ (సి) జడేజా (బి) బుమ్రా 38; మహ్ముదుల్లా (బి) బుమ్రా 46; నసుమ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 14; ముస్తఫిజుర్ (నాటౌట్) 1; షరీఫుల్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 256. వికెట్ల పతనం:** 1-93, 2-110, 3-129, 4-137, 5-179, 6-201, 7-233, 8-248. **బౌలింగ్:** బుమ్రా 10-1-41-2, సిరాజ్ 10-0-60-2, పాండ్యా 0.3-0-8-0, కోహ్లి 0.3-0-2-0, శార్దుల్ 9-0-59-1, కుల్దీప్ 10-0-47-1, జడేజా 10-0-38-2.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) తౌహీద్ (బి) హసన్ 48; గిల్ (సి) మహ్ముదుల్లా (బి) మిరాజ్ 53; కోహ్లి (నాటౌట్) 103; అయ్యర్ (సి) మహ్ముదుల్లా (బి) మిరాజ్ 19; రాహుల్ (నాటౌట్) 34; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (41.3 ఓవర్లలో 3 వికెట్లకు) 261. వికెట్ల పతనం:** 1-88, 2-132, 3-178. **బౌలింగ్:** షరీఫుల్ 8-0-54-0, ముస్తఫిజుర్ 5-0-29-0, నసుమ్ 9.3-0-60-0, హసన్ 8-0-65-1, మిరాజ్ 10-0-47-2, మహ్ముదుల్లా 1-0-6-0.

ఇక ఆసీస్‌తో ప్రమాదం

కృష్ణమాచారి శ్రీకాంత్

వరుస పరాజయాల అనంతరం ఆస్ట్రేలియా జట్టు ఎట్టకేలకు శ్రీలంకపై చక్కని విజయంతో ప్రపంచకప్‌లో బోణీ చేసింది. పట్టికలో చేరిన 2 పాయింట్లు ఆసీస్ శిబిరాన్ని సంబరంలో ముంచింది. ఓ కెప్టెన్ ముందుండి నడిపిస్తే దాని ప్రభావం జట్టుపై చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ విషయం రోహిత్ శర్మ భారత్‌ను ఎలా విజయవంతగా నడిపిస్తున్నాడో చూస్తే అర్థమవుతుంది. ఆసీస్ కెప్టెన్ కమిన్స్ లయ అందుకోవడం, స్పిన్నర్ జంపా తిప్పేయడం తో 'కంగారూ జట్టు' ఇకపై ప్రమాదకర శక్తిగా మారుతుంది. ఇదే విషయం వారి గత ఐదు ప్రపంచకప్ టైటిళ్ల ఘనమైన రికార్డు సూచిస్తుంది. మార్ష్, లబుషేన్‌లతో పాటు స్మిత్ కూడా నిలకడగా ఆడితే బ్యాటింగ్ దళానికి తిరుగుండదు. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు అఫ్గాన్, దక్షిణాఫ్రికాకు నెదర్లాండ్స్ ఊహించని షాక్‌లు ఇచ్చాయి. ఇలా రోజుల వ్యవధిలోనే రెండు సంచలనాలు సెమీఫైనల్ బెర్త్‌ల రేసును రసవత్తరం చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా దక్షిణాఫ్రికాపై ఆఖరి పది ఓవర్లలో డచ్ బ్యాటర్లు చెలరేగిన వైనం, బౌలింగ్‌లో సఫారీపై విసిరిన పంజా అద్భుతం. ఇలాంటి పరాజయం నుంచి దక్షిణాఫ్రికా ఎలా పుంజుకుంటుందో చూడాలి. నేడు ఆస్ట్రేలియా, పాకిస్తాన్‌ల మధ్య ఆసక్తికర మ్యాచ్ జరగడం ఖాయం. ఎందుకంటే రెండు మ్యాచ్‌లు ఓడిన ఆసీస్ గెలుపుబాట పట్టగా, రెండు విజయాలు సాధించిన పాక్ ఓటమితో ఉంది. ఇలాంటి జట్ల మధ్య శుక్రవారం ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి. యువ బ్యాటర్లు షఫీక్, ఇమాముల్, షకీల్‌లతో పాటు సీనియర్లు బాబర్ ఆజమ్, రిజ్వాన్‌లు బ్యాట్ ఝుళిపిస్తే విజయం ఏమంత కష్టం కాదు. ఇక వేదిక గురించి చెప్పుకోవాల్సి వస్తే... బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద ఖాయం. ఇది ఎన్నోసార్లు పరుగుల మజా పంచింది. అలాగే నాణ్యమైన బౌలింగ్ రుచి చూపిస్తే... కట్టడి చేయొచ్చని కూడా ఐపీఎల్‌లో యజువేంద్ర చహల్ నిరూపించాడు. ఈ నేపథ్యంలో ఎవరు మెరిపిస్తారో, ఎవరు కట్టడి చేస్తారో చూడాలి.

ఆసియా ఆర్చరీ పోటీలకు జ్యోతి సురేఖ, ధీరజ్

సోనీపత్: వచ్చే నెలలో బ్యాంకాక్‌లో జరిగే ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల రికర్వ్, కాంపౌండ్ జట్లను ప్రకటించారు. మహిళల కాంపౌండ్ జట్టులో స్టార్ ప్లేయర్, ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణ పతకాలు గెలిచిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ... పురుషుల రికర్వ్ జట్టులో ఆసియా క్రీడల్లో టీమ్ విభాగంలో రజత పతకం నెగ్గిన ఆంధ్రప్రదేశ్ ఆటగాడు ధీరజ్ బొమ్మదేవర ఎంపికయ్యారు. సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్‌సీబీ)కు ప్రాతినిధ్యం వహించే ధీరజ్‌కు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు మరో అవకాశం దక్కింది. నవంబర్ 3 నుంచి 10 వరకు జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లో రికర్వ్ పురుషుల, మహిళల టీమ్ విభాగాల్లో స్వర్ణం గెలిచిన జట్లు... పురుషుల, మహిళల వ్యక్తిగత విభాగాల్లో ఫైనల్ చేరిన ఇద్దరు ప్లేయర్లు చొప్పున పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు.





హెచ్‌సీఏలో ఎన్నికల సందడి

నేడు పోలింగ్, ఫలితాలు ● 6 పదవుల కోసం బరిలో 24 మంది

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవకతవకలు, అవినీతి, కోర్టు వివాదాలు, పరస్పర ఆరోపణలు, సస్పెన్షన్‌లు, పర్యవేక్షకుల పరిపాలన తర్వాత ఎట్టకేలకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రిటర్నింగ్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వీఎస్ సంపత్ ఆధ్వర్యంలో నేడు ఉప్పల్ స్టేడియంలో ఎన్నికలు జరుగుతాయి. వాస్తవానికి మొహమ్మద్ అజహరుద్దీన్ అధ్యక్షుడిగా 2019లో ఎన్నికైన హెచ్‌సీఏ కార్యవర్గం పదవీ కాలం గత ఏడాది సెప్టెంబర్ 26నే ముగిసింది. ఆ వెంటనే ఎన్నికలు జరగాల్సి ఉన్నా... వేర్వేరు వివాదాలతో అవి వాయిదా పడ్డాయి. చివరకు సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని ఎన్నికలు జరిగే వరకు రోజువారీ కార్యకలాపాల కోసం మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) ఎల్.నాగేశ్వరరావు నేతృత్వంలో ఏకసభ్య పర్యవేక్షణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే హైదరాబాద్‌లో మూడు వరల్డ్‌కప్ మ్యాచ్‌లు కూడా జరిగాయి. చివరకు అక్టోబర్ 20న ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి ముందు హెచ్‌సీఏను ప్రక్షాళన చేసే క్రమంలో 57 క్లబ్‌లపై నాగేశ్వరరావు నిషేధం విధించారు. దాంతో ఈ క్లబ్‌లకు ఎన్నికల్లో ఓటు హక్కు లేకుండా పోయింది.

నాలుగు ప్యానెల్‌లుగా...

అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, కౌన్సిలర్... ఇలా ఆరు పదవుల కోసం ఎన్నికలు జరగనున్నాయి. లోధా కమిటీ సిఫారసులు, కొత్త నియమావళి కారణంగా గతంలో కీలక పదవులు నిర్వహించిన సీనియర్లందరూ ఈసారి పోటీలో లేకపోగా, తాము మద్దతునిస్తూ సన్నిహితులను బరిలోకి దించారు. దాంతో ఈసారి ఎక్కువగా కొత్త మొహాలు కనిపిస్తున్నాయి. నాలుగు వేర్వేరు గ్రూప్‌లుగా విడిపోయి అభ్యర్థులంతా పోటీ చేస్తున్నారు. అయితే ఫలితం విషయంలో గ్రూప్‌లతో సంబంధం లేదు. ఒక్కో పదవి కోసం అత్యధిక ఓట్లు సాధించిన వారు ప్యానెల్‌తో సంబంధం లేకుండా ఎన్నికవుతారు. పోలింగ్ కోసం మొత్తం 173 ఓట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 101 రెగ్యులర్ క్రికెట్ క్లబ్‌లు కాగా 48 ఇన్‌స్టిట్యూషన్ క్లబ్‌లు ఉన్నాయి. 9 జిల్లా క్లబ్‌లతో పాటు 15 మందికి అంతర్జాతీయ ఆటగాళ్ల హోదాలో ఓటు హక్కు ఉంది. గెలిస్తే తాము హైదరాబాద్ క్రికెట్ సంఘాన్ని చక్కదిద్దుతామని, వివాదాలు లేకుండా నడిపిస్తామని అభ్యర్థులంతా హామీ ఇస్తున్నారు. శుక్రవారం సాయంత్రమే ఓట్లను లెక్కించి ఫలితాన్ని ప్రకటిస్తారు.









అధ్యక్ష అభ్యర్థులు: అమర్‌నాథ్, జగన్‌మోహన్ రావు, పీఎల్ శ్రీనివాస్, అనిల్ కుమార్

బరిలో ఉన్న ప్యానెల్, అభ్యర్థులు

యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ: ఎ.జగన్‌మోహన్ రావు, పి.శ్రీధర్, ఆర్.హరినారాయణ రావు, నోయల్ డేవిడ్, సీజే శ్రీనివాస్, అన్సర్ అహ్మద్ ఖాన్. క్రికెట్ ఫస్ట్: అమర్‌నాథ్, జి.శ్రీనివాస రావు, ఆర్.దేవరాజ్, సి.సంజీవ్ రెడ్డి, చిట్టి శ్రీధర్, సునీల్ కుమార్. ఆనెస్ట్ హార్డ్ వర్కింగ్ హెచ్‌సీఏ: పీఎల్ శ్రీనివాస్, సి. బాబూరావు, ఆర్ఎం భాస్కర్, రోహిత్ అగర్వాల్, జెరార్డ్ కార్, డీఏజే వాల్టర్. గుడ్ గవర్నెన్స్: కె. అనిల్‌కుమార్, దల్జీత్ సింగ్, వి.ఆగమరావు, బసవరాజు, పి.మహేంద్ర, వినోద్ ఇంగ్లే.

హడలెత్తించిన రవితేజ

13 పరుగులిచ్చి 6 వికెట్లు తీసిన బౌలర్ ● హైదరాబాద్‌కు వరుసగా మూడో విజయం

జైపూర్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. ఛత్తీస్‌గఢ్‌తో గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టును హైదరాబాద్ మీడియం పేసర్ టి.రవితేజ హడలెత్తించాడు. రవితేజ కేవలం 13 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. సీవీ మిలింద్ (2/16), తనయ్ త్యాగరాజన్ (2/16) కూడా రాణించడంతో ఛత్తీస్‌గఢ్ 19.1 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటైంది. శశాంక్ సింగ్ (47 బంతుల్లో 51; 5 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం హైదరాబాద్ 16 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 98 పరుగులు చేసి గెలిచింది. తన్మయ్ అగర్వాల్ (15 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ రాయుడు (10 బంతుల్లో 14; 2 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (13 బంతుల్లో 11; 1 ఫోర్), చందన్ సహని (22 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ సింగ్ (33 బంతుల్లో 25 నాటౌట్) రాణించారు. హైదరాబాద్ తమ తదుపరి మ్యాచ్‌లో 21న మిజోరం జట్టుతో ఆడుతుంది.



షేక్ రషీద్ అజేయ శతకం

54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 100 నాటౌట్ ● అరుణాచల్ ప్రదేశ్‌పై ఆంధ్ర గెలుపు

రాంచీ: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు తొలి విజయం నమోదు చేసింది. అరుణాచల్ ప్రదేశ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఆంధ్ర 145 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లకు 228 పరుగులు చేసింది. షేక్ రషీద్ (54 బంతుల్లో 100 నాటౌట్; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) అరుణాచల్ బౌలర్లపై విరుచుకుపడి అజేయ సెంచరీ చేశాడు. హనుమ విహారి (32 బంతుల్లో 49; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. రికీ భుయ్ (10 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు), కరణ్ షిండే (8 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా ధాటిగా ఆడారు. 229 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసి ఓడిపోయింది. ఆంధ్ర జట్టు బౌలర్లలో స్టీఫెన్ (3/10), కేవీ శశికాంత్ (2/2) రాణించారు. ఆంధ్ర తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 21న గుజరాత్‌తో ఆడుతుంది.



క్వార్టర్స్‌లో సింధు

ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు 18-21, 21-15, 21-13తో ప్రపంచ ఏడో ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా)పై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో భారత్‌కే చెందిన ఆకర్షి కశ్యప్ 18-21, 8-21తో సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది.



డిసెంబర్ 2 నుంచి పీకేఎల్

ముంబై: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ షెడ్యూల్‌ను నిర్వాహకులు ప్రకటించారు. అహ్మదాబాద్‌లో డిసెంబర్ 2న గుజరాత్ జెయింట్స్, తెలుగు టైటాన్స్ మ్యాచ్‌తో పీకేఎల్ మొదలవుతుంది. ఈసారి పీకేఎల్ మ్యాచ్‌లు 12 జట్ల నగరాల్లో జరుగుతాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21తో లీగ్ దశ ముగుస్తుంది. ప్లే ఆఫ్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తారు. హైదరాబాద్ అంచె పోటీలు జనవరి 19 నుంచి 24 వరకు జరుగుతాయి. డిఫెండింగ్ చాంపియన్‌గా జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు బరిలో దిగుతున్న ఈ లీగ్‌లో బెంగాల్ వారియర్స్, బెంగళూరు బుల్స్, దబంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్, హరియాణా స్టీలర్స్, పట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ్ తలైవాస్, తెలుగు టైటాన్స్, యు ముంబా, యూపీ యోధాస్ జట్లు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి.

సాక్షి బిజినెస్

శుక్రవారం
20-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	248	65,629
నిఫ్టీ ▽	46	19,625

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	13,277	▽ 37
డోజోన్స్	33,625	▽ 40
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,500	▽ 88
డాక్స్	15,045	▽ 50
షాంఘై	3,005	▽ 53
నికాయ్	31,431	▽ 612

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (24 క్యారెట్)	59,940	△ 100
బంగారం (22 క్యారెట్)	59,700	△ 100
వెండి (కేజీ)	71,324	△ 873

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.51	84.18
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.45	102.77
€	యూరో	ఎస్‌బీఐ	86.25	89.34
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.80	56.49
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.44	53.72
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.72	61.64
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.77	23.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.33

ఐటీసీ లాభం అప్

క్యూ2లో రూ. 4,956 కోట్లు



న్యూఢిల్లీ: హోటళ్లు, ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 4,956 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 4,670 కోట్లు ఆర్జించింది. స్టాండెలోన్ లాభం సైతం 10 శాతం ఎగసి రూ. 4,927 కోట్లను తాకింది. ఇక కార్యకలాపాల మొత్తం ఆదాయం 4 శాతం వృద్ధితో రూ. 19,270 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఆగస్ట్‌లో కంపెనీ బోర్డు హోటళ్ల బిజినెస్‌ను ప్రత్యేక కంపెనీగా విడదీసేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. మొత్తం ఆదాయంలో సిగరెట్ల బిజినెస్ నుంచి 10 శాతం అధికంగా రూ. 7,657 కోట్లు, ఎఫ్‌ఎంసీజీ నుంచి 8 శాతం వృద్ధితో రూ. 5,293 కోట్లు, హోటళ్ల విభాగం నుంచి 21 శాతం అధికంగా రూ. 649 కోట్లు చొప్పున సమకూరింది. కాగా.. మొత్తం వ్యయాలు 3.5 శాతం పెరిగి రూ. 13,279 కోట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.4 శాతం నీరసించి రూ. 450 వద్ద ముగిసింది.

హెచ్‌యూఎల్ లాభం ఫ్లాట్

- క్యూ2లో రూ. 2,657 కోట్లు
- షేరుకి రూ. 18 డివిడెండ్



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై–సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం నామమాత్ర క్షీణతతో రూ. 2,657 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,670 కోట్లు ఆర్జించింది. పరిశ్రమలో నెలకొన్న తీవ్ర పోటీ లాభాలపై ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 15,253 కోట్ల నుంచి స్వల్ప వృద్ధితో రూ. 15,806 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ. 11,965 కోట్ల నుంచి రూ. 12,211 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 18 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది.

మార్జిన్లు ఓకే

సవాళ్లతో కూడిన వాతావరణంలోనూ పటిష్ట పనితీరు చూపడంతోపాటు.. నిర్వహణ(ఇబిటా) మార్జిన్లను మెరుగుపరచుకున్నట్లు హెచ్‌యూఎల్ సీఈవో, ఎండీ రోహిత్ జావా పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల డిమాండ్ మందగించగా.. పరిశ్రమలో పోటీ తీవ్రమైనట్లు తెలియజేశారు. ప్రకటనలు, ప్రమోషనల్ వ్యయాలను కోవిడ్–19 ముందుస్థాయికి పెంచినట్లు కంపెనీ సీఎఫ్‌వో రితేష్ తివారీ తెలియజేశారు. క్యూ2లో ఇందుకు రూ. 700 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో అప్రమత్తంగా వ్యవహరించనున్నట్లు రోహిత్ పేర్కొన్నారు. ఎఫ్‌ఎంసీజీ డిమాండ్ క్రమంగా పుంజుకోనున్నట్లు అంచనా వేశారు. పండుగల సీజన్, ప్రభుత్వ వ్యయాల పెంపు తదితర అంశాలు ఇందుకు దోహదపడగలవని వివరించారు. అయితే గ్లోబల్ కమోడిటీ ధరలు, పంటలపై రుతుపవన ప్రభావం వంటి అంశాలకు ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు ఎన్‌ఎస్‌ఈలో నామమాత్ర వృద్ధితో రూ. 2,550 వద్ద ముగిసింది.

నెస్లే షేర్ల విభజన

- 1:10 నిష్పత్తిలో షేర్ల జారీ
- క్యూ 3 లాభం రూ. 908 కోట్లు

న్యూఢిల్లీ: నెస్లే ఇండియా ఈ ఏడాది (2023) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్ (క్యూ3)లో నికర లాభం 37 శాతంపైగా ఎగసి రూ. 908 కోట్లను అధిగమించింది. గతేడాది (2022) ఇదే కాలంలో రూ. 661 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర అమ్మకాలు 9 శాతం పైగా వృద్ధితో రూ. 5,010 కోట్లకు చేరాయి.



1:10 నిష్పత్తిలో ఈక్విటీ షేర్లను విభజించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు నెస్లే ఇండియా తాజాగా వెల్లడించింది. వెరసి రూ. 10 ముఖ విలువగల షేరుని రూ. 1 ముఖ విలువగల 10 షేర్లుగా విభజించనుంది. అంతేకాకుండా వాటాదారులకు షేరుకి రూ. 140 చొప్పున రెండో మధ్యంతర డివిడెండును సైతం బోర్డు ప్రకటించింది.

రెండోరోజూ అమ్మకాల ఒత్తిడి

- కొనసాగిన అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం
- సెన్సెక్స్ నష్టం 248 పాయింట్లు
- 46 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ



ముంబై: బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టాలు చవిచూశాయి. దేశీయ ఐటీ కంపెనీ విప్రో క్యూ2 క్వార్టర్ ఫలితాలు మెప్పించకపోవడం, యాజమాన్యపు ఆదాయ అంచనాలు తగ్గింపు ఇన్వెస్టర్లను మరింత నిరాశపరిచాయి. మెటల్, ఇంధన, ఐటీ, విద్యుత్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 248 పాయింట్లు నష్టపోయి 65,629 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46 పాయింట్లు పతనమై 19,625 వద్ద నిలిచింది. ఇజ్రాయెయిల్ – పాలస్తీనా పరిణామాలు, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల నేపథ్యంలో ఉదయం సూచీలు నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే విక్రయాలు వెల్లువెత్తడంతో ఒక దశలో సెన్సెక్స్ 534 పాయింట్లు క్షీణించి 65,343 వద్ద, నిఫ్టీ 159 పాయింట్లు కోల్పోయి 19,512 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. అయితే కనిష్ట స్థాయిల వద్ద ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్, మీడియా, ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కొంతమేర నష్టాలు తగ్గించుకున్నాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.08%, 0.07% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,093 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.736 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కెట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

''అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు అంతకంతకూ అధికమవుతున్నాయి. ఫెడ్ రిజర్వ్ మరో దఫా వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చనే అంచనాలతో బాండ్లపై రాబడులు పెరగుతున్నాయి. దేశీయ కార్పొరేట్ క్యూ2 ఫలితాలు ఇప్పటివరకు చెప్పుకోదగిన స్థాయిలో నమోదుకాలేదు. ఈ పరిణామాలు దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాలకు కారణమయ్యాయి. అయితే ఈ ప్రతికూల పరిస్థితుల్లోనూ క్రూడాయిల్ ధరలు దిగిరావడం కొంత కలిసొచ్చే అంశం'' అని మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే తెలిపారు.

సైయంట్ లాభం 71 శాతం జంప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిజిటల్, ఇంజినీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ కంపెనీ సైయంట్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 71 శాతం ఎగసి రూ.173 కోట్లు నమోదు చేసింది. ఎబిటా రూ.244 కోట్లు, మార్జిన్ 16.5 శాతంగా ఉంది. టర్నోవర్ 22 శాతం అధికమై రూ.1,476 కోట్లకు ఎగసింది. కొత్త ఆర్డర్లు 40 శాతం దూసుకెళ్లాయి. ఫలితాల నేపథ్యంలో సైయంట్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో గురువారం 4.75 శాతం ఎగసి రూ.1,763.05 వద్ద స్థిరపడింది.

మేడిన్ ఇండియా 'పిక్సెల్'

- వచ్చే ఏడాది నుంచి మార్కెట్లో
- తాజాగా వెల్లడించిన గూగుల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్.. పిక్సెల్ సిరీస్ స్మార్ట్‌ఫోన్లను భారత్‌లో తయారు చేయాలని నిర్ణయించింది. దేశీయ మార్కెట్‌తోపాటు విదేశాలకు వీటిని సరఫరా చేస్తారు. ప్రస్తుతం ఈ మోడల్ ఫోన్లు చైనా, వియత్నాంలో ఉత్పత్తి అవుతున్నాయి. ఇటీవల విడుదలైన పిక్సెల్ 8 సిరీస్ భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా వినియోగదార్లను ఆకట్టుకుంటోంది. తొలుత పిక్సెల్ 8 మోడల్ ఫోన్లు మేడిన్ ఇండియా ట్యాగ్‌తో రానున్నాయి. పిక్సెల్ 8 ప్రో మోడల్ సైతం ఇక్కడ రూపొందే చాన్స్ ఉంది. దేశీయంగా పిక్సెల్ ఫోన్ల తయారీకై తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్, భారత్‌కు చెందిన డిక్సన్ టెక్నాలజీస్ పోటీపడుతున్నట్టు సమాచారం. 2016 నుంచి అంతర్జాతీయంగా సుమారు 4 కోట్ల పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి. ఇందులో ఒక కోటి యూనిట్లు గడిచిన 12 నెలల్లో అమ్ముడవడం విశేషం.

వచ్చే ఏడాది నుంచి..

మేడిన్ ఇండియా పిక్సెల్ స్మార్ట్‌ఫోన్స్ వచ్చే ఏడాది నుంచి అందుబాటులో ఉంటాయని గూగుల్ డివైసెస్, సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రిక్ ఓస్టెర్లో గురువారం వెల్లడించారు. ఇందుకోసం అంతర్జాతీయ, దేశీయ ఒప్పంద తయారీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటామని గూగుల్ ఫర్ ఇండియా 2023 కార్యక్రమంలో పేర్కొన్నారు. గూగుల్ తన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్లను దేశంలో తయారు చేయాలనే నిర్ణయం భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడం, అలాగే ప్రత్యర్థి చైనాతో పోటీ పడాలనే భారత లక్ష్యానికి పెద్ద ప్రోత్సాహం. క్రోమ్‌బుక్స్‌ను భారత్‌లో తయారు చేసేందుకు పర్సనల్ కంప్యూటర్ల ఉత్పత్తిలో పేరెన్నికగల హెచ్‌పీ ఇటీవలే గూగుల్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే.

భారత్‌లో ఇప్పటికే యాపిల్..

కొన్నేళ్లుగా యాపిల్ తన తయారీ స్థావరాన్ని విస్తరించాలని కోరుకుంటోంది. ఇందుకోసం చైనా+1 విధానంలో భాగంగా భారత్‌లో పలు ఉపకరణాలను అసెంబ్లింగ్ చేస్తోంది. గత నెలలో ఐఫోన్ 15 విడుదల యాపిల్ ఇండియా తయారీ ప్రణాళికలో ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది. భారత్‌లో, అలాగే చైనాలో ఉత్పత్తి అయిన ఐఫోన్స్‌ను ఒకే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లో తొలిసారిగా యాపిల్ విడుదల చేయడం ఇందుకు కారణం. సాధారణంగా భారత్‌లో యాపిల్ తాజా మోడళ్ల ఉత్పత్తి చైనా కంటే కొన్ని నెలలు వెనుకబడి ఉంటుంది. 2025 నాటికి భారత్‌లో 25 శాతం ఐఫోన్లను తయారు చేయాలని యాపిల్ లక్ష్యంగా చేసుకుంది.

జోస్ ఆలుక్కాస్ నుంచి 'ఐవి' ఆభరణాల కలెక్షన్



ముంబై: జోస్ ఆలుక్కాస్ 'ఐవి' పేరుతో కొత్త ఆభరణాల కలెక్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ముంబైలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ మోడల్ రాఫెల్లా సిక్వేరా నూతన కలెక్షన్‌ను పరిచయం చేశారు. ఉంగరాలు, గొలుసులు, నెక్లెస్‌లు, చెవిపోగులు, గాజులు ఈ ఆభరణ శ్రేణిలో ఉన్నాయి. ''మారుతున్న ట్రెండ్‌లకు అనుగుణంగా జోస్ ఆలుక్కాస్ స్థిరంగా ఆభరణాల డిజైన్లను రూపొందిస్తోంది. నేటి యువతులు కోరుకుంటున్న ప్రాధాన్యతలు, అభిరుచులకు అనుగుణంగా 'ఐవి' కలెక్షన్ తీర్చిదిద్దాము'' అని సంస్థ చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమం ఎండీలు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ అలుక్కాల సమక్షంలో జరిగింది.

భీమ జ్యువెల్స్ 'సూపర్ సర్‌ప్రైజెస్' వేడుకలు



హైదరాబాద్: భీమ జువెల్స్ తన 99 వార్షికోత్సవాన్ని 'భీమ సూపర్ సర్‌ప్రైజెస్' వేడుకలతో జరుపుకుంటోంది. ఈ సందర్భంగా కస్టమర్లకు పలు ఆఫర్లు ప్రకటించింది. బంగారం ఆభరణాలపై గ్రాముకు రూ.250 వరకు, డైమండ్ జ్యువెలరీపై క్యారెట్‌కు రూ.20 వేల వరకు, ప్లాటినం ఆభరణాలపై 10%, కేజీ వెండి ఆభరణాలపై రూ.4 వేల తగ్గింపు అందిస్తోంది. కొనుగోళ్ల స్థాయిని బట్టి తక్షణ క్యాష్‌బ్యాక్, గోల్డ్, సిల్వర్ నాణేలు, గిఫ్ట్ వోచర్లు, ఇతర మరెన్నో సర్‌ప్రైజెస్ గిఫ్ట్‌లు పొందవచ్చు. రోజువారీ, బంపర్ లక్కీ డ్రాలో కేజీ బంగారు నాణేలు గెలుకోవచ్చు. ఇద్దరు వ్యక్తులు దుబాయ్, ప్యారీస్ ట్రిప్‌ను పొందే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఉండే భీమ స్టోర్లలో నవంబర్ 13 వరకు ఆఫర్లు అందుబాటులో ఉంటాయి.

సినిమా



● ఎన్టీఆర్

ఆస్కార్ యాక్టర్ బ్రాంచ్‌లో ఎన్టీఆర్

ఎన్టీఆర్‌కు అరుదైన గౌరవం లభించింది. ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ (ఆస్కార్ కమిటీ) తాజాగా వెల్లడించిన మెంబర్ క్లాస్ ఆఫ్ యాక్టర్స్ జాబితాలో ఎన్టీఆర్‌కు చోటు దక్కింది. ఎన్టీఆర్‌తో పాటు అమెరికన్ నటుడు కె. హ్యు క్వాన్, అమెరిక్ నటి మార్షా స్టెఫానీ బ్లేక్, ఐరిస్ నటి కెర్రీ కాండన్, అమెరికన్ కమ్ కెనెడియన్ నటి రోసా సలాజర్‌లు ఈ జాబితాలో నమోదయ్యారు. ''వెండితెరపై తమ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా ఎందరినో ఆకర్షించారు. అంకితభావంతో అద్భుతంగా హావభావాలను ప్రదర్శించారు. వాస్తవానికి, కల్పితానికి మధ్య వారధులుగా నిలిచారు. అలాంటి వారిని 'యాక్టర్స్ బ్రాంచ్'లోకి ఆహ్వానిస్తున్నాం'' అని సోషల్ మీడియా వేదికగా అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇక 96వ ఆస్కార్ అవార్డుల ప్రదానం వచ్చే ఏడాది మార్చిలో జరుగనుంది.

స్పెయిన్‌లో వార్ 2: ప్రస్తుతం తెలుగులో 'దేవర' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు ఎన్టీఆర్. అటు హిందీలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో 'వార్ 2' చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లో ప్రారంభమైందట. నవంబరు చివరి వారంలో 'వార్ 2' సెట్స్‌లో ఎన్టీఆర్ జాయిన్ అవుతారని భోగట్టా.



● వరుణ్ తేజ్

ఆపరేషన్ ముగిసింది

ఆపరేషన్ వాలెంటైన్ ముగిసింది. వరుణ్ తేజ్ హీరోగా నటించిన ద్విభాషా (తెలుగు–హిందీ) చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్‌గా నటించారు వరుణ్ తేజ్. హీరోయిన్ మానుషీ చిల్లర్ రేడార్ ఆఫీసర్‌గా నటించగా, నవదీప్ ఓ కీలక పాత్ర చేశారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో సందీప్ ముద్దా ఈ సినిమాను నిర్మించారు. ''వైమానిక దాడుల్లో మన దేశ వైమానిక దళం హీరోలు, వారు ఎదుర్కొన్న సవాళ్లను చూపించే ప్రయత్నంగా ఈ సినిమాను తెరకెక్కించాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని యూనిట్ పేర్కొంది.

వచ్చే ఏడాది భ్రమ యుగం



● భ్రమ యుగంలో మమ్ముట్టి

మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించిన హారర్–థ్రిల్లర్ ఫిల్మ్ 'భ్రమ యుగం'. రాహుల్ సదాశివన్ రచన–దర్శకత్వంలో చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ నిర్మాతలు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. వచ్చే ఏడాది ప్రారంభంలో ఏకకాలంలో మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ''ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభమైన ఈ సినిమాను ఒట్టపాలెం, కొచ్చి, అతిరాపల్లి వంటి లొకేషన్స్‌లో చిత్రీకరించాం. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

తళుకుమను తార...



● ప్రభాకర్

'బాహుబలి' ప్రభాకర్ లీడ్ రోల్‌లో పాలిక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రౌద్ర రూపాయ నమః'. రావుల రమేష్ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. జాన్ భూషణ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'తళుకు తళుకుమను తార..' అంటూ సాగే సెకండ్ లిరికల్ వీడియో సాంగ్‌ని సాయి కుమార్ రిలీజ్ చేశారు. ఈ పాటను సురేష్ గంగుల రచించారు. ''ఈ సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరురావాలి'' అన్నారు సాయి కుమార్. ''మా చిత్రాన్ని ప్రేక్షకులు హిట్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు రావుల రమేష్. ''ప్రభాకర్ నటన మా చిత్రానికి ఆయువుపట్టు'' అన్నారు పాలిక్.

ఆయన దయ వల్లే ఈ హోదా - జానీ మాస్టర్



● ప్రమాణ స్వీకారం చేస్తున్న జానీ

''ఈ రోజు మాకు (డ్యాన్స్ మాస్టర్స్) ఇంత పేరు, హోదా వచ్చి కార్లలో తిరుగుతున్నామంటే, 'తెలుగు ఫిలిం అండ్ టీవీ డ్యాన్సర్స్– డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్' ఈ స్థాయిలో ఉందంటే కారణం ముక్కు రాజు మాస్టర్. యూనియన్ తరఫున ఆయన వారసురాలికి చిరు కానుకగా రూ. రెండు లక్షలు ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అని 'తెలుగు ఫిలిం అండ్ టీవీ డ్యాన్సర్స్– డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్' నూతన అధ్యక్షుడు జానీ మాస్టర్ అన్నారు. 'తెలుగు ఫిలిం అండ్ టీవీ డ్యాన్సర్స్– డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్' అధ్యక్షుడిగా గురువారం హైదరాబాద్‌లో జానీ మాస్టర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్ దామోదర ప్రసాద్, మద్రాస్ డ్యాన్స్ యూనియన్ ప్రెసిడెంట్ దినేష్ మాస్టర్ అతిథులుగా హాజరయ్యారు. ''మా యూనియన్ సొంత స్థలం, భవనం కోసం కృషి చేస్తా'' అన్నారు జానీ మాస్టర్.



● సాయికిరణ్, శ్రీ విష్ణు, యశ్వంత్

భయానక చిత్రం

శ్రీకాంత్ శ్రీరామ్, ఖుషీ రవి జంటగా సాయికిరణ్ దైదా దర్శకత్వం వహించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' (భయానక చిత్రం) ఉపశీర్షిక. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ చిత్రం టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని హీరో శ్రీ విష్ణు ఆవిష్కరించారు. ''ఈ చిత్రకథ ప్రస్తుతం, 1990, 1930.. ఇలా మూడు కాలాల్లో జరుగుతుంది. నవంబర్‌లో సినిమా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు సాయికిరణ్ దైదా, యశ్వంత్ దగ్గుమాటి.

మధ్యంతర బెయిల్ కుదరదు

హైకోర్టులో చంద్రబాబుకు మరోసారి ఎదురుదెబ్బ

సాక్షి, అమరావతి : స్కిల్ స్కాంలో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు రాష్ట్ర హైకోర్టు మరోసారి ఝలక్ ఇచ్చింది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు కుదరదని తేల్చిచెప్పింది. అలాగే, ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని.. ఈ వ్యాజ్యం తేలేలోపు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన ప్రధాన పిటిషన్, అనుబంధ పిటిషన్ల తదుపరి విచారణను వాయిదా వేసింది. మరోవైపు.. ఈ విషయంలో చంద్రబాబు దాఖలు చేసిన వ్యాజ్యాలను దసరా సెలవుల్లో అత్యవసర కేసుల విచారణకు ఏర్పాటయ్యే వెకేషన్ కోర్టు ముందుంచుతూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాదులు చేసిన అభ్యర్థన మేరకు హైకోర్టు ఈ మేర ఉత్తర్వులిచ్చింది. నిజానికి.. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు హైకోర్టు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో మరో న్యాయమూర్తి ముందు మధ్యంతర బెయిల్ కోసం వాదనలు వినిపించేందుకు వీలుగా చంద్రబాబు న్యాయవాదులు వెకేషన్ కోర్టు ముందుంచాలన్న అభ్యర్థనను తెరపైకి తెచ్చారు. ఇదే సమయంలో.. చంద్రబాబు కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వారు కోర్టు దృష్టికి తీసుకురావడంతో, చట్ట ప్రకారం ఆయనకు జైలులో తగిన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. అంతేకాక.. తదుపరి విచారణ సమయంలో చంద్రబాబు వైద్య నివేదికలను కోర్టు ముందుంచాలని కూడా జైలు అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అయితే, ఈ బెయిల్ పిటిషన్లు ఎప్పుడు విచారణకు వస్తాయి.. ఏ జడ్జి ముందు విచారణకు వస్తాయన్న విషయాలు రెండు మూడ్రోజుల్లో తెలిసే అవకాశముంది.

మధ్యాహ్నం తరువాత మారిన స్వరం..

తిరిగి మధ్యాహ్నం విచారణ మొదలు కాగా, చంద్రబాబు న్యాయవాదులు వ్యూహాన్ని మార్చారు. మధ్యంతర బెయిల్ సాధ్యంకాదని హైకోర్టు తేల్చిచెప్పడంతో కొత్త అభ్యర్థనను తెరపైకి తెచ్చారు. మరో న్యాయమూర్తి ముందు మధ్యంతర బెయిల్ కోసం ప్రయత్నాలు చేసుకునేందుకు వీలుగా, తమ బెయిల్, మధ్యంతర బెయిల్ వ్యాజ్యాలను దసరా సెలవుల్లో అత్యవసర కేసులను విచారించేందుకు ఏర్పాటయ్యే వెకేషన్ కోర్టు ముందుంచాలని న్యాయమూర్తిని అభ్యర్థించారు. దీంతో న్యాయమూర్తి వారి అభ్యర్థనపట్ల సానుకూలంగా స్పందించి ఆ మేర ఉత్తర్వులు జారీచేశారు.

చంద్రబాబుకు చర్మ సమస్యలున్నాయి..

ఈ సందర్భంగా చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్‌లు వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు ఆరోగ్యస్థితికి సంబంధించిన వైద్య నివేదికలను మెమో రూపంలో కోర్టు ముందుంచామని చెప్పారు. చంద్రబాబుకు కొన్ని వైద్య పరీక్షలు అవసరమని వైద్యులు ఆ నివేదికల్లో పేర్కొన్నారని వివరించారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. సుప్రీంకోర్టు 17ఏపై తీర్పును రిజర్వ్ చేసింది కదా, ఆ తీర్పు ప్రభావం ఈ పిటిషన్లపై ఉంటుంది కదా? అని ప్రశ్నించారు. కొంతమేర ఉంటుందని, అందుకే తాము ప్రధాన బెయిల్ పిటిషన్‌లో వాదనలు వినిపించడం లేదని, మధ్యంతర బెయిల్ కోసం దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యంలో వాదనలు వినిపిస్తున్నామని లూథ్రా, దమ్మాలపాటి చెప్పారు. మధ్యంతర బెయిల్ ఇచ్చే అధికారం కోర్టుకు ఉందన్నారు. ఈ సమయంలో జడ్జి జోక్యం చేసుకుంటూ.. సుప్రీంకోర్టు తీర్పు కోసం వేచిచూడటం మంచిదన్నారు. ఆ తీర్పు ప్రభావం ఈ వ్యాజ్యాలపై ఉన్నప్పుడు, ఆ తీర్పు కోసం వేచిచూడటంలో తప్పులేదన్నారు.

మధ్యంతర బెయిల్‌ను 'సుప్రీం' తోసిపుచ్చింది..

అనంతరం.. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలన్న చంద్రబాబు అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించిందన్నారు. అందువల్ల మధ్యంతర బెయిల్ మంజూరు చేయడానికి వీల్లేదన్నారు. అసలు చట్టంలో ఎక్కడా కూడా మధ్యంతర బెయిల్ ప్రస్తావనే లేదని తెలిపారు. ఈ సమయంలో లూథ్రా జోక్యం చేసుకుంటూ.. అదనపు ఏజీ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బెయిల్ పిటిషన్ 19న హైకోర్టులో ఉందని ప్రభుత్వ న్యాయవాదులు చెప్పడంతో తమ మధ్యంతర బెయిల్ అభ్యర్థనను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. అనంతరం న్యాయమూర్తి స్పందిస్తూ.. మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం సాధ్యంకాదని తేల్చిచెప్పారు. వైద్య పరీక్షల విషయంలో ఏం చేయాలగమో అది చేస్తామన్నారు. వ్యక్తిగత వైద్యునితో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు అనుమతిచ్చే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. దీనిపై పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అభ్యంతరం చెప్పారు. తామే వైద్య పరీక్షలు చేయించి తామే తిరిగి జైలుకు తీసుకొస్తామన్నారు. వ్యక్తిగత వైద్యునితో వైద్య పరీక్షలకు మీకేం అభ్యంతరమని న్యాయమూర్తి ప్రశ్నించారు. దీనిపై తాను అధికారులతో మాట్లాడి చెప్పాల్సి ఉంటుందని, అందువల్ల విచారణను కొద్దిసేపు వాయిదా వేయాలని కోర్టును కోరారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను మ. 2.15 గంటలకు వాయిదా వేశారు.



మంచిర్యాల జిల్లా సోమగూడెం-బెల్లంపల్లి గ్రామాల మధ్య కల్వరి మినిస్ట్రీ ఆధ్వర్యంలో సోమగూడెంలోని కల్వరి చర్చి ప్రాంగణంలో 50 రోజులుగా సాగుతున్న ఉపవాస ప్రార్థనలు గురువారం ముగిశాయి. దీక్షల ముగింపు సభలో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశం నలుమూలల నుంచి క్రైస్తవులు లక్షకు పైగా తరలి వచ్చారు.

అవినీతిపరులకు '17ఏ' రక్షణ కవచం కాదు

- ఈ నెల 7న పట్నా హైకోర్టు స్పష్టమైన తీర్పు
- ఇదే విధమైన సీబీఐ వాదనలతో ఏకీభవించిన కర్ణాటక హైకోర్టు
- కర్ణాటక హోం మంత్రి డీకే శివకుమార్‌పై విచారణకు అనుమతి

'అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ అంటే అవినీతి నుంచి కాపాడే రక్షణ కవచం కాదు. అవినీతి కేసుల్లో నిందితులు తప్పించుకునే సాధనం కాదు. అవినీతికి పాల్పడిన వారు ఆ కేసుల నుంచి తప్పించుకొనేందుకు అపాయింటింగ్ అథారిటీ ముందస్తు అనుమతి తప్పనిసరి కాదు'

– పట్నా హైకోర్టు

'సెక్షన్ 17 ఏ అమలులోకి రావడానికి ముందు అంటే 2018 జులై 26కి ముందు వ్యవహారాలకు ఈ చట్టం కింద రక్షణ లభించదు. అంతేకాదు అవినీతికి పాల్పడడం, ఉద్దేశపూర్వంగా అవినీతి చేయటం అన్నవి ప్రభుత్వ విధుల నిర్వహణ కిందకు రావు'

– డీకే శివకుమార్ కేసులో కర్ణాటక హైకోర్టులో సీబీఐ వాదనలు. ఈ వాదనలతో కర్ణాటక హైకోర్టు ఏకీభవించింది.

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి అరెస్టయిన మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17 ఏ ను అడ్డంపెట్టుకొని బయటపడాలని చేస్తున్న ప్రయత్నాలు చెల్లవని పట్నా, కర్ణాటక హైకోర్టులు రెండు వేర్వేరు కేసుల్లో ఇచ్చిన తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. సెక్షన్ 17ఏ అవినీతిపరులకు రక్షణ కవచం కాదని ఈనెల 7న పట్నా హైకోర్టు విస్పష్టమైన తీర్పు ఇచ్చింది. సెక్షన్ 17 ఏ ప్రకారం అపాయింటింగ్ అథారిటీ నుంచి సీబీఐ ముందస్తు అనుమతి తీసుకోలేదంటూ కర్ణాటక హోం మంత్రి డీకే శివకుమార్ చేసిన వాదనను కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది. సెక్షన్ 17ఏ అమలులోకి రాకముందే శివకుమార్‌పై కేసు నమోదు చేసినందున అపాయింటింగ్ అథారిటీ ముందస్తు అనుమతి అవసరంలేదన్న సీబీఐ వాదనలతో కర్ణాటక హైకోర్టు ఏకీభవించింది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేయడం, రిమాండ్‌కు పంపడం న్యాయపరంగా సరైనదేనని ఈ తీర్పుల ద్వారా స్పష్టమవుతోందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. చంద్రబాబు వేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నయని అభిప్రాయపడుతున్నారు.

ఇదీ బీహార్ కేసు

బీహార్ రాష్ట్రం ఈస్ట్ చంపారన్ జిల్లాలోని సుగాలి పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కిశోర్ కుమార్ అక్రమంగా మద్య రవాణా చేస్తున్న వారిని విడిచిపెట్టారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన్ని చకియాకు బదిలీ చేశారు. ఆయన చకియాకు బదిలీ అయిన తరువాత సుగాలి పోలీసు స్టేషన్‌లో మూసివేసిన ఓ కేసును మళ్లీ నమోదు చేసి సంబంధిత వ్యక్తుల నుంచి లంచం వసూలు చేశారు. దీంతో ఆ జిల్లా ఎస్పీకి ఆయన్ని అరెస్ట్ చేసి, సస్పెండ్ చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ కిశోర్ కుమార్ పట్నా హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. సెక్షన్ 17ఏ కింద తనను అరెస్టు చేయాలంటే అపాయింటింగ్ అథారిటీ అనుమతి ఉండాలని వాదించారు. పట్నా హైకోర్టు ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది. అవినీతి నిరూపితమైనందున ఆయన అరెస్టుకు అపాయింటింగ్ అథారిటీ ముందస్తు అనుమతి అవసరం లేదని తేల్చి చెప్పింది. సెక్షన్ 17ఏను అడ్డంపెట్టుకుని అవినీతి కేసుల నుంచి తప్పించుకోలేరని కూడా స్పష్టంగా చెప్పింది.

ఇదీ శివకుమార్ కేసు..

సెక్షన్ 17 ఏ 'ను సాకుగా చూపిస్తూ సీబీఐ కేసు నుంచి తప్పించుకోవాలని యత్నించి కర్ణాటక హోం మంత్రి డీకే శివకుమార్ కూడా భంగపడ్డారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద తొలుత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శివకుమార్‌పై దర్యాప్తు చేపట్టింది. దీని ఆసరాగా 2017లో ఆదాయ పన్ను శాఖ శివకుమార్‌పై దాడులు నిర్వహించింది. తదనంతరం ఆయనపై సీబీఐ కేసు నమోదు చేసింది. దీనిని కర్ణాటక హైకోర్టులో శివకుమార్ సవాలు చేశారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ ప్రకారం అపాయింటింగ్ అథారిటీ ముందస్తు అనుమతి తీసుకోనందున ఈ కేసు చెల్లదని వాదనలు వినిపించారు. ఈ వాదనలను సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. సెక్షన్ 17 ఏ అమల్లోకి రావడానికి (2018 జులై 26కి) ముందు జరిగిన వ్యవహారాలకు ఈ చట్టం కింద రక్షణ లభించదని చెప్పింది. శివకుమార్ 2013 నుంచి 2018 ఏప్రిల్ మధ్య అవినీతికి పాల్పడినందున ఆయనకు ఈ సెక్షన్ వర్తించదని తెలిపింది. అంతే కాదు.. అవినీతికి పాల్పడడం, ఉద్దేశపూర్వంగా అవినీతి చేయటం ప్రభుత్వ విధుల నిర్వహణ కిందకు రావని కూడా చెప్పింది. ఈ కేసులో సీబీఐ తరఫున ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఆయన వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. శివకుమార్ వినతిని తిరస్కరించింది. ఏపీలో స్కిల్ స్కామ్ కేసులో కూడా సీఐడీ తరఫున రోహత్గీనే సుప్రీం కోర్టులో వాదనలు వినిపిస్తున్నారు.

చంద్రబాబువీ అవే అడ్డగోలు వాదనలు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడిన చంద్రబాబు, టీడీపీ నేతలు కూడా ఇదే అడ్డగోలు వాదన వినిపిస్తున్నారు. సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ ముందస్తు అనుమతి తీసుకోనందున అరెస్ట్ చెల్లదని, కేసు కొట్టివేయాలని వాదిస్తున్నారు. ఈ వాదనను సీఐడీ న్యాయవాదులు సమర్థంగా తిప్పికొట్టారు. అవినీతి వ్యవహారాల నుంచి గంపగుత్తగా రక్షణ కల్పించడం సెక్షన్ 17ఏ ఉద్దేశం కాదని వాదించారు. ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు గానీ ప్రభుత్వ అధికారులుగానీ ఉద్దేశపూర్వకంగా ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడితే వారికి కేసుల నుంచి సెక్షన్ 17ఏ రక్షణ కల్పించదని చెప్పారు. అటువంటి వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసేందుకు ముందస్తు అనుమతి అవసరం లేదని వివిధ తీర్పులను ఉదహరించారు. చంద్రబాబు అరెస్టుకు గవర్నర్ అనుమతి అవసరం లేదని చెప్పారు. సీఐడీ న్యాయవాదుల వాదనలను పట్నా, కర్ణాటక కేసులు బలపరుస్తున్నాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. చంద్రబాబు ఈ సెక్షన్ ద్వారా రక్షణ పొందడానికి ఏ విధంగా అర్హులు కారో వారు విశ్లేషించి మరీ చెబుతున్నారు.

- కళ్ల ముందు అవినీతి కనిపిస్తున్నప్పుడు సెక్షన్ 17ఏ వర్తించదని కోర్టు చెప్పింది. స్కిల్ స్కామ్‌లో కూడా ప్రజాధనం రూ.371 కోట్లు కొల్లగొట్టిన విషయం నిర్ధారణ అయ్యింది. నకిలీ ఇన్వాయిస్‌లతో ప్రభుత్వ ధనాన్ని అక్రమంగా దారిమళ్లించారని కేంద్ర జీఎస్టీ అధికారులు కూడా నిగ్గు తేల్చారు. అంటే ప్రజాధనం దుర్వినియోగమైందన్నది సుస్పష్టం. కాబట్టి చంద్రబాబుకు సెక్షన్ 17ఏ కింద రక్షణ పొందలేరన్నది నిర్ధారణ అయ్యింది.
- ఉద్దేశపూర్వకంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినా సెక్షన్ 17ఏ కింద రక్షణ లభించదని పట్నా హైకోర్టు చెప్పింది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు పూర్తి అవగాహనతోనే అవినీతికి పాల్పడ్డారు. ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల అభ్యంతరాలను బేఖాతరు చేశారు. ప్రైవేటు వ్యక్తి గంటా సుబ్బారావుకు నాలుగు కీలక పోస్టులు కట్టబెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేయాలని ఆదేశిస్తూ నోట్ ఫైళ్లపై 13 సంతకాలు చేశారు. కాబట్టి ఈ కేసులో చంద్రబాబుకు సెక్షన్ 17ఏ వర్తించదన్నది సుస్పష్టం.
- సెక్షన్ 17ఏ అమలులోకి రావడానికి (2018 జులై 26కి) ముందే 2017 మే లోనే స్కిల్ స్కామ్‌లో కేంద్ర జీఎస్టీ విభాగం కేసు నమోదు చేసింది. ఏపీ ఏసీబీకి 2018 ఫిబ్రవరిలోనే ఆ విషయాన్ని తెలిపింది. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసును తొక్కిపెట్టింది. కాబట్టి ఈ కేసులో సెక్షన్ 17 ఏ వర్తించదు అన్నది కర్ణాటకలో డీకే శివకుమార్ కేసు ద్వారా స్పష్టమైంది. స్కిల్ స్కామ్‌లో అప్పటి సీఎం చంద్రబాబుతో పాటు ప్రైవేటు వ్యక్తులు కూడా నిందితులుగా ఉన్నారు. ప్రైవేటు వ్యక్తులతో కలిపి ప్రజాప్రతినిధిపై కేసు పెట్టడం చెల్లదన్న డీకే శివకుమార్ వాదనను కూడా కోర్టు తిరస్కరించింది.
- సెక్షన్ 17ఏ ముసుగులో అవినీతి కేసుల నుంచి తప్పించుకోలేరని పట్నా హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రస్తుతం చంద్రబాబు ఈ కుంభకోణం నుంచి బటయపడటానికి ఆ కోణంలోనే ప్రయత్నిస్తున్నారు. తాను అవినీతికి పాల్పడలేదని గానీ, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరగలేదని గానీ ఆయన చెప్పడం లేదు. సెక్షన్ 17ఏ ప్రకారం తనపై సీఐడీ నమోదు చేసిన కేసు చెల్లదని మాత్రమే చెబుతున్నారు. అందువల్ల స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పూర్తిగా అసంబద్ధమని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.